
■11లో..



వడ్డించేవారు.. తింటారా?

- భోజన పథకానికి నాసిరకం గుడ్లు సరఫరా
- నాణ్యత లేక కుళ్లిన కంపు కొడుతున్న వైనం
- జిల్లావ్యాప్తంగా కోడిగుడ్ల కాంట్రాక్టర్ల కక్కుర్తి..
- రెండున్నర లక్షల మందికి సక్రమంగా అందని పౌష్టికాహారం
- విద్యార్థుల ఆరోగ్యంతో ఆటలు.. చోద్యం చూస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



పశ్చిమగోదావరి
12
సోమవారం 21 ఆగస్టు 2017

చెట్ల కింద చదువులు



- భీమవరం మండలం దేగాపురంలో పాఠశాల భవనం లేక ఆరుబయటే విద్యా బోధన

- మారని ప్రభుత్వ పాఠశాలల తీరు
- విద్యార్థులు ఉంటే సౌకర్యాలు ఉండవు
- సౌకర్యాలు ఉన్నచోట విద్యార్థుల కొరత
- దేగాపురంలో ఆరు బయటే విద్యాభ్యాసం
- నిధులు మంజూరు కాకుండానే పాత భవనాన్ని తొలగించిన అధికారులు
- కాంబొట్లపాలెంలో మధ్యలోనే నిలిచిన పాఠశాల భవన నిర్మాణం
- పంచాయతీ కార్యాలయంలోని ఓ గదిలో ఐదు తరగతులకు పాఠాలు బోధన

■12లో..



సెర్చ్

- ఏలూరులో పోలీసులతో కార్డన్ సెర్చ్.. భారీగా గంజాయి స్వాధీనం
- ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు

■11లో..

చెత్త పై కొత్త ప్రయోగం

- గ్రామాల్లో చెత్త తరలింపుపై సరికొత్త సాఫ్ట్‌వేర్
- చెత్త తీసుకు వెళ్లారా.. లేదా.. తెలియజేసే రేడియో ఫ్రీక్వెన్సీ గుర్తింపు కార్డు
- ఇంటింటికి పంపిణీ.. డ్యాష్ బోర్డుకు లింకు
- పశ్చిమలో ప్రయోగాత్మకంగా అమలు చేయాలని నిర్ణయం
- చెత్త సేకరణ బాధ్యత గ్రీన్ అంబాసిడర్లదే
- తరలింపునకు గ్రీన్ వెహికల్స్

■ వివరాలు 11వ పేజీలో..

పందుల మందలు

వెంటాడుతున్న కుక్కలు

- రోడ్లపై విచ్చలవిడిగా.. పందులు, కుక్కల స్వైర విహారం
- బైక్‌లకు అడ్డంగా రావడంతో తరచూ ప్రమాదాలు..
- గాయపడుతున్న వాహనదారులు
- దాడి చేస్తున్న కుక్కలు
- అదుపు చేయని మున్సిపల్ అధికారులు



తాడేపల్లిగూడెంలో ప్రాణ సంకటంగా మారిన పందులు, కుక్కల విహారం



- తాడేపల్లిగూడెంలో వెంకట్రావు మోటారు సైకిల్ మీద భార్యా, పిల్లలతో వెళుతున్నాడు. ఇంతలో సడన్‌గా ఓ పంది రోడ్డుకు అడ్డంగా వచ్చేయడంతో అతను దానిని ఢీకొట్టి పడిపోయాడు. తనతోసహా భార్యా పిల్లలకు తీవ్ర గాయాలయ్యాయి. పదిహేను రోజులు వైద్యం చేయించుకోవాల్సి వచ్చింది.
- పాలకొల్లులో సుబ్బారావు నడిచి వెళుతుండగా.. ఓ కుక్క అతని వెంటపడింది. కండ పట్టి పీకేసింది. చాలాసేపు పోరాడి బతుకుజీవుడా అనుకుంటూ ఆస్పత్రికి వెళ్లాడు.
- తణుకులో ఓ కుక్క రోడ్డుకు అడ్డంగా రావడంతో బైక్ మీద వెళుతున్న ఓ వ్యక్తి పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు.
- రెండు రోజుల క్రితం నెల్లూరు జిల్లా కావలిలో ఓ వృద్ధురాలిపై పందులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి.
- జిల్లాలో ఇటువంటి ఘటనలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. వెలుగుచూసేవి కొన్ని.. చూడనివి మరెన్నో..

7వ పేజీలో..



ఫైర్

- కొవ్వూరు హెయిర్ ఇండస్ట్రీలో అగ్ని ప్రమాదం
- ఆరు కోట్ల విలువైన జుట్టు ఆహుతి
- విద్యుత్ షార్ట్ సర్క్యూటే కారణమని అనుమానం

■2లో..

వేర్వేరు ఘటనలు ఇద్దరి మృతి

- మోటారు సైకిల్ ప్రమాదంలో ఒకరు..
- రైలు పట్టాలు దాటుతూ మహిళ..

ఇద్దరి గల్లంతు

- గోదావరిలో స్నానానికి దిగి యువకుడి గల్లంతు
- తమ్మిలేరులో మత్స్యకారుడు గల్లంతు

■2, 5ల్లో..

హెయిర్..ఫైర్




అగ్నికి ఆహుతైన హెయిర్,(ఇన్‌సెట్‌లో) ప్రమాద సమయంలో మంటలు

కొవ్వూరు గాయత్రి హెయిర్ ఇండస్ట్రీస్‌లో అగ్ని ప్రమాదం

రూ.ఆరు కోట్ల విలువైన తల వెంట్రుకలు దగ్ధం

విద్యుత్ షార్ట్ సర్క్యూటే కారణం

కొవ్వూరు : కొవ్వూరు గాయత్రి హెయిర్ ఇండస్ట్రీస్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరగడంతో సుమారు ఆరు కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. పట్టణంలోని మూడు డాబాల వీధిలో నారాయణ పాఠశాల సమీపంలో ఉన్న గాయత్రి హెయిర్ ఇండస్ట్రీస్ స్టాక్ గొడౌన్‌లో ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంట లు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో గొడౌన్‌లో ఉన్న సుమారు ఆరు కోట్ల రూపాయల విలువైన వెంట్రుకలు అగ్నికి ఆహుతై నష్టం వాటిల్లింది. ఉదయం 5.30 సమయంలో స్థానికులు హెయిర్ ఇండస్ట్రీస్ నుంచి అధికంగా పొగ, దుర్వాసన రావడంతో యజమాని మారిశెట్టి వెంకటేశ్వర రావుకు సమాచారం అందించారు. యాజమాన్యం ఫైర్‌సిబ్బందికి తెలపడంతో ఫైర్ అధికారి కె. సత్యానందం ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని కిటికీలు బద్దలుకొట్టి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాద సయంలో గొడౌన్‌లో తొమ్మిదిన్నర టన్నుల హెయిర్ ఉండగా నాలుగున్నర టన్నుల హెయిర్ బుగ్గిపాలైంది. సమాచారం తెలుసుకున్న జిల్లా అసిస్టెంట్ ఫైర్ అధికారి వై. హనుమంతరావు ఏలూరు నుంచి కొవ్వూరు వచ్చి సంఘటనా స్థలిని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను సీసీ టీవీ ఫుటేజ్ ద్వారా పరిశీలించారు. అనంతరం స్టాక్ రిజిస్టార్‌లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీసీ టీవీ పుటేజ్‌లను పరిశీలించగా ఆదివారం తెల్లవారు జామున 3 గంటల 1 నిముషానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగిందన్నారు. సుమారు రూ. ఆరు కోట్ల హెయిర్ అగ్నికి ఆహుతి అయ్యిందన్నారు. ఫ్యాక్టరీ యజమాని మారిశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సెప్టెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు సీజన్ కావడంతో దేవాలయాల నుంచి అధిక మొత్తంలో హెయిర్‌ను కొనుగోలు చేశామని, సుమారు రూ.6 కోట్ల విలువైన హెయిర్ అగ్నికి ఆహుతి అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ఈ ప్రమాదంపై యజమాని వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ప్రసాదరావు తెలిపారు.



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది



కాలిపోయిన హెయిర్



ఆలయంలో అర్చకుడి బంధువులతో మాట్లాడుతున్న దేవాదాయ శాఖాధికారులు

భీమడోలు భీమేశ్వరస్వామి
ఆలయ అర్చకుడి తొలగింపు

భీమడోలు : నిబంధనలకు విరుద్ధంగా ఆలయ భూములను విక్రయించిన భీమడోలు పార్వతీ సమేత భీమేశ్వరస్వామి ఆలయ డిప్యూటీ అర్చకుడు కాళ్ళకూరి సాంబశివశర్మను విధుల నుంచి అధికారులు తొలగించారు. అర్చకత్వ బాధ్యతలను కొత్త అర్చకుడికి కేటాయించారు. ఆదివారం దేవాదాయ ధర్మాదాయశాఖ ఏలూరు డివిజన్ టెంపుల్స్ ఇన్‌స్పెక్టర్ కె.వి.అనురాధ, ఈవోలు వి.ఆంజనేయరాజు, ఎ.రవిశంకర్, కె.జగదీశ్వరరావు, సీహెచ్ చిననాగేశ్వరరావు సంబంధిత విధుల బహిష్కరణ పత్రాలతో భీమడోలు వచ్చారు. దేవాదాయధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ ఆదేశాల మేరకు భీమేశ్వర స్వామి ఆలయాన్ని స్వాధీనపరుచుకుని వంశపారంపర్య అర్చకత్వం తరపున ఇప్పటివరకు పనిచేసిన సాంబశివశర్మను విధుల నుంచి తొలగిస్తున్నట్టు ప్రకటించి ఆలయానికి తాళాలు వేశారు. ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్న సాంబశివశర్మ నిబంధనలకు విరుద్ధంగా అర్చక సర్వీసు భూమిని విక్రయించడం, అర్చక క్వార్టర్స్‌లోని కొంత భాగాన్ని ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇవ్వడం, భక్తుల పట్ల అమర్యాదంగా ప్రవర్తించడం, అర్చక విధులను సక్రమంగా నిర్వర్తించకపోవడం, మైలుతో స్వామి వారి గర్భాలయంలో అభిషేకాలు, పూజలు నిర్వహించడం వంటి భక్తుల అభియోగాలపై ఇటీవల అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఫిర్యాదులన్నీ వాస్తవాలుగా ధృవీకరించి సాంబశివశర్మను విధుల నుంచి బహిష్కరిస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ సభ్యులు, గ్రామపెద్దల సమక్షంలో ఆలయాన్ని స్వాధీనం పరుచుకుని తాళాలు వేశారు. ఇదిలా వుంటే ఆలయంలో ఇంత వ్యవహారం జరుగుతున్నప్పటికీ సంబంధిత అర్చకుడు ఆలయానికి రాకపోగా ఆలయ తాళాలు, వస్తువులు, స్వామివారి ఆభరణాల వివరాలను అధికారులకు అందజేయకపోవడం గమనార్హం. దీంతో వీఆర్‌వో, గ్రామసర్పంచ్, ఎండోమెంట్ అధికారుల సమక్షంలో ఆలయ తాళాలు పగులగొట్టి వస్తువుల ఆభరణాల వివరాలను సేకరించి పంచనామా నిర్వహించారు. అయితే అధికారుల వద్దకు వచ్చిన ఆలయ అర్చకుడి కుమార్తె రెండురోజుల గడువు కావాలని, తన తండ్రి సాంబశివశర్మ ఆసుపత్రిలో ఉన్నాడంటూ చెప్పడం గమనార్హం. ఆలయ నిబంధనలకు విరుద్ధం కావడంతో అర్చకుడిపై చర్యలు తీసుకున్నట్టు ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ అనురాధ విలేకరులకు తెలిపారు. ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ యర్రంశెట్టి సాంబశివరావు, గ్రామసర్పంచ్ పైడిమాల శిరీషయుగంధర్, ట్రస్టుబోర్డు సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకుని వస్తూ...

అమ్మవారి మొక్కులు తీర్చుకుని ఆనందంగా ఇంటికి బయల్దేరిన వారిద్దరూ ఇంటికి చేరలేదు.. విధి చిన్నచూపు చూడడంతో మార్గంమధ్యలో మృత్యువాత పడి వారి కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగిల్చారు.. గుబ్బల మంగమ్మతల్లిని దర్శించుకుని తిరిగి వస్తూ బుట్టాయగూడెం మండలం పందిరి మామిడిగూడెం సమీపంలో జరిగిన మోటార్‌సైకిల్ ప్రమాదంలో ఒక గిరిజనుడు మృతి చెందాడు. కుమార్తెకు వివాహం అవ్వడంతో విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి మొక్కు తీర్చుకుని వస్తూ ఆకివీడు రైల్వే స్టేషన్‌లో రైలు ఢీకొని ఒక మహిళ దుర్మరణం పాల్పయింది.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

● గుబ్బల మంగమ్మను దర్శించుకుని వస్తూ మోటార్‌సైకిల్ ప్రమాదంలో..

బుట్టాయగూడెం : గుబ్బల మంగమ్మతల్లిని దర్శించుకుని తిరిగి వస్తూ మరో పది నిమిషాల్లో ఇంటికి చేరతామనగా జరిగిన రోడ్డు ప్రమాదంలో పడమట రేగులకుంటకు చెందిన గిరిజనుడు బరగడ వెంకటేశ్వరావు(45) మృతి చెందాడు. వెంకటేశ్వరావు ఆదివారం అమ్మవారి మొక్కు తీర్చుకునేందుకు బంధు మిత్రులు, కొందరు గ్రామస్థులతో గుబ్బల మంగమ్మ గుడికి వెళ్ళాడు. మొక్కులు తీర్చుకుని సాయంత్రం కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు ట్రాక్టరులో తిరుగు ప్రయాణం అయ్యారు. అయితే వెంకటేశ్వరావు, జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడుకు చెందిన బంధువు పండు బాలరాజుతో కలిసి హీరోహోండా ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరారు. కామవరం దాటిన తర్వాత పందిరిమామిడిగూడెం సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు మార్జిన్‌లో పడిపోయారు. ఈ ప్రమాదంలో వెంకటేశ్వరావు తలకు బలమైన గాయమై మృతి చెందగా, బాలరాజుకు గాయాలు అయ్యాయి. వెనకనే ట్రాక్టరులో వస్తున్న కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని విగతజీవిగా పడివున్న వెంకటేశ్వరావును చూసి కన్నీరు మున్నీరుగా విలపించారు. గాయపడిన బాలరాజును 108లో ఆసుపత్రికి తరలించారు. బుట్టాయగూడెం ఎస్‌ఐ జి.కాళీచరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకటేశ్వరరావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అమ్మ దర్శనం తర్వాత ఇంతలోనే ఘోరం జరుగుతుందని అనుకోలేదంటూ కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించడం చూపరులను కంటతడి పెట్టించింది.



మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య జగద, బంధువులు, (ఇన్‌సెట్‌లో) వెంకటేశ్వరావు మృతదేహం



రైలు పట్టాలపై కనకదుర్గ మృతదేహం, ఇన్‌సెట్‌లో కనకదుర్గ (ఫైల్)

● కనకదుర్గమ్మ దర్శనానికి వెళ్లి వస్తూ రైలు ఢీకొని...

ఆకివీడు: ఆకివీడు రైల్వే స్టేషన్ రెండవ ఫ్లాట్ ఫారమ్ నుంచి మొదటి ఫ్లాట్ ఫారమ్ మీదకు వచ్చేందుకు పట్టాలు దాటుతున్న ఒక మహిళను పాసింజర్ రైలు ఢీకొనడంతో మృతి చెందింది. స్థానిక సాలిపేటలోని వాడపల్లి వారి వీధిలో కందికట్ల కామేశ్వర్రావు నివాసంలో కూతురు ధనలక్ష్మితో తల్లి తోట కనకదుర్గ (54) నివాసముంటోంది. వారం రోజుల క్రితం కుమార్తె ధనలక్ష్మికి వివాహం చేసింది. ఈక్రమంలోనే శనివారం రాత్రి ఆకివీడు నుంచి కనకదుర్గ విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకోవడానికి వెళ్ళింది. ఆదివారం కనకదుర్గమ్మకు తలనీలాలు సమర్పించి, అమ్మను దర్శించుకుని విజయవాడ నుంచి నర్సాపురం వెళ్ళే రైలులో బయలుదేరింది. ఆకివీడు రైల్వే స్టేషన్‌కు ఉదయం 10.34నిలకు రెండవ ఫ్లాట్ ఫారమ్ మీదకు వచ్చింది. రైలు దిగిన తరువాత ఇంటికి వెళ్ళేందుకు రెండవ ఫ్లాట్ ఫారమ్ మీద నుంచి ఒకటవ ఫ్లాట్ ఫారమ్ మీదకు పట్టాలు దాటుతుండగా నరసాపురం నుంచి గుడివాడ వెళ్తున్న రైలు ఢీకొనడంతో మృతి చెందింది. మృతురాలి దగ్గర సంచిలో సెల్ ఉండడంతో స్థానికులు దానిలోని నెంబర్‌కు ఫోన్ చేయగా కుమార్తె ధనలక్ష్మి మాట్లాడగా విషయం తెలిపారు. దీంతో కొద్దిసేపటికి ఆమె బంధువులతో స్టేషన్‌కు వచ్చి ఫ్లాట్ ఫారమ్‌పై అచేతనంగా పడి ఉన్న తన అమ్మను చూసి పెద్దపెట్టున రోదించింది. ఆమెను సముదాయించడం ఎవరివల్ల కాలేదు. రైల్వే పోలీసులు వచ్చి వివరాలు సేకరించి మృతదేహాన్ని భీమవరం తరలించారు.



రోదిస్తున్న కనకదుర్గ కుమార్తె, బంధువు



సంఘటనా స్థలిలో సురేంద్ర స్నేహితులు, స్థానికులు (ఇన్‌సెట్‌లో) గోదావరిలో గాలింపు చర్యలు

గోదావరి స్నానానికి వచ్చి గల్లంతు

కొవ్వూరు : కొవ్వూరు గోష్పాద క్షేత్రం వద్ద గోదావరిలో స్నానానికి దిగిన ఒక యువకుడు గల్లంత య్యాడు. గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం విజ్ఞానపురం గ్రామానికి చెందిన పెరికల చిన్నా ఆధ్వర్యంలో 24 మంది ఆదివారం గౌరీపట్నం నిర్మలగిరి మేరీమాత ఆలయానికి వచ్చారు. అక్కడి నుంచి కొవ్వూరు గోష్పాద క్షేత్రం వద్ద గోదావరిలో స్నానాలు ఆచరించడానికి వచ్చారు. గ్రామస్థులు, స్నేహితులతో కలసి గోదావరిలో స్నానానికి దిగిన కనపర్తి సురేంద్ర (20) ప్రమాదవశాత్తూ గోదావరిలో గల్లంతయ్యాడు. నీటి ఉధృతికి కొట్టుకుపోతూ రక్షించాలంటూ కేకలు పెట్టాడు. అతని స్నేహితులు కాపాడడానికి ప్రయత్నించినా సాధ్యపడలేదు. సమీపంలోని ఏపీ టూరిజం బోటు సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చినప్పటికీ అప్పటికే సురేంద్ర గల్లంతయ్యాడు. ఈ సంఘటనపై సురేంద్ర తాత పెరికల చిన్నా (జోషఫ్) మాట్లాడుతూ తనతో పాటు వచ్చిన మహిళలు, స్నేహితులతో సురేంద్ర గోదావరిలో స్నానానికి దిగాడని, లోపలికి వెళ్లవద్దని హెచ్చరిస్తున్నప్పటికీ నదిలోపలకు వెళ్లడంతో గల్లంతయ్యాడని రోదిస్తూ తెలిపాడు. సీఐ ప్రసాదరావు, ఎస్‌ఐ సతీష్ జానా, ఫైర్ సిబ్బంది గోష్పాద క్షేత్రానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

● 108లో ప్రసవం



నిండు గర్భిణిని ఏలూరు ఆస్పత్రికి 108లో తరలిస్తుండగా 108లో తరలిస్తుండగా మార్గంమధ్యలోనే ప్రసవించింన ఘటన ఇది. పెంటపాడు మండలం పరిమెళ్లకు చెందిన ఐ.వెంకట ధనలక్ష్మికి రెండో కాన్పు నెలలు నిండటంతో శనివారం రాత్రికి నొప్పులు మొదలయ్యాయి. పెంటపాడు 108లో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆమెకు రక్తం లేదని ఏలూరు తీసుకెళ్లాలని వైద్యులు సిఫార్సు చేయడంతో అర్ధరాత్రి తాడేపల్లిగూడెం 108లో ఏలూరు పయనం అయ్యారు. తాడేపల్లిగూడెం - ఉంగుటూరు మధ్యలో ధనలక్ష్మి బాలుడిని ప్రసవించింది. బాలింతను ఏలూరు జిల్లా ఆసుపత్రికి చేర్చారు. ఎంతో జాగ్రత్తగా కాన్పు చేసిన 108 మెడికల్ టెక్నీషియన్ ఎం.మణిచైతన్యకు ధనలక్ష్మి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు. **- తాడేపల్లిగూడెం రూరల్**



● మార్కెట్ ధరలు

ఏలూరు రైతు బజారులో ఆదివారం నాటి కూరగాయల ధరలు

కిలోల్లో..	రూ.
టమాటా	44-00
వంగ	24-00
బెండ	20-00
మిర్చి	22-00
కాకర	16-00
బీర	14-00
క్యాబేజి	18-00
క్యారెట్	26-00
దొండ	20-00
బంగాళదుంపలు	14-00
ఉల్లిపాయలు	21-00
దోస	12-00
ఆనప	12-00
పొట్లకాయ	12-00
అరటి	4-00
చిక్కుడు	36-00
గోరుచిక్కుడు	24-00
చామదుంపలు	28-00
మునగ	4-00
ఆకుకూరలు (కట్ట)	3-00
కంద	24-00
బీట్‌రూట్	26-00
కీరదోస	18-00
ఫ్రెంచ్‌బీన్స్	72-00
రైస్	32-00
కందిపప్పు	70-00
మినపప్పు	72-00
పెసరపప్పు	74-00
చింతపండు	100-00
ఆయిల్	60-00

- ఏలూరు టూటౌన్

హలో 'ఆంధ్రజ్యోతి'

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

ఏలూరు సిటీ : 99854 01668
ఏలూరు అర్బన్ : 9848220735
ఏలూరు క్రైం : 9848238482
ఏలూరు రూరల్ : 9441556656
ఏలూరు టూటౌన్ : 9247855290

సినిమా గైడ్ :

ఏలూరు:

విజయలక్ష్మి (వీ-మాక్స్-1)	నేనే రాజు.. నేనే మంత్రి
విజయలక్ష్మి (వీ-మాక్స్2)	గ్రీన్‌కార్డు
అంబికా స్క్రీన్ 1	దర్శకుడు
అంబికా స్క్రీన్ 2	అన్ బెల్
అంబికా స్క్రీన్ 3	టాయ్‌లెట్
మినీ సత్యనారాయణ	లై
సత్యనారాయణ	ఆనందోబ్రహ్మ
సాయి బాలాజీ	జయ జానకి నాయక
బాలాజీ	లై
క్రాంతి	ఇదేం దెయ్యం







వట్లూరు హౌసింగ్ బోర్డు కాలనీ, సత్రంపాడులో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు...సిబ్బందికి సూచనలు ఇస్తున్న పోలీసు అధికారులు

పోలీసుల హల్‌చల్..!

● నగరంలో కార్డెన్ సెర్చ్ - అవాక్కయిన స్థానికులు
● అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు యువకుల అరెస్టు
● రెండు మోటారు సైకిళ్ళు స్వాధీనం

ఏలూరు క్రైం : ఒక్కసారిగా వంద మంది పోలీసు బలగాలు, ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులతో ప్రత్యేక బృందాలు నగరంలోని సత్రంపాడు, యాదవనగర్, శాంతినగర్, ఎంఆర్‌సీ కాలనీ, వట్లూరు హౌసింగ్ బోర్డు కాలనీల్లో ఏకకాలంలో దాడులు చేపట్టారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు అవాక్కయ్యారు. ఎక్కడ ఏమి జరిగిందో అర్థం కాక అయోమయంలో పడ్డారు... జిల్లా ఎస్పీ ఎం.రవిప్రకాష్‌కు అందిన సమాచారంతో ఆయన ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ గోగుల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నగర సీఐ ఎన్.రాజశేఖర్, టూటౌన్ సీఐ జి.మధుబాబు, ఏలూరు రూరల్ సీఐ అడపా నాగమురళీ, వారి సిబ్బంది కలిసి ఆదివారం సాయంత్రం ఐదు ప్రాంతాలపై కార్డెన్ సెర్చ్ చేపట్టారు. ఏలూరు సత్రంపాడులోని సిఆర్‌ఆర్ లా కాలేజీ(ప్రస్తుతం బీ ఫార్మసి కాలేజీ) వెనుక ప్రాంతంలో మూడు ఇళ్ళల్లో సుమారు 50 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. యాదవనగర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు యువకులను టూటౌన్ సీఐ జి.మధుబాబు ఆధ్వర్యంలో దెందులూరు ఎస్ఐ ఎన్.ఆర్.కిషోర్‌బాబు అదుపులోకి తీసుకుని వారి నుంచి రెండు మోటారు సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నారు.

పోలీసులు ఏకకాలంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించడంతో ఆ ప్రాంత ప్రజలు అయోమయంలో పడ్డారు. ఆ తరువాత గంజాయి పట్టుపడిందని తెలియడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థులే టార్గెట్‌గా చేసుకుని గంజాయి విక్రయాలు చేస్తున్నట్టుగా పట్టుబడిన మహిళలు పోలీసులకు వెల్లడించినట్టు తెలుస్తుంది. నగర సీఐ ఎన్.రాజశేఖర్ ఆధ్వర్యంలో త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కార్డెన్ సెర్చ్‌లో గణపవరం సీఐ దుర్గాప్రసాద్, భీమడోలు ఎస్ఐ గంగాధర్, చేబ్రోలు ఎస్ఐ పి.ఎన్.వి.రాజు, దెందులూరు ఎస్ఐ ఎన్.ఆర్.కిషోర్‌బాబు, ఏలూరువన్‌టౌన్ ఎస్ఐ కె.రామారావు, ఏలూరురూరల్ ఎస్ఐ ఎం.వి.సుభాష్, పెదపాడు ఎస్ఐ రామకృష్ణ, గణపవరం ఎస్ఐ హరికృష్ణ, ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు పాల్గొన్నారు. రాత్రి 9గంటల వరకు కార్డెన్ సెర్చ్ కొనసాగించారు. ప్రతీ ఇంటింటికి వెళ్ళి గుర్తింపు కార్డు(ఆధార్ కార్డు, బ్యాంకు పుస్తకం, ఓటరు గుర్తింపు, డ్రైవింగ్ లైసెన్స్)లను పరిశీలించారు. అనుమానం కలిగిన పలువురిని ప్రశ్నించారు. ఎవరైనా ఇళ్ళను అద్దెకు తీసుకున్నారా, వారు ఏ పనులు చేస్తున్నారు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

నిఘా వైఫల్యం..

ఇరవైళ్ళుగా సీఆర్‌ఆర్ లా కాలేజీ వెనుక ప్రాంతంలో కొంతమంది గంజాయి వ్యాపారం చేస్తున్నట్టు పోలీసు రికార్డులు వెల్లడిస్తున్నాయి. అనేకసార్లు వీరు పట్టుబడి జైలు శిక్ష అనుభవించి వచ్చినప్పటికి యధేచ్ఛగా వ్యాపారాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. ఒకే నేరానికి అనేక సార్లు పాల్పడేవారిపై సస్పెక్ట్ షీట్లను పోలీసులు తెరుస్తారు. కాని గంజాయి వ్యాపారులపై ఎన్ని కేసులు ఉన్నా సంబంధిత పోలీసుల సస్పెక్ట్ షీట్లు తెరవకపోవడం పట్లే పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసు ఉన్నతాధికారులకు కూతవేటు దూరంలోనే గంజాయి విక్రయాలు సాగిస్తున్నాయంటే దీనిని బట్టి వ్యాపారులు ఎంతకు తెగించారో అర్థం చేసుకోవచ్చు. విద్యా సంస్థల సమీపంలోనే కిళ్ళీషాపులనో, చిన్నచిన్న పండ్ల వ్యాపారం పేరుతో గంజాయి విక్రయాలు చేస్తున్నట్టుగా తెలుస్తుంది.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

మట్టి వినాయకులనే పూజిద్దాం

బీజేపీ నగర అధ్యక్షుడు నాగం శివ

ఏలూరు టూటౌన్ : వినాయకచవితి ఉత్సవాల్లో ప్రతిష్ఠించే గణపతి విగ్రహాలను మట్టితోనే తయారు చేయించాలని బీజేపీ నగర అధ్యక్షుడు నాగం శివ అన్నారు. మట్టి ప్రతిమలతో నగరంలో ప్రచారం బీజేపీ నాయకులు నిర్వహించారు. 41, 48 డివిజన్లలో ప్రచారం చేస్తూ ఇంటింటికి తిరిగి మట్టి విగ్రహాలతోనే ప్రతిమలను తయారు చేయాలని కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారెస్ విగ్రహాల వల్ల జల కాలుష్యం జరుగుతుందని తెలిపారు. హానికర రంగులను ప్రతిమల్లో వాడవద్దన్నారు. మట్టి విగ్రహాల ఉపయోగలను వివరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గాదిరాంబాబు, ఓబీసీ మోర్చ అధ్యక్షుడు మరకా రామకృష్ణ, దళిత మోర్చ ప్రధాన కార్యదర్శి మారుబారిక శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గాలంకి సుగుణరావు, పామర్తి అను పాల్గొన్నారు.

మూల్ నివాసి బహుజన టీచర్స్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలూరు టూటౌన్ : మూల్ నివాసి బహుజన టీచర్స్ సంఘం ఎన్నికలు ఏలూరు జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించినట్టు జిల్లా అధ్యక్షుడు బొల్లిపో మనోజ్‌కుమార్ తెలిపారు. పెదపాడు మండల అధ్యక్షుడిగా బి.కృపాకరన్, ప్రధాన కార్యదర్శిగా బి.హెచ్.పి.సాయిరాజు, కోశాధికారిగా జి.వి.రమణ, గౌరవ అధ్యక్షుడిగా పి.గోపాలరావు, ఉపాధ్యక్షులుగా ఇ.శ్రీనివాసరావు, జి.జె.తంబి, జెడ్.జ్యోతిషర్మిల, సి.హెచ్.నాగరాజు, కార్యదర్శిగా డి.ఫిలిప్ రాజ్‌కుమార్, కె.అన్నపూర్ణ, ఎన్.విజయకుమారి, ఎస్.ప్రేమ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. ముందుగా మహర్షి నారాయణగురు 164వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయులు సౌందర్యం, సాగర్ సంఘానికి లేజర్ ప్రింటర్‌ను బహూకరించారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాల్మన్‌ను ఘనంగా సన్మానించారు.

వీఎస్ఎస్‌లకు ఫలసాయం చెల్లించాలి

ఏలూరు టూటౌన్ : వన సంరక్షణ సమితిలను నిర్వీర్యం చేయడానికి, ఫల సహాయం సకాలంలో చెల్లించకుండా దళితులను, పేద ప్రజలను దూరం చేయడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు ఆరోపించారు. సంఘ కార్యాలయంలో బోడే వెంకట్రావు అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో వివిఎస్‌లలో జామాయిల్ కటింగ్ చేసి సంవత్సరాలు గడుస్తున్నా ఇంత వరకు అటవీ శాఖ అధికారులు డబ్బులు చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. దీంతో వన సంరక్షణ సమితుల సభ్యులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నల్లజర్ల మండలంలో ప్రకాశరావుపాలెం సభ్యులకు డబ్బులు చెల్లించకుండా ఫారెస్ట్ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారన్నారు. రాష్ట్రంలో కరువు మండలాలను గుర్తించి ఉపాధి హామీ పనులు అక్కడ కల్పించాలన్నారు. పనులు కల్పించలేని పక్షంలో నెలకు ఐదు వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరువు సమస్యలపై సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి శ్రీనివాసడాంగే, గేదెల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



లక్ష మల్లెల పూజ నిర్వహిస్తున్న దృశ్యం

లక్ష మల్లెల పూజ

ఏలూరు రూరల్ : స్థానిక దక్షిణపు వీధిలోని శ్రీ మార్కండేయ ఓంకార విశ్వేశ్వర, అయ్యప్పస్వామివార్ల దివ్య క్షేత్రంలో ఆదివారం మాస శివరాత్రి సందర్భంగా మార్కండేయ స్వామికి విశేష పూజలు, ప్రత్యేక అలంకారాలు నిర్వహించారు. ఉదయం మల్లికార్జునరావు, సత్యవాణి, శ్రీనివాస్, సరిత దంపతులతో విఘ్నేశ్వరపూజ నిర్వహించారు. అనంతరం అర్చకులు మహన్యాస పారాయణం, ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిళ్వార్చన, విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామికి లక్ష మల్లెలతో అర్చనలు నిర్వహించారు. అశేష సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని పూజించారు. ఆలయ చైర్మన్, భక్త బృందం కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సత్ప్రవర్తన కలిగి ఉండండి : ఎస్ఐ

ఏలూరు క్రైం : రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి జీవించాలని వన్‌టౌన్ ఎస్ఐ కె.రామారావు సూచించారు. జిల్లా ఎస్పీ ఎం.రవిప్రకాష్ ఆదేశాల మేరకు నగర సీఐ ఎన్.రాజశేఖర్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ ఎస్ఐ కె.రామారావు ఆదివారం ఉదయం వన్‌టౌన్ ప్రాంతంలో ఉన్న రౌడీ షీటర్ల ఇళ్ళకు వెళ్ళి కౌన్సిలింగ్ నిర్వహించారు. తెలిసో, తెలియకో చేసిన తప్పులకు ప్రత్యాత్తాప పడి మంచి నడవడికతో జీవించాలని వన్‌టౌన్ ఎస్ఐ కె.రామారావు రౌడీలకు సూచించారు. ఎవరైనా రౌడీ కార్యకలాపాలకు పాల్పడితే సహించేదిలేదని హెచ్చరించారు. చుట్టుపక్కల వారిని కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ కుటుంబాల జీవన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు.

రక్తదానంతో ప్రాణదానం చేద్దాం

స్వచ్ఛంద రక్తదాన ఉద్యమంలో యువత పాల్గొనాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రాము సూర్యారావు

ఏలూరు క్రైం : రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు యువత ముందుకు రావాలని ఎమ్మెల్సీ, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ రాము సూర్యారావు కోరారు. జిల్లాలో పది వేల యూనిట్ల రక్తాన్ని సేకరించాలన్న లక్ష్యాన్ని పూర్తి చేయడానికి యువత ముందుకు వచ్చి స్వచ్ఛంద రక్తదాన ఉద్యమంలో పాల్గొనాలన్నారు. రక్తదానంపై ప్రజల్లో అవగాహన కలిగించడానికి ఆదివారం ఏలూరు ప్రభుత్వాసుపత్రి నుంచి ప్రారంభమైన ప్రచార ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆసుపత్రి నుంచి బయలుదేరిన ఈ ర్యాలీ ఫైర్‌స్టేషన్ సెంటర్, ఓవర్ బ్రిడ్జి, రామచంద్రరావుపేట, వెంకట్రావుపేట, విజయవిహార్ సెంటర్, సెయింట్ థెరిస్సా కాలేజీ మీదుగా జిల్లా రెడ్‌క్రాస్ భవన్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆర్ఎస్ఆర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతీ ఏటా ఎక్కువగా విద్యార్థినీ విద్యార్థులే రక్తాన్ని దానం చేస్తున్నారని, అలాకాకుండా ప్రతీ ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు వస్తే జిల్లాలో ఏటా 25 వేల యూనిట్ల రక్తాన్ని సేకరించవచ్చన్నారు. ఈ విషయంలో ప్రజలంతా రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. జాతీయ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ బడేటి వెంకట్రామయ్య మాట్లాడుతూ సమాజంలో రక్తదానంపై ప్రజల్లో అపోహలు ఉన్నాయని, రక్తం ఇస్తే బలహీనపడిపోతామనే ఆలోచన ఉందన్నారు. ఒక మనిషి రక్తాన్ని దానం చేస్తే రెండు గంటల వ్యవధిలో ఇచ్చిన రక్తాన్ని మళ్ళీ శరీరంలో ఉత్పత్తి చేసే శక్తి ఉందని, రక్తదానం చేస్తే బలహీనపడతామనే అపోహలు విడనాడి రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని వెంకట్రామయ్య కోరారు. ఏలూరులో ఉచిత రక్తదాన శిబిరాలు నిర్వహించడానికి అవసరమైన చేయూతను బడేటి శ్రీహరిరావు చారిటబుల్ ట్రస్టు నుంచి అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు అజయ్‌బాబు, రెడ్‌క్రాస్ సెక్రటరీ తన్నీరు మునియ్య పాల్గొన్నారు.



రక్తదానంపై అవగాహన ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాము సూర్యారావు

'లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టం'పై అవగాహన

ఏలూరు క్రైం : పోలీసు శాఖ నూతనంగా ప్రవేశపెట్టిన లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్ఎంఎస్) సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఏలూరు వన్‌టౌన్ ఎస్ఐ కె.రామారావు సూచించారు. జిల్లా ఎస్పీ ఎం.రవి ప్రకాష్ ఆదేశాల మేరకు నగర సీఐ ఎన్.రాజశేఖర్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ ఎస్ఐ కె.రామారావు వన్‌టౌన్‌లోని తూర్పువీధి, బావిశెట్టివారిపేట, వెన్నవల్లివారిపేటలలో ప్రజలకు ఎల్‌హెచ్ఎంఎస్‌పై ఆదివారం అవగాహన కల్పించారు. నగర ప్రజలు తమ ఇళ్ళకు తాళాలు వేసి ఊరు వెళ్ళేటప్పుడు ఎల్‌హెచ్ఎంఎస్ ద్వారా సమాచారం అందిస్తే పోలీసులు వచ్చి ఆ ఇంటికి రహస్య సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారని సూచించారు. అయితే ఎల్‌హెచ్ఎంఎస్ సేవలు పొందాలంటే తమ ఆండ్రాయిడ్ ఫోన్‌లో ప్లేస్టోర్ ద్వారా ఎల్‌హెచ్ఎంఎస్ ఏపీ పోలీస్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, అనంతరం రిజిష్టర్ కావాలని సూచించారు. ఊరు వెళ్ళే ముందు ఆ యాప్ ద్వారా రిక్వెస్ట్ పెడితే గంట వ్యవధిలో పోలీసులు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారన్నారు. నేరస్తులు ఆ ఇంటి చుట్టుపక్కల అనుమానాస్పదంగా తిరిగినా, తాళాలు పగులకొట్టడానికి ప్రయత్నించినా వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌లో అలారం మోగుతుందని, దీంతో పోలీసులు వెంటనే అక్కడకు వస్తారన్నారు. ఈ సేవలను పొందడానికి ప్రజలు అవగాహన కల్పించుకోవాలని సూచించారు. ఎస్ఐతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.


ఎల్‌హెచ్ఎంఎస్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామారావు

క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ఏలూరు రూరల్ : క్షత్రియుల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని క్షత్రియ హక్కుల సాధన సమితి అధ్యక్షుడు వాడపల్లి కృష్ణంరాజు అన్నారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్షత్రియుల అభ్యున్నతికి క్షత్రియ వెల్ఫేర్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాల్లో క్షత్రియులకు మంత్రి పదవులు, ఇతర ప్రభుత్వ పథకాలు లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్షత్రియులు అల్ప సంఖ్యాకులుగా మారారని, జనాభాలో 1.5 శాతం కన్నా తక్కువే ఉన్నారని చెప్పారు. 70 శాతం కుటుంబాలు పేదరికంలో మగ్గుతున్నాయన్నారు. తమకు కూడా విద్యా, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు

ఏలూరు రూరల్ : దేశాన్ని సాంకేతికపరంగా, ఐటీ రంగం అభివృద్ధికి కృషి చేసిన దివంగత నేత రాజీవ్‌గాంధీ ఆశయాలను ప్రతీ ఒక్కరూ ఆచరించాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక డీసీసీ కార్యాలయంలో సిటీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజనాల మాట్లాడుతూ దేశానికి గుర్తింపు తెచ్చిన రాజీవ్‌గాంధీ సాంకేతిక పరిజ్ఞానంలో ప్రపంచ దేశాలకు ధీటుగా గుర్తింపు తీసుకువచ్చిన ఘనత రాజీవ్‌దేనని కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దారం బాబూరావు, గొల్లా జోగిరాజు, తదితరులు పాల్గొన్నారు.

'డిటెన్షన్'ను విరమించుకోవాలి

ఏలూరు రూరల్ : డిటెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ సాబ్జి డిమాండ్ చేశారు. యూటీఎఫ్ ఏలూరు మండలశాఖ కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు ఇ.శేఖర్‌బాబు అధ్యక్షతన ఆదివారం స్థానిక కెనాల్ రోడ్డులోని యూటీఎఫ్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో షేక్ సాబ్జి మాట్లాడుతూ 5, 8 తరగతుల్లో డిటెన్షన్ (అనుతీర్ణత) విధానాన్ని ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వ ఆలోచన విరమించుకోవాలన్నారు. స్వయం పోషక పాఠశాలల చట్టం 2017ను అమలు చేయాలని ప్రభుత్వం చూస్తుందని, దీనివల్ల ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నంబూరి రాంబాబు, నాయకులు జివి సూరపరాజు, పి.సురేష్, జి.కృష్ణయ్య, ఉమామహేశ్వరరావు, షేక్ బేగం, బి.మోహనరావు, ముస్తఫా ఆలి, జనార్ధనరావు, ధనుంజయరావు, పి.శ్రీనివాస్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు సీఎం సుముఖం


ఎంపీ మాగంటి బాబు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

ఏలూరు రూరల్ : ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సుముఖంగా ఉన్నారని ఎంపీ మాగంటి బాబు అన్నారు. ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సమావేశం ఏలూరులోని ఓ హోటల్‌లో మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. కార్పొరేషన్ ఏర్పాటుకు అనుకూలంగా తనతోపాటు మరో పది మంది ఎంపీలు లేఖ రాస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్పొరేషన్ ఏర్పాటుపై సీఎం చంద్రబాబును కలిశామన్నారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబికా రాజా పెళ్ళిరోజును పురస్కరించుకుని ఈ సందర్భంగా అంబికా రాజా దంపతులను సత్కరించారు. ఎఫ్‌డీసీ చైర్మన్ అంబికా కృష్ణ, తెనాలి మునిసిపల్ కార్పొరేషన్ పెండ్యాల వెంకటేశ్వరరావు, ఫిలిం చాంబర్ ఉపాధ్యక్షుడు టి.సత్యనారాయణలను మహాసభ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి పెనుగొండ సుబ్బారాయుడు, జిల్లా అధ్యక్షుడు గాదంశెట్టి శ్రీనివాసరావు, అర్బన్ జిల్లా అధ్యక్షుడు వాసవి సుబ్బారావు, ఉపాధ్యక్షులు గమిని సుబ్బారావు, దువ్వాడి చంద్రశేఖర్, కార్యదర్శి ఎం.శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షురాలు కొరిపల్లి జయశ్రీ, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కమిటీలు ఏర్పాటు చేస్తాం : గంటా శ్రీనేతాజీ

ఏలూరు రూరల్ : జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు అన్ని మండలాల్లో కమిటీలను ఎంపీ, ఎమ్మెల్యేల సహకారంతో నియమించనున్నట్టు జిల్లా తెలుగు రైతు ఉపాధ్యక్షుడు గంటా శ్రీనేతాజీ తెలిపారు. ఆదివారం ఏలూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సవేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్ళేందుకు కృషి చేస్తామన్నారు. ఈ క్రమంలో మండలాల వారీగా రైతు కమిటీలను నియమించనున్నట్టు తెలిపారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు పుష్కలంగా సాగునీరు, ఎరువులు, విత్తనాలు కొరతలేదన్నారు. నిరంతరాయంగా ఎక్కడా కోత లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్న ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదేనన్నారు. త్వరలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు పొలాల పరిశీలన చేపట్టనున్నట్టు తెలిపారు.



స్టూడెంట్ వాయిస్



మరిన్ని జాబ్ మేళాలు నిర్వహించాలి

మాగంటి శ్రీనుయాదవ్, డిగ్రీ విద్యార్థి

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తరచూ జాబ్‌మేళాలు నిర్వహించాలి. సరైన నైపుణ్యం లేక యువత ఉద్యోగాల్లో వెనుకబడి పోతున్నారు. కళాశాలల్లో నిర్వహిస్తున్న క్యాంపస్ ఇంటర్వ్యూలు సరిపోవడంలేదు. అనుకున్న లక్ష్యం కోసం శ్రద్ధగా చదివి ఉన్నత ఉద్యోగం పొందేలా శిక్షణ అందిపుచ్చుకోవాలి. ఇందుకోసం ప్రభుత్వం ఉచితంగా నైపుణ్యం కలిగిన వారితో పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వాలి. నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను ప్రవేశపెట్టి ఉద్యోగ అవకాశాలను పెంపొందించాలి.

● ఏలూరు రూరల్

బ్యాంకుల సమ్మెకు సీఐటీయూ మద్దతు

ఏలూరు ఫైర్‌స్టేషన్ : ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణ, విలీనాలను వెంటనే విరమించుకోవాలని మంగళవారం బ్యాంకు ఉద్యోగులు తలపెట్టిన సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్ధతు ఇస్తుందని జిల్లా అధ్యక్షుడు కె.రాజారామ్మోహన్‌రాయ్, ఉపాధ్యక్షుడు సి.హెచ్.బాబూరావు తెలిపారు. కార్పొరేట్ సంస్థల బాకీలను రద్దు చేయవద్దని, బాకీల వసూళ్ళకు పార్లమెంటరీ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని జాతీయ బ్యాంకులు దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చారన్నారు. దేశంలో లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పించడంతోపాటు పేద ప్రజలను ఆదుకున్న చరిత్ర జాతీయ బ్యాంకులకు ఉందన్నారు. సజావుగా నడుస్తున్న బ్యాంకింగ్ రంగం కార్పొరేట్ కంపెనీల బకాయిలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యం

మెప్మా పీడీ ప్రకాశరావు

ఏలూరుటూటౌన్ : జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యత సాధించాలనే లక్ష్యంగా 'డిజిటల్ లిటరసీ' కార్యక్రమాన్ని పటిష్టవంతంగా అమలు చేస్తున్నట్టు మెప్మా పీడీ డాక్టర్ ఎన్.ప్రకాశరావు తెలిపారు. ఆదివారం మెప్మా ఆధ్వర్యంలో 6 వేల 295 మంది వయోజన నిరక్షరాస్యులకు బేసిక్ లెవెల్ పరీక్షను జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఏలూరు శాంతినగర్ కమ్యూనిటీ హాలులో జరుగుతున్న ఈ పరీక్ష తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ కాటంనేని భాస్కర్ జిల్లాను సంపూర్ణ అక్షర గోదావరిగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. 140 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 6,295 మందికిగాను 5,316 మంది పరీక్షకు హాజరయ్యా రన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఉన్న స్వయం సహాయక గ్రూపుల మహిళలంతా అక్షరాస్యులై తమ వ్యాపారాలను స్వయంగా నిర్వహించుకోవడం కోసమే ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో 22 వేల మందికి బేసిక్ లెవెల్ పరీక్ష నిర్వహించామన్నారు. జిల్లాలో 72 శాతం అక్షరాస్యత ఉందని, నూరు శాతం అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో ఎ-లెవెల్ గ్రేడుకు ఎంపికైన వయోజన నిరక్షరాస్యులకు నవంబర్ 30వ తేదీన పరీక్ష నిర్వహిస్తామన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న మెప్మా పీడీ ప్రకాశరావు

నేడు డయల్ యువర్ కలెక్టర్

ఏలూరు ఫైర్‌స్టేషన్ : జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం ఉదయం 7.30 నుంచి 8.30 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహిస్తారు. కలెక్టర్ కాటంనేని భాస్కర్‌కు సమస్యలు ఉన్నవారు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. ప్రజా సమస్యలను నేరుగా 98662 63344 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించు కోవచ్చు. అనంతరం 8.30 గంటలకు జిల్లా అధికారులతో కలెక్టర్ కో-ఆర్డినేటర్ కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి మీ-కోసం కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

మనకు సూర్య గ్రహణం స్పర్శ లేదు

◆ పాశ్చాత్య దేశాల్లోనే ప్రభావం
◆ హంపీ విరూపాక్ష పీఠం ఆస్థాన సిద్ధాంతి వేంకట పార్వతీశ్వరశర్మ

ఏలూరు సిటీ : మన దేశంలో పాక్షికంగా గాని, సంపూర్ణంగా గాని సూర్యగ్రహణ స్పర్శ లేదని హంపీ విరూపాక్షపీఠం ఆస్థాన సిద్ధాంతి కాశీభొట్ల వేంకట పార్వతీశ్వరశర్మ పేర్కొన్నారు. సోమవారం సంభవించే గ్రహణం కేవలం పాశ్చాత్య దేశాలలోనే కనపడుతుందన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఎటువంటి గ్రహణ స్పర్శ లేకపోవడంతో గ్రహణ నియమాలు పాటించాల్సిన అవసరమే లేదన్నారు. యథావిధిగా నిత్యజీవన కార్యక్రమాలతో పాటు ఆలయాలు కూడా తెరుస్తారని ఆయన వివరించారు. సామాజిక మాధ్యమాల్లో ఈ గ్రహణ ప్రభావంపై కొన్ని ప్రచారాలు జరుగుతున్నాయన్నారు. దేశంలో ఏ ప్రాంతంలోనూ గ్రహణ ప్రభావం ఎక్కడా కనిపించదన్నారు.

జిల్లా రచయితల సంఘం

నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలూరు ఫైర్‌స్టేషన్ : జిల్లా రచయితల సంఘం సర్వసభ్య సమావేశం ఏలూరు సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం ప్రముఖ రచయిత డాక్టర్ లంకా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సున్నా అంజారావు, ప్రధాన కార్యదర్శిగా నాగస్త్ర, కోశాధికారిగా బరకు, ఉపాధ్యక్షులుగా కోసూరి గాంధీ, కానూరి బదరీనాథ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వి.ఎల్.ప్రకాశరావు, జాయింట్ సెక్రటరీలుగా దేవరకొండ వెంకటేశ్వర్లు, ఎస్.కె.సుభాన్ ఆలీ, కార్యవర్గ సభ్యులుగా లంకా వెంకటేశ్వరావు, ఎన్.వి.రామశాస్త్రి, పుష్పరాజు, మెట్టా నాగేశ్వరావు, జుజ్జూరి వేణుగోపాల్, సత్యవతి, రామారావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

29న కవి సమ్మేళనం

ప్రధాన కార్యదర్శి నాగస్త్ర మాట్లాడుతూ తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 29వ తేదీన కవి సమ్మేళనం నిర్వహిస్తామన్నారు. శాస్త్రవేత్తలకు పుట్టినిల్లయిన జిల్లాలో కవులు, రచయితలు ఎంతో మంది ఉన్నారన్నారు. వారిలోని ప్రతిభను వెలికితీసుకువచ్చేందుకు సాహిత్యాన్ని అందుబాటులో ఉంచుతామన్నారు. తెలుగు భాషా దినోత్సవంలో కవులు, రచయితలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి 'విందాం నేర్చుకుందాం'

ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు రేడియో పాఠాలు

ఉండి : జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి 'విందాం నేర్చుకుందాం' అనే రేడియో కార్యక్రమం ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం వల్ల ప్రాథమిక తరగతుల విద్యార్థులకు ఎంతోగానో దోహదపడతాయని ఉపాధ్యాయులు అంటున్నారు. జిల్లాలో సుమారు 2 లక్షల మంది విద్యార్థులు ఈ రేడియో పాఠాలు విననున్నారు. అన్ని పాఠశాలల్లో రేడియో పాఠాలు విద్యార్థులకు వినిపించాలి, రికార్డులో నమోదు చేయాల్సి ఉంటుంది.



పాఠాలు వింటున్న విద్యార్థులు (ఫైల్)

వారంలో 5 రోజుల పాటు పాఠాలు...

ఈ కార్యక్రమం ద్వారా వారంలో 4 రోజులు పాటు సోమవారం నుంచి గురువారం రేడియో పాఠాలు పిల్లలకు వినిపిస్తారని మరో రోజు ఉపాధ్యాయులకు కార్యక్రమం ఉంటుందని అధికారులు తెలిపారు. గతంలో రేడియో పాఠాలు జరిగాయి. కొద్దికాలం తదుపరి వాటిని నిలిపివేశారు.

రేడియో ప్రసారాలు ఇలా..

ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ప్రసారం చేసే రేడియో పాఠాలు ఇలా.. 21వ తేదీ సోమవారం వినాయక చవితి, 22న ఇంగ్లీషు, 23న పరిసరాల విజ్ఞానం, 24న 'ఏం తక్కువ ఎంత తక్కువ' 28న 5వతరగతి 'గోపి డప్పు కథ' ప్రసారం అవుతాయి.

రేడియోలు లేకపోతే కొనుగోలు చేయాలి..

పాఠశాలల్లో రేడియో లేకపోతే తక్షణమే పాఠశాల నిధులు నుంచి కొనుగోలు చేసుకోవాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నాయకుడు రంగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంను ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసినందని, రాష్ట్ర సర్వశిక్షా అభియాన్ డైరెక్టర్ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు.

చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ముందుకు రావాలి

పరిశ్రమల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రామారావు

ఏలూరు టూటౌన్ : దేశంలో సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం భూమి, నీరు, కరెంట్ సరఫరా ఉచితంగా ఇవ్వాలని పరిశ్రమల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు బి.వి.రామారావు డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ అతిథిగృహంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహికులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇవ్వకపోవడం వల్లే చిన్నతరహా పరిశ్రమలు రావడం లేదన్నారు. సబ్సిడీలు ఇస్తామని పరిశ్రమలు స్థాపించమని చెప్పి అనంతరం సబ్సిడీలు ఇవ్వకపోవడంతో కొత్తగా పరిశ్రమలు స్థాపించిన వారు బ్యాంకు రుణాలను కట్టలేక మూసేస్తున్నారన్నారు. కుటీర, గ్రామీణ పరిశ్రమలు అభివృద్ధి చెందితేనే దేశ ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి అన్నీ ఉచితంగానే ఇస్తున్నాయని ఆరోపించారు. సెప్టెంబర్ 25న తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో దక్షిణ భారత దేశ పారిశ్రామిక సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఐదు రాష్ట్రాల నుంచి పారిశ్రామిక వేత్తలు ఈ సదస్సులో పాల్గొనాలని కోరారు. సమావేశంలో సీహెచ్. కృష్ణకిషోర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరిశ్రమల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రామారావు

తమ్మిలేరులో మత్స్యకారుడు గల్లంతు

ముమ్మరంగా గాలింపు చర్యలు

చింతలపూడి : చింతలపూడి సమీపంలోని తమ్మిలేరు రిజర్వాయర్‌లో ఆదివారం చేపల వేటకు వెళ్లిన ప్రగడవరం గ్రామానికి చెందిన వాసబోయిన సత్యనారాయణ గల్లంతయ్యాడు. గ్రామంలోని కొందరు మత్స్యకారులతో వేటకు వెళ్లిన సత్యనారాయణ రిజర్వాయర్‌లోకి దిగిన కొద్దిసేపటికి అతను మునిగిపోయాడు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించి, గ్రామస్థులు, మత్స్యకారులు గాలింపు చర్యలు చేపట్టారు. తమ్మిలేరు ఎగువనుంచి వస్తున్న వరద నీటి ప్రవాహం వల్ల గల్లంతయి ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు.



గల్లంతయిన మత్స్యకారుడి కోసం గాలిస్తున్న గ్రామస్థులు

జంబ్లింగ్ వర్డ్స్

1. WLKA ▸ ....
2. NGKI ▸ ....
3. DMBU ▸ ....
4. MEUT ▸ ....

జంతర్‌మంతర్

1. ద్భుఅతం ▸ ....
2. తణంక్ష ▸ ....
3. త్తిడిఒ ▸ ....
4. సంవికా ▸ ....

చెప్పగలరా?

పాలులో ఉన్నా కానీ వేలులో లేను
యతిలో ఉన్నా కానీ గతిలో లేను
సందులో ఉన్నా కానీ విందులో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

సూక్తి

మనం ఉన్నతంగా ఎదగడానికీ, నష్టపోవడానికీ కారణం మన ఆలోచనలే.

రోబోల రికార్డ్ బ్రేక్ డ్యాన్స్

రోబో స్టెప్పు వేస్తే.. అదిరి పోతుంది కదూ! మరి ఒకేసారి వెయ్యికి పైగా రోబోలు కదం తొక్కితే.. డ్యాన్సులు చేసి అదరగొడితే అద్భుతం కదా! ఒకే సైజులోని రోబోలన్నీ కాలంలో ఒకే రీతిలో డ్యాన్స్ చేసి 'గిన్నిస్ పుటల్లో' స్థానం పొందాయి.

సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి పరిచిన 1069 రోబోలు విభిన్నంగా డ్యాన్స్ చేసి చూపరులను ఆకట్టుకున్నాయి. ప్రపంచ రికార్డును సాధించి గిన్నిస్ పుటలకెక్కాయి. డబ్ల్యు.ఎల్ ఇంటిలెజెంట్ టెక్నాలజీ కంపెనీ లిమిటెడ్ వీటిని రూపొందించింది. 'వన్ గ్రూప్ కంట్రోల్ సిస్టమ్' ప్రోగ్రామ్ ఆధారంగా ఇవి ఏకకాలంలో డ్యాన్స్ చేశాయి. చిందులతో కదం తొక్కిన ఆ రోబోల పేరు 'దోబి'. చైనాలో గతంలో జరిగిన బీర్ ఫెస్టివల్ సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో 1007 రోబోలు బ్రేక్ డ్యాన్స్ చేసి గిన్నిస్ రికార్డు సృష్టించాయి. ఆ రికార్డును 'దోబి' రోబోలు ప్రస్తుతం బద్దలుకొట్టాయి. ఈ దోబి రోబోల ఎత్తు - 47.3 సెంటిమీటర్లు. ఇవి పాటలు పాడటంతో పాటు, ఫుట్‌బాల్ కూడా ఆడతాయి. కుంగ్‌ఫూ కూడా చేయడం విశేషం. వీటి డ్యాన్సింగ్ వీడియోను యూట్యూబ్‌లో గంట వ్యవధిలోనే లక్షల మంది చూశారు.



మీకు తెలుసా?

షాంఘై ఎక్స్‌పో పార్క్‌లో గత సంవత్సరం జరిగిన 'ఫ్రాన్స్ నేషనల్ పెవిలియన్ డే'లో సందర్శకులను అలరించేందుకు నిర్వాహకులు 20 రోబోలతో డ్యాన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతేకాదు వాటితో సాకర్ కూడా ఆడించారు.



'రోబో' స్టెప్పుల రికార్డు

ప్రభుదేవా డ్యాన్స్ మెరుపులు, చిరంజీవి స్టెప్పులు అందరికీ తెలుసు. మరి చిందులేసే రోబోలు తెలుసా? చైనా కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా 540 రోబోలు ఒకే వేదికపై డ్యాన్సులు చేసి అలరించాయి. అంతేకాదు ప్రపంచంలోనే అత్యధిక మంది వీక్షించిన టీవీ ప్రోగ్రామ్‌గా అది రికార్డులకెక్కింది. రోబోలు చిందేస్తుంటే 26 డ్రోన్లు ఆ నృత్యాన్ని వీడియో తీశాయి. చైనా సెంట్రల్ టెలివిజన్(సీసీటీవీ) ఈ కార్యక్రమాన్ని ప్రసారం చేయగా 70 కోట్ల మంది వీక్షించటం విశేషం. ప్రపంచంలోనే అత్యధిక ప్రజలు చూసిన కార్యక్రమంగా రోబో డ్యాన్స్ నిలిచింది. సాహిత్యాన్ని, సంగీతాన్ని అనుసరించి కొరియోగ్రాఫర్లు డ్యాన్స్ కంపోజ్ చేస్తారు. అదే విధంగా రోబోలు సంగీతానికనుగుణంగా నృత్యం చేసేలా వీటిని రూపొందించారు. 'ప్రతి రోబోలో 16 స్టీరింగ్ ఇంజిన్లు ఉన్నాయి. మానవుడి తల, కాళ్లు, చేతులు ఏ విధంగా అయితే కదుపుతారో అదే విధంగా రోబోలు కదలడానికి వీలుగా ఈ స్టీరింగ్ ఇంజిన్స్ ఉపయోగపడతాయి.

రోబోట్ డ్యాన్స్

రోబోలను ఇమిటేట్ చేస్తూ చేసే డ్యాన్సే 'రోబోట్ డ్యాన్స్'. మైఖేల్ జాక్సన్‌తో ఈ డ్యాన్స్ బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. 'డ్యాన్సింగ్ మెషిన్' పాటలో - మైఖేల్, తన సోదరులతో కలిసి 'రోబోట్ డ్యాన్స్' చేశారు. 'బిల్లి జీన్' అనే పాటలో కూడా 'రోబోట్ డ్యాన్స్' చేసి అలరించాడు.


మెల్‌బోర్న్ యూనివర్సిటీలో 'రోబోగాల్స్' అనే బృందం, 318 మంది 'రోబోట్ డ్యాన్స్' చేసి వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందారు.

ఔనా!



వాసన పసిగట్టే శక్తి శునకాల కన్నా, చీమలకే ఎక్కువ.

బొమ్మ గీయండి



దారి కనుక్కోండి



రంగులు వేయండి



నవ్వుల్ నవ్వుల్

అప్పారావు : ఏరా! వెళ్లినప్పుడు నాలుగు గంటల్లో విజయవాడ వెళ్లావు కదా! వచ్చేటప్పుడు ఎనిమిది గంటలు పట్టిందేం?

సుబ్బారావు : కారు తయారు చేసిన వెధవ ఎవడో గానీ, ముందుకు వెళ్లడానికి నాలుగు గేర్లు ఇచ్చాడు. వెనక్కి రావడానికి రెండు గేర్లు మాత్రమే ఇచ్చాడు రా!

అప్పారావు : !!!!!!!!!

టంగ్ ట్విస్టర్స్

1. Upper roller lower roller Upper roller lower roller. ..
2. Swan swam over the sea,
   Swim, swan, swim!
   Swan swam back again
   Well swum, swan!
3. I saw a saw that could out saw any other saw I ever saw.

చుక్కలు కలపండి



మీకు తెలుసా?



ప్రపంచంలో రెండు శాతం మందికి మాత్రమే ఆకుపచ్చ రంగు కళ్లు ఉంటాయి.

జవాబులు

చెప్పగలరా? : పాయసం
జంతర్‌మంతర్ : 1. అద్భుతం 2. తక్షణం 3. ఒత్తిడి 4. వికాసం
జంబ్లింగ్ వర్డ్స్ : 1. WALK 2. KING 3. DUMB 4. MUTE

ఇది మా అడ్డా



అధికారులు నిద్దరోతున్నారు.. నాయకులు మత్తులో ఉన్నారు..ఎందుకో తెలుసా.. పందులు మందలు.. మందులుగా పెరిగిపోతున్నాయి.. అయినా కనీసం కన్నెత్తి చూసినవారే లేరు.. స్వచ్ఛ భారత్.. స్వచ్ఛ భారత్ అంటూ తిరుగుతూ పట్టించుకోవాల్సిన పందులనే వదిలేశారు.. అటు ఏలూరు కార్పొరేషన్ నుంచి ఇటు కొవ్వూరు వరకూ ఏ పట్టణంలో చూసినా ఇంతే.. ఎందుకంటే ఇటీవల పందుల నిర్మూలనకు చేపట్టిన చర్యలే లేవు.. అప్పుడెప్పుడో పందుల నిర్మూలన చేపడతామంటూ అధికారులు హడావుడి చేశారు.. ఆ తరువాత ఆ ఊసే లేదు.. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.. స్వైన్ ఫ్లూ వస్తుందో.. మెదడువాపు వస్తుందోనంటూ భయపడుతూ బతుకీడుస్తున్నారు.. జిల్లాలో కుక్కలదీ ఇదే పరిస్థితి.. వాటి నిర్మూలన అంతంతమాత్రంగానే ఉంది.

పందులు ఎక్కడ ఉండాలి..!! ఊరికి దూరంగా నిర్జన ప్రదేశంలో ఉండాలి.. మరి పట్టణాల్లో ఎక్కడ ఉంటున్నాయి..!! ఊరు మధ్యలో ఉంటున్నాయి.. అటు అధికారులు.. ఇటు నాయకుల కంట పడుతూనే ఉంటాయి.. అయినా ఎందుకో చిన్నచూపు..ఇదే ప్రజల ప్రాణాల మీదకు తెస్తోంది. ఎందుకంటే పందులు తిరిగే ప్రాంతాల్లో రోగాలు ప్రబలుతాయి.. అది కూడా ప్రమాదకరమైన స్వైన్ ఫ్లూ, మెదడువాపు తదితర వ్యాధులు వ్యాపిస్తాయి. అయినా పందులు జనం మధ్య యథేచ్ఛగా తిరుగుతూనే ఉంటున్నాయి.. జిల్లాలో ఏ పట్టణంలో చూసినా ఇంతే.. జిల్లా అధికారులు నివసించే ఏలూరులోనే ఇంతే.. మంత్రి గారుండే తాడేపల్లిగూడెంలోనూ ఇంతే.. తణుకు, నిడదవోలు, పాలకొల్లు, నరసాపురం, జంగారెడ్డిగూడెం, కొవ్వూరు ఎక్కడైనా పందులతో చింతే. అయినా అటువైపు కన్నెత్తి చూడడం లేదు.. నాయకులు పట్టించుకోవడం లేదు.. గతేడాది సీఎం చంద్రబాబు వచ్చి దోమలపై దండయాత్ర అన్నారే కానీ.. దోమల పెరుగుదలకు కారణమైన పందులపై దండయాత్ర అని మాత్రం అనలేదు. అందుకే నాయకులు కన్నెత్తి చూడడంలేదులా ఉంది.. అయ్యా ఇకనైనా కదలండి.. పందుల నిర్మూలనకు చర్యలు చేపట్టండి.. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడండి...

మందలు.. మందలుగా పందులు

గుంపులు.. గుంపులుగా కుక్కలు

పట్టణాల్లో యథేచ్ఛగా స్వైర విహారం

జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి

ఇది తాడేపల్లిగూడెంలోని కొండయ్య చెరువు ఆవరణ.. వందలాది మంది ఇక్కడ నివాసం ఉంటారు. వారి మధ్య నుంచే పందులు సంచరించడం ఈ పట్టణం స్పెషాలిటీ.. అంతే కాదు.. వీధుల్లోనూ విచ్చలవిడిగా తిరుగుతూనే ఉంటాయి. అయినా ఏ ఒక్కరూ ఆ పందుల నిర్మూలనకు చేపట్టిన చర్యలు శూన్యం. దీంతో రోజు రోజుకు పందులు పెరిగిపోతున్నాయి. పట్టణంలో అడుగుపెట్టామంటే చాలు ఏదో ఒక మూల వరాహాలు దర్శనమిస్తాయి..



ఏలూరులోనూ.. ఇంతే..

ఏలూరురూరల్ : మండలంలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ఎక్కడ ఖాళీ స్థలం కనబడితే అక్కడ వాలిపోతున్నాయి. మురికి గుంటలను స్థావరాలుగా చేసుకుని జనావాసాల మధ్య దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. దీంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఊరికి దూరంగా ఉండాల్సిన పందులు జనావాస ప్రాంతాల్లో సంచరిస్తూ ఇళ్ళల్లోకి సైతం చొరబడుతున్నాయి. పట్టణ, గ్రామాల్లో పందులు కాళ్లకు అడ్డం పడుతూ తిరుగుతున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక కుక్కల గురించి వేరే చెప్పనక్కర్లెదు.. కుక్కల నిర్మూలన చర్యలు లేకపోవడంతో వందల సంఖ్యలో పెరిగిపోయాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నాయి.. అటు పందులు.. ఇటు కుక్కలతో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతున్నారు.

అరికట్టలేకపోతున్నారు..

తాడేపల్లిగూడెం-ఆంధ్రజ్యోతి : తాడేపల్లిగూడెం పురపాలక సంఘంలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి.మునిసిపల్ కౌన్సిల్ పందుల నిర్మూలనకు చర్యలు చేపట్టినా అదుపులో ఉండడంలేదు. పెంపకం దారులు యథేచ్ఛగా పెంపకం కొనసాగిస్తుండడంతో రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. ఒక దశలో పందుల పెంపకం దారులు మునిసిపాలిటీపై పోరాటానికి తెగబడ్డారు. అయినా సరే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అరికట్టే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోతోంది. పందుల నిర్మూలనపై రాబోయే 15 రోజుల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించేందుకు ప్రణాళిక చేశారు. అంతే కాకుండా పట్టణంలో కుక్కల సమస్య కూడా అధికంగానే ఉంది. దాంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. శునకాల్లో సంతానోత్పత్తిని నివారించే చర్యలు చేపట్టారు. ఇప్పటి వరకూ 190 శునకాలకు శస్త్రచికిత్సలు చేసారు. మిగిలిన వాటికి చేయాల్సి ఉంది.





పెరిగిపోతున్నాయి..

పాలకొల్లు : అపారిశుధ్యం ఎక్కడ ఉంటే అక్కడ పందులు స్వైర విహారం చేస్తాయి. ప్రస్తుతం పాలకొల్లులో ఇదే పరిస్థితి.. పట్టణం ఇరుకుగా ఉండడంతో అపారిశుధ్యం తాండవిస్తోంది. దీంతో పందుల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతోంది. పట్టణంలోని ఏ డ్రెయిన్‌లో చూసినా పందుల మందలు దర్శనమిస్తున్నాయి. వీటిని అదుపు చేయడంలో పురపాలక సంఘం పూర్తిగా విఫలమైంది. ప్రజలకు దూరంగా నిర్జన ప్రదేశంలో పందుల పెంపకం చేపట్టాలనేది నిబంధన అయితే ఆ దిశగా చర్యలైతే కనిపించడంలేదు. ఊరు మధ్యలో యథేచ్ఛగా తిరుగుతున్నా కనీసం కన్నెత్తి చూసిన వారే లేరు. డ్రెయినేజీలు, మురుగు కాలువల్లో స్వైర విహారం చేస్తున్నాయి. వీటితో కుక్కల సంతతి కూడా బాగా పెరిగింది. పందులు ఎక్కడో కనబడితే.. కుక్కలు మాత్రం రోడ్డుపైనే తచ్చాడుతున్నాయి.

నిర్మూలన చర్యల్లేవ్...

నిడదవోలు : ఒక పక్కన దోమలు చంపేస్తున్నాయి.. మరో పక్కన వాటి పెరుగుదలకు కారణమైన పందులు చంపేస్తున్నాయి. పందులను నిర్మూలిస్తే దోమల బాధ చాలా వరకూ తగ్గుతుందని చూస్తుంటే ఎవరు చర్యలు చేపట్టడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయినా కనీస చర్యల్లేవ్.. ప్రస్తుతం వానాకాలం కావడంతో రహదారులు చిత్తడిగా ఉంటున్నాయి. గుంటలు నిండుగా నీటితో నిండిపోయి ఉంటున్నాయి. ఆ గుంటలే వరాహాలకు ఆవాసాలగా మారిపోయాయి. దీంతో దోమలు పెరిగిపోతున్నాయి. పట్టణంలోని బీసీ కమ్యూనిటీ హాలు, మెయిన్ రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం, సంత మార్కెట్ తదితర ప్రాంతాల్లో పందులు విచ్చల విడిగా సంచరిస్తున్నాయి. కుక్కల సంఖ్య కూడా బాగానే ఉంది. వీటి నిర్మూలనకు అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.





పట్టణంపై వదిలేశారు!

నరసాపురం : పట్టణంలో పందులు స్వైర్య విహారం చేస్తున్నాయి. 1, 4, 9, 26 వార్డుల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో వరహాల బెడద ఎక్కువగా ఉంది. పందుల పెంపకం దారులకు శ్మశానం వద్ద ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించినా బయటకు వదిలివేస్తున్నారు. దీంతో అవి వార్డుల్లోకి వచ్చేస్తున్నాయి. మూడు నెలల కిందటే పందులను పట్టించినా సమస్య తీరలేదు. ఇక కుక్కలదీ ఇదే పరిస్థితి. పట్టణంలో ఏ రోడ్డులో చూసినా కనిపిస్తున్నాయి..



పందులకు.. అడ్డేలేదు..

తణుకు : ఖాళీ స్థలాలు ఎక్కడ ఎక్కువ ఉంటే అక్కడ పందుల సంచారం ఎక్కువగా ఉంటుంది.. తణుకులో ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉండడంతో పందుల సంఖ్య కూడా అదే స్థాయిలో ఉంది.పట్టణంలోని బస్టాండ్, రైల్వే స్టేషన్, పైడిపర్రు, ఉండ్రాజవరం జంక్షన్, వేల్పూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో పందుల సంచారం ఎక్కువగా ఉంది. అయినా ఇప్పటి వరకూ నిర్మూలన చర్యల్లేవ్.. దీంతో పందులు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. కుక్కలదీ ఇదే పరిస్థితి.. ఏ రోడ్డులో చూసినా ఎక్కువగా ఉంటున్నాయి.

మినీ లోకం



సమాచారం..

ఉష్ణోగ్రతలు :	గరిష్ఠం	కనిష్ఠం
ఏలూరు	31	24
భీమవరం	30	25
తణుకు	30	25
తాడేపల్లిగూడెం	29	24
నరసాపురం	30	25
పాలకొల్లు	30	25
నిడదవోలు	30	24
కొవ్వూరు	30	24
జంగారెడ్డిగూడెం	29	24

ద్వారకా తిరుమల గదుల సమాచారం (ఖాళీలు)

టీటీడీ సదనం	12
రాణి చిన్నయమ్మారావు సదనం	26
మావులేటి సదనం	5
ఆళ్వార్ సదనం	16
బాలాజీ సదనం	6
ఆండాళ్ సదనం	3
పద్మావతి సదనం	3
ధర్మ అప్పరాయ సదనం	108
కాటేజీలు	15

రాత్రి 8 గంటల వరకు అందిన సమాచారం

ఫోన్ నెంబర్ : 08829 271427

చికెన్ ధరలు

ఫారం ధర	88.00
లైవ్ రిటైల్	103.00
విత్ స్కిన్	144.00
స్కిన్ లెస్	170.00

గుడ్డు ధర ఒక్కింటికి రూ. 3.59

బంగారం, వెండి ధరలు (నరసాపురం)

24 క్యారెట్ల బంగారం (10 గ్రాములు)	: 29,860
22 క్యారెట్ల బంగారం (10 గ్రాములు)	: 27,470
వెండి (కేజీ)	: 40,420

అపరాల ధరలు (తాడేపల్లిగూడెం)

	కిలో ధర
కందిపప్పు (నెంబర్ వన్)	రూ. 65
మినపప్పు	రూ. 65
శనగపప్పు	రూ. 75
వేపుడు శనగపప్పు	రూ. 90
పెసర పప్పు	రూ. 70

పీఆర్సీ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

అపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాపిరాజు



లక్ష్మణస్వామిని సత్కరిస్తున్న అపస్ రాష్ట్ర, జిల్లా నాయకులు

ఏలూరుఅర్బన్ : ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్సీ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) అధ్యక్షుడు డి. బాపిరాజు డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం ఏలూరులోని అరవింద విద్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.బాపిరాజు మాట్లాడుతూ పీఆర్సీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అపస్ రాష్ట్ర మహాసభలను నవంబరు 11, 12 తేదీల్లో గుంటూరులో నిర్వహిస్తున్నామని ప్రకటించారు. గతంలో రద్దు చేసిన అర్ధజీతపు సెలవును (హెచ్‌పీఎల్) తిరిగి పునరుద్ధరించి జడ్పీ, మండల పరిషత్, ఎయిడెడ్ టీచర్లకు కూడా వర్తింప చేయాలన్నారు. ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ అవార్డును అందుకున్న సంఘ నాయకులు బి.లక్ష్మణస్వామిని సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేఎస్‌వీకే రాజ్‌కుమార్, యు. మహేశ్వరరావు, ఉపాధ్యక్షుడు డి.రామనాగేశ్వరరావు, ఏవీ రమణ, శర్మ, జి.గణపతి పాల్గొన్నారు.

దిగివచ్చిన కూరగాయల ధరలు



కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

తాడేపల్లిగూడెం అర్బన్ : కూరగాయల ధరలు దిగివచ్చాయి. గతం వారంతో పోల్చుకుంటే కిలోకు రూ.10కి పైగానే తగ్గాయి. గతవారం కిలో రూ.100 పలికిన పచ్చిమిర్చి ఏకంగా రూ.30 పడిపోయింది. అదే బాటలో టమాటా కూడా రూ.50 పరిమితమైంది. కంద, పెండళం కూడా కిలోకు రూ.20 వరకు తగ్గాయి. జిల్లా వ్యాప్తంగా కూరగాయల పంటలు చేతికందడంతో ధరలు తగ్గాయి. కూరగాయలు పండించే మెట్ట ప్రాంతాలైన చింతలపూడి, లింగపాలెం, టి.నర్సాపురం, కన్నాపురం, బుట్టాయగూడెం, నల్లజర్ల మండలంలోని ఆవపాడు, ప్రకాశరావుపాలెం, సింగరాజపాలెం, తాడేపల్లిగూడెం మండలంలోని లింగారాయుడుగూడెం, జగ్గన్నపేట, రామన్నగూడెం, వెంకట్రామన్నగూడెం ప్రాంతాల్లో పండించిన కూరగాయలు నిత్యం వ్యాన్లలో, ఆటోలలో మార్కెట్‌కు వస్తుండడంతో కూరగాయల ధరలు సామాన్యులకు అందుబాటులోకి వచ్చాయి. గతంలో పావుకిలో, అరకిలో కొనుగోలు చేసేవారు ధరలు తగ్గడంతో కేజీల్లో కొనుగోలు చేస్తున్నారు. ఉల్లి ధర మాత్రం ఇంకా సామాన్యుడికి అందుబాటులోకి రాలేదు. మహారాష్ట్ర రకం ఉల్లి కిలో రూ.30, కర్నూలు రకం ఉల్లి కిలో రూ.20 నుంచి 25 మధ్య విక్రయిస్తున్నారు. కర్నూలు రకం ఉల్లి ఎక్కువగా నిల్వ ఉండకపోవడం వలన తక్కువ మొత్తంలోనే వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. మహారాష్ట్ర రకం ఉల్లి ధర ఎక్కువైనా నిల్వకు ఆగడం వలన ఎక్కువ మంది దీని కొనుగోలుకు మక్కువ చూపుతున్నారు. పేద బడుగు, బలహీన వర్గాల వారు మాత్రం కర్నూలు రకం ఉల్లినే కొనుగోలు చేశారు.

ధరలు ఇలా...

బీరకాయలు కిలో రూ.30, బెండకాయలు రూ.30, దొండకాయలు రూ.20, కాకరకాయలు రూ.40, పచ్చిమిర్చి రూ.30, కీరదోస కాయలు రూ.40, క్యాప్సికం రూ.60, కంద రూ.40, పెండ్ల దుంపలు రూ.40, ఆగాకర రూ.120, చిక్కుడుకాయలు రూ.80, టమాటా రూ.50, దోసకాయలు రూ.20, మహారాష్ట్ర రకం ఉల్లి రూ.30, కర్నూలు రకం ఉల్లి రూ.20-25, అరటికాయ రూ.5, మునగకాడ రూ.5, కొత్తిమీర కట్ట రూ.10 వరకు విక్రయాలు సాగాయి.

ఏపీ ఫార్మాసిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మహీధరాచార్యులు



నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మహీధరాచార్యులను అభినందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్ : ఏపీ ఫార్మసిస్ట్ అసోసియేషన్ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడిగా మహీధరాచార్యులు ఎన్నికయ్యారు. బీవీఆర్ కళా కేంద్రంలో ఆదివారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా కృష్ణా జిల్లా శాఖాధికారిణి వి.మాలతి, రాష్ట్రకోశాధికారిగా బీఎస్ నాయుడు వ్యవహరించారు.ఒక్కో పోస్టుకు ఒక్కొక్క నామినేషన్ నమోదు కావడంతో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. అధ్యక్షుడిగా మునగంటి మహీధరాచార్యులు (భీమడోలు సీహెచ్‌సీ), ఉపాధ్యక్షులుగా పి.శ్రీనివాసరావు (తాళ్ళపూడి), జీవీ శంకరరావు (వేల్పూరు), ఎంవీఎన్‌ఎల్ తులసి (ఏలూరు), జి.పద్మజ (నరసాపురం), ప్రధాన కార్యదర్శిగా పి.వెంకట్రామయ్య (ఏలూరు), కార్యనిర్వాహక కార్యదర్శిగా యం.రామదాసు (మేడపాడు), సంయుక్త కార్యదర్శులుగా జి.రామకృష్ణ (ఆచంట), ఇ.అమ్మాజీ (బుట్టాయగూడెం), బీవీఎస్‌ఎఎన్ శాంతి (పాలకొల్లు), టీవీ చిన్నారావు (పోడూరు), కోశాధికారిగా యం.శ్రీధరాచార్యులు (ధర్మాజీగూడెం) ఎన్నికయ్యారు.

జాతీయ బ్రాహ్మణ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ



లక్ష్మీనారాయణ

పాలకొల్లు అర్బన్: బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షునిగా పట్టణానికి చెందిన ప్రముఖ ఆడిటర్ పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. హరిద్వార్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ కార్యవర్గ సమావేశంలో తనను జాతీయ ఉపాధ్యక్షునిగా నియమించినట్లు లక్ష్మీనారాయణ ఫోన్‌లో విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన క్షీరపురి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు ఎస్.కేశవరావు, పీఎస్ఎన్, వీవీ ఎస్ఎన్ ప్రసాద్, సి.రవిశంకర్, సాయిరామ్, మండా లక్ష్మణ కుమార్, డాక్టర్ బ్రిడ్జిమోహన్ కృష్ణ తదితరులు అభినందించారు.

రూ.లక్షా 46 వేల బంగారం చోరీ

ఐ. పంగిడి (కొవ్వూరు) : గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలో చొరబడి రూ.లక్షా 46 వేలు విలువైన బంగారం, వెండి వస్తువులు దొంగిలించుకుపోయారని రూరల్ ఎస్ఐ మద్దుకూరి సోమసుందరరావు తెలిపారు. ఐ.పంగిడికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ తానేటి బ్రహ్మారావు ప్రతీ రోజూ మాదిరిగా శనివారం రాత్రి ఇంటికి తాళాలు వేసి వెనుకవైపు ఉన్న గదిలో నిద్రించాడు. అర్ధరాత్రి 1.30 సమయంలో ఇంటి లోపల చప్పుడు రావడంతో బయటకు రావడానికి ప్రయత్నించగా తలుపునకు గెడ పెట్టడంతో సాధ్యం కాలేదు. పక్కింటి వారికి ఫోన్ చేయగా వారు వచ్చి గడియ తీయడంతో బయటకు వచ్చి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువా తలుపులు తెరిచి 20 గ్రాములు బంగారు వస్తువులు, కేజీంపావు వెండి వస్తువులు, 76 వేలు నగదు, ఫ్యాషన్ ప్లస్ మోటారు సైకిల్ దొంగిలించుకుపోయినట్లు గుర్తించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 2, 3

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): విద్యా విషయాల్లో ఆటంకాలు ఎదురవుతాయి. ప్రేమలు బెడిసి కొట్టే అవకాశం వుంది. సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. పొదుపు పథకాలు, పెట్టుబడుల విషయంలో ఆచితూచి ముందడుగు వేయండి.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): కుటుంబ వ్యవహారాలు మనస్తాపం కలిగిస్తాయి. బదిలీ ప్రయత్నాలు ఫలించకపోవచ్చు. కార్యాలయంలో కొంత అసౌకర్యానికి గురవుతారు. వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు.

మిథునరాశి: (మే21-జూన్21): విద్యార్థులు లక్ష్య సాధనకు పట్టుదలతో కృషి చేయాల్సి ఉంటుంది. వాహనాల కారణంగా అసౌకర్యానికి గురవుతాయి. రిప్రజెంటేటివ్‌లు, ఏజెంట్లకు శ్రమాధిక్యం. సమావేశాల్లో మాటపడాల్సి వస్తుంది.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులకు అటంకాలు కలిగే అవకాశం ఉంది. డిపాజిట్లపై మంచి ప్రతిఫలం అందుకుంటారు. రుణప్రయత్నాలు ఫలించకపోవచ్చు. ఖర్చులు అదుపులో పెట్టుకోవాలి.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): మనసును ఏదో వెలితి బాధిస్తుంది. చేపట్టిన పనులకు ఆటంకాలు ఎదురువుతాయి. కొత్తగా చేపట్టే పనుల ప్రారంభాన్ని వాయిదా వేయండి. అన్ని విషయాల్లో శ్రమాధిక్యం తప్పకపోవచ్చు.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో అవాంతరాలు ఎదురవుతాయి. దీర్ఘకాలంగా వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. రహస్య సమాచారం అందుకుంటారు.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): మ్యూచ్యువల్ ఫండ్స్, బ్యాంక్ డిపాజిట్లు, పొదుపు పథకాల వ్యవహారాలకు అనుకూల సమయం కాదు. సన్నిహితుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. స్నేహానుబంధాలు బలపడతాయి.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఉద్యోగ, వ్యాపారాల్లో అనుకోని చికాకులు ఎదురవుతాయి. పెద్దల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించాలి. గౌరవ, ప్రతిష్ఠలకు భంగం కలిగే అవకాశం ఉంది. సంకల్ప సాధనకు పట్టుదలతో కృషి చేస్తారు.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ప్రణాళిక లోపించడం వల్ల లక్ష్యాలు సాధించలేకపోతారు. న్యాయపరమైన వివాదాలకు ఆస్కారం ఉంది. సమావేశాలు, చర్చలు, వ్యూహరచనలకు అనుకూలం. విద్యార్థులకు శుభప్రదం.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ఆస్పత్రులు, బ్యాంకులు, చిట్‌ఫండ్‌లు, మ్యూచ్యువల్ ఫండ్ రంగాల వారికి ఆర్థికంగా నిరుత్సాహకరం. గ్రాట్యుటీ, బీమా, వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. ఒక బాధాకరమైన సమాచారం అందుకుంటారు.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): ఆర్థిక విషయాల్లో భాగస్వామి వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. వేడుకల్లో ఖర్చులు అంచనాలు మించుతాయి. స్పెక్యులేషన్లు, పెట్టుబడుల్లో నష్టాలు తప్పకపోవచ్చు. సమావేశాల్లో కీలకపాత్ర పోషిస్తారు.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): వ్యవసాయం, పరిశ్రమలు, హోటల్ రంగాల వారు లక్ష్య సాధనకు అధికంగా శ్రమించాలి. విందుల్లో పరిమితి పాటించాలి. ఇంటర్వ్యూలలో నిరాశ తప్పకపోవచ్చు. ఆస్పత్రులు సందర్శించాల్సి రావచ్చు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

నేడు ధర్మాజీగూడెం ఎస్‌బీఐ పరిధిలో ఉపాధి ఇంటర్వ్యూలు

లింగపాలెం : లింగపాలెం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ధర్మాజీగూడెం ఎస్‌బీఐ పరిధిలో స్వయం సోపానం ఉపాధికి దరఖాస్తులు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో కృష్ణకుమారి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు తదితర నిరుద్యోగ యువతీ, యవకుల ఉపాధి రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారందరికీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. అయ్యప్పరాజుగూడెం, భోగోలు, నర్సన్నపాలెం, కలరాయినగూడెం గ్రామాల దరఖాస్తుదారులందరూ అధికారుల సమక్షంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. బయోమెట్రిక్ విధానంతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఆధార్‌కార్డులు తీసుకురావాని తెలిపారు.

సమాచారం

సమాచారం

ఆసుపత్రి సమాచారం :
చింతలపూడి ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో 30 పడకల సౌకర్యం ఉంది
ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.మాలిని : 80085 53506
డాక్టర్ ఎస్‌కే ఈ.ఎం.రసూల్, ఫిజీషియన్ : 9177057646
డాక్టర్ కళ్యాణ్‌బాబు ఎంఎస్ సర్జన్ - 9490433302
డాక్టర్ రణధీర్‌రెడ్డి 9849731810
కె.సురేంద్ర, ఆప్తాల్మిక్ ఆఫీసర్ : 80088 38435

సంత మార్కెట్ :
సోమవారం- చింతలపూడి, మంగళవారం-యర్రగుంటపల్లి గ్రామాల్లో సంత జరుగుతుంది.

ధ్యాన యోగ సమాచారం :
శ్రీశ్రీ ధ్యానమందిరం, మారుతీనగర్, నిర్వాహకులు జె.సూరారెడ్డి 9440452047, ప్రతీ ఆదివారం ఉదయం 6 గంటలకు యోగా తరగతులు నిర్వహిస్తారు.

అన్నదాన సమాచారం :
ప్రతీ గురువారం షిర్డీ సాయిబాబా ఆలయంలో మధ్యాహ్నవేళంలో ఉచిత అన్నదాన కార్యక్రమం జరుగుతుంది.

ఆలయాలు, పూజలు :
వేగిలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రతీ సోమవారం సాయంత్రం 6 గంటలకు మహాశివహారతి పూజా కార్యక్రమం జరుగుతుంది.



గ్యాస్ సమాచారం

చింతలపూడి గాయత్రి (భారత్) గ్యాస్ ఏజెన్సీ సోమవారం గ్యాస్ సరఫరా చేసే ప్రాంతాలు..

రేచర్ల, యర్రగుంటపల్లి, అల్లిపల్లి, ఊటసముద్రం, సీతానగరం, చింతంపల్లి, మేరిశెట్టివారిపాలెం, లింగపాలెం, మఠంగూడెం, ధర్మాజీగూడెం, కామవరపుకోట, కొత్తూరు

● గ్యాస్ బుకింగ్ కోసం ఫోన్ నెంబర్లు 08823 - 222340,223655,223440
ఆన్‌లైన్ బుకింగ్ కోసం : 9440156789

● చింతలపూడి

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

చింతలపూడి	: 98856 65001
కామవరపుకోట	: 98662 37516
లింగపాలెం	: 94413 89314

● సినిమాలు

చింతలపూడి :

శ్రీరత్నమినీ	ఆనందో బ్రహ్మ
శ్రీరత్న	లై
గౌరి	స్పైడర్‌మాన్
శారదామినీ	జయ జానకి నాయక

రోడ్డా.. చెరువా..

ప్రగడవరంలో చెరువును తలపిస్తోన్న మెయిన్ రోడ్
పెద్ద గొయ్యితో వాహనదారులకు తప్పని ఇబ్బందులు

చింతలపూడి : చింతలపూడి- కామవరపుకోట మార్గంలోని ప్రగడవరం వద్ద మెయిన్‌రోడ్డుపై పెద్దగొయ్యి చెరువును తలపిస్తోంది. ఆ దారిన వెళ్లే ప్రతీ ఒక్కరూ ఇది రోడ్డా.. చెరువా.. అని ఈ రోడ్డుపై ఎలా ప్రయాణించాలని ప్రశ్నిస్తున్నారు. మేజర్ పంచాయతీ అయిన ప్రగడవరం గ్రామంలో రోడ్డు విస్తరణ జరిపి ఐదేళ్ల వరకు డ్రెయినేజీ, రోడ్డును నిర్మించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు ఏడాది కిందట మెయిన్‌రోడ్డుకు సీసీ రోడ్డు వేశారు. ఈ సీసీ రోడ్డు నుంచి తారురోడ్డుకు లింకు కలపకుండా వదిలివేయడంతో అది పెద్దగొయ్యిగా మారి వర్షం పడితే చెరువును తలపిస్తోంది. రోడ్డంతా బాగానే ఉన్నప్పటికీ గ్రామం మధ్యలో ఈ గొయ్యి వల్ల వర్షాలు పడినప్పుడు చెరువులా మారి ప్రజలకు వెళ్లే దారి లేకుండా చేస్తుంది. రాత్రివేళ వెళ్లాలంటే వాహనం దిగబడుతుందేమోనని భయపడుతున్నారు. ఈ మార్గంలో నిత్యం రాజమండ్రి, ద్వారకాతిరుమల, భీమడోలు, జంగారెడ్డిగూడెం, తాడేపల్లిగూడెం ప్రాంతాలకు బస్సులు, వాహనాల రాకపోకలు జోరుగా ఉంటాయి. వర్షం కురిసిన సమయంలో ఈ గొయ్యి ప్రమాదకరంగా తయారవుతోంది. ఇప్పటికైనా అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రగడవరం మెయిన్ రోడ్డుపై చెరువులా మారిన గొయ్యి

ప్రమాదాలు జరగక ముందే చర్యలు చేపట్టాలి..



ప్రగడవరం మధ్యలోనే సిమెంట్ తారురోడ్డు కలిసేచోట ఏర్పడ్డ ఈ గొయ్యి వల్ల ప్రమాదాలు జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. తూరలు వేసి జాయింట్ కలపాలంటూ చెప్పినప్పటికీ పనులు ముందుకు సాగడం లేదు.

- తాళ్లూరి చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు, ప్రగడవరం

పాఠశాలకు 'వెంకటరెడ్డి ట్రస్టు' బెంచీలు అందజేత



పాఠశాలకు బెంచీలను అందజేస్తున్న కేవీఆర్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు

కామవరపుకోట : జలపాలవారిగూడెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు కేసరి వెంకటరెడ్డి చారిటబుల్ ట్రస్టు తరపున లక్ష రూపాయల విలువైన బెంచీలను ఆదివారం పాఠశాలకు అందించారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ విజయ్‌భాస్కరరెడ్డి మాట్లాడుతూ కేవీఆర్ ట్రస్టు తరపున గ్రామంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ గోరిక రాములు, మానవత సంస్థ చైర్మన్ మడితా రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి కేవీఆర్ ట్రస్టు అందజేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో టీవీఎస్ రాజు, డి.సురేష్, కె.బాలస్వామి, కె.వెంకటరెడ్డి కుటుంబసభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తమ్మిలేరు జలాశయానికి వచ్చిన వరద నీరు

తమ్మిలేరుకు జలకళ

ఒక రోజుకే పెరిగిన మూడు అడుగుల నీరు

చింతలపూడి : తమ్మిలేరు రిజర్వాయర్‌కు ఎగువ నుంచి వరదనీరు రావడంతో నీటిమట్టం ఒకరోజులోనే మూడు అడుగులు పెరిగింది. ఎగువున కురుస్తున్న వర్షాలు వల్ల రిజర్వాయర్‌లోకి రెండు వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం నీటిమట్టం 337 అడుగులకు చేరింది. ప్రాజెక్టులో 344 అడుగులు వస్తే ఖరీఫ్, రబీకి సరిపోతుంది. రెండు బేసిన్‌లు ఉన్న రిజర్వాయర్‌లో సాగునీటి అవసరం కోసం రైతులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. రాష్ట్ర విభజనతో ఎగువ నుంచి వచ్చే నీటికి తెలంగాణ ప్రాంతంలో నీటిని మళ్లించడంతో కొద్ది సంవత్సరాలుగా నీరు రావడం లేదు. ఈ ఏడాది వర్షాల వల్ల అధికంగా నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు వద్ద అధికారులు అప్రమత్తం అయ్యారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళులు

చింతలపూడి : మాజీ ప్రధాని, దివంగత రాజీవ్‌గాంధీ 73వ జయంతిని ఆదివారం స్థానిక పాతబస్టాండ్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద ఘనంగా జరిగింది. కాంగ్రెస్ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యదర్శి థామస్ మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ హయాంలో దేశం సాంకేతిక అభివృద్ధి చెందిందని, 18 ఏళ్లకే ఓటు హక్కును కల్పించారని పేర్కొన్నారు. పేద, బడుగు, బలహీనవర్గాల పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. చంద్రబాబు, జగన్‌లు రాజకీయాలు చేస్తున్నారని, నంద్యాలలో గెలుపుకోసం కోట్లు కుమ్మరిస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా వృద్ధ వితంతువుకు దుస్తులను అందజేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేట వెంకన్న, సుందరం, మూర్తజా ఆలీ, సిద్ధాంతం రాంబాబు, పులిపాటి పాండు రంగారావు తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసిన కాంగ్రెస్ నాయకులు

గరగపర్రు దళితులకు న్యాయం చేయాలి

ఏలూరు ఫైర్‌స్టేషన్ : గరగపర్రు దళితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని కేవీపీఎస్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం కేవీపీఎస్ కార్యాలయంలో సుధీర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ నాలుగు నెలలుగా న్యాయం చేయాలని దళితులు పోరాటం చేస్తున్నప్పటికి ప్రభుత్వం సరిగా స్పందించడం లేదని ఆరోపించారు. కొంతమందికి నష్టపరిహారం చెల్లించినప్పటికీ ఇంకా 84 కుటుంబాలకు పరిహారం ఇవ్వలేదన్నారు. గ్రామం అభివృద్ధి కోసం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులతో రోడ్లు వేయిస్తామని, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తామని ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడంలో స్పష్టత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్.రాజీవ్, ఎం.జ్యోతిబసు, కె.కల్పన, ఎస్.భగత్ పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా శ్రీనివాస కల్యాణం

కామవరపుకోట : తడికలపూడి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి వేంకటేశ్వరస్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులకు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన కల్యాణ వేడుకలను తిలకించేందుకు పరిసర ప్రాంతాల భక్తులు తరలి వచ్చారు. స్వామి వారిని దర్శించుకుని అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

రూ. 7 వేలు స్వాధీనం

కామవరపుకోట : కామవరపుకోటలో ఆదివారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. 8 మంది జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 7 వేలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కె.విష్ణువర్ధన్ తెలిపారు.

నేడు పెదపాడులో మీ-కోసం

పెదపాడు : ప్రతి సోమవారం నిర్వహించే మీ కోసం కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించడం జరుగుతుందని పెదపాడు తహసీల్దారు జీజేఎస్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులంతా పాల్గొంటారని, గ్రామాల్లో ఉండే సమస్యలు, వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధి, ఇతర సమస్యలపై ఆర్జీ రూపంలో దరఖాస్తు చేసుకుంటే వాటిపై విచారణ జరిపి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మీ కోసం కార్యక్రమంలో అందే దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామని తహసీల్దారు కుమార్ తెలిపారు.

ఇలాగైతే స్వచ్ఛ గ్రామాలు ఎలా..?

● రహదారులనే పశువులకు ఆవాసాలుగా మార్చుతున్న వైనం



కేదవరంలో నడిరోడ్డుపైనే కట్టి ఉంచిన పశువులు

దెందులూరు : మండలంలోని పోతునూరు శివారు కేదవరం గ్రామంలో ప్రధాన నడిరోడ్డుపై కొంత మంది పెద్ద సంఖ్యలో పశువులను ఉంచుతున్నారు. ఒక పక్క ప్రభుత్వం స్వచ్ఛభారత్ నిర్వహించాలని, రోడ్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ప్రచారం నిర్వహిస్తున్నప్పటికీ కొంతమంది మాత్రం నిర్లక్ష్య వైఖరితో గ్రామంలోని ప్రధాన రోడ్లమీదే కనీసం వాహనాలు, పాదచారులు నడిచేందుకు వీలు లేకుండా పశువులను కట్టి ఉంచుతున్నారు. దీనివల్ల రోడ్డుపై పశువులు రాకపోకలకు అడ్డంగా మారడంతో పాటు వాటి పేడతో ఆ దారంతా మురికిమురికిగా మారింది. పక్కనే మంచినీటి చెరువు, ఎదురుగా ప్రభుత్వపాఠశాల ఉన్నప్పటికీ పశువులను రోడ్లపై ఉంచడంపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య రక్షణకు ప్రజలంతా సహకరిస్తేనే సాధ్యమవుతుందని, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పశువులను రోడ్లపై ఉంచకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

స్టూడెంట్ వాయిస్



ప్రతి నియోజకవర్గాని కి ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేయాలి

గుల్లపూడి భానుచందర్, డిగ్రీ విద్యార్థి, కొవ్వలి

ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక ప్రభుత్వ కళాశాలను ఏర్పాటు చేయడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత చదువులు అందే అవకాశం ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో 10వ తరగతి వరకు ఉచిత విద్య అయిపోయిన అనంతరం ప్రభుత్వ కళాశాలలు లేకపోవడంతో ప్రైవేటు కళాశాలలకు వెళ్ళాలంటే లక్షల్లో ఫీజులు ఉన్న నేపథ్యంలో చాలామంది విద్యార్థులు చదువుకు దూరంగా మిగిలిపోతున్నారు. ప్రైవేటు కళాశాలల్లో ఫీజుల మోతను భరించగలిగే కొద్దిమంది మాత్రమే ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్నారు. అందరికీ విద్యను అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే ఇప్పటికైనా నియోజకవర్గానికి కనీసం ఒక కళాశాలను ఏర్పాటు చేయాలి.

● దెందులూరు

నేటినుంచి జవహర్ నవోదయలో క్లస్టర్ స్థాయి ఆటల పోటీలు

పెదవేగి : పెదవేగిలోని జవహర్ నవోదయ విద్యాలయం(జేఎన్వీ)లో నవోదయ క్లస్టర్ స్థాయి ఆటల పోటీలు సోమవారంనుంచి రెండురోజులపాటు జరుగుతాయని జేఎన్వీ ప్రిన్సిపాల్ జి.మల్లిఖార్జునబాబు తెలిపారు. శ్రీకాకుళంనుంచి గుంటూరువరకు ఉన్న జిల్లాలకు చెందిన నవోదయ విద్యాలయాలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని ఆయన చెప్పారు. ఈ పోటీల్లో ఆటల పోటీలతోపాటు సైన్సు, గణితం, క్రాఫ్ట వంటి అంశాల్లో ప్రదర్శన కూడా ఉంటుందన్నారు. క్లస్టర్ స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు కర్నూలులో జరిగే రీజియన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన వివరించారు.



వెంకటాపురం గ్రామంలో రోడ్డు పై నిలిచిన మురుగునీరు

రోడ్డు పైనే మురుగు నీరు...

వెంకటాపురం (పెదపాడు) : పలు గ్రామాల్లో పూర్తి స్థాయిలో పక్కా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల డ్రెయిన్ల లో మురుగునీరు నిలిచిపోతోంది. దీనివల్ల వర్షాలు కురిసిన సమయంలో మురుగు వాననీటితో కలిసి రోడ్లపైకి వస్తోందని, దీనిని నివారించడానికి గ్రామంలో పక్కా డ్రెయినేజీని ఏర్పాటు చేయాలని పెదపాడు మండలం వెంకటాపురం గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామంలో పలుచోట్ల పక్కాడ్రెయినేజీ లేక పోవడం వల్ల కచ్చా డ్రెయిన్లలో సిల్టు పేరుకుపోయి మురుగునీరు రోడ్లపైకి వచ్చి చేరుతోందని, సమీపంలో అంగన్‌వాడీ, పాఠశాల ఉండటం వల్ల విద్యార్థులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. మురుగునీరు నిల్వ వల్ల దోమలు పెరిగిపోతున్నాయని, అనారోగ్య పరిస్థితులేర్పడుతున్నాయని, అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుని గ్రామంలో పక్కా డ్రెయినేజీని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రాట్నాలమ్మ ఆలయానికి భక్తుల తాకిడి



విశేషాలంకరణలో అమ్మవారు

పెదవేగి : పెదవేగి మండలం రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మవారిని భక్తులు ఆదివారం విశేషసంఖ్యలో దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు అమ్మవారికి పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు అమ్మవారికి లలితా సహస్రనామ దేవీఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు.. ఆలయ పునర్నిర్మాణానికి భక్తులు రూ.38,333 విరాళాలు అందించారని ఆలయ కమిటీ చైర్మన్ భాస్కరరావు, ఈవో అరుణ్‌కుమార్ తెలిపారు. ఏలూరుకు చెందిన ఎం.సాయికిరణ్ అమ్మవారి ప్రసాదం, పూలాలంకరణకు సహకరించారు.

నేడు ఆలయం మూసివేత

శ్రీరాట్నాలమ్మవారి ఆలయం సోమవారం ఉదయం 11గంటలనుంచి మూసివేస్తున్నామని ఈవో ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు. తిరిగి మంగళవారం ఉదయం ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి ఆలయాన్ని తెరిచి, భక్తుల దర్శనానికి అనుమతి ఇస్తామని ఆయన చెప్పారు. శ్రావణమాస అమావాస్య కారణంగా ఆలయాన్ని ప్రత్యేకపూజలు, దిగ్బంధన సేవ అనంతరం బలిహరణ, కూష్మాండబలి నిర్వహించి, ఆలయాన్ని మూసివేస్తామని వెల్లడించారు.

ఇండియన్ బ్యాంకు పెదపాడు శాఖ పరిధిలో నేడు ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు

పెదపాడు : ఇండియన్ బ్యాంకు పెదపాడు శాఖ పరిధిలో రాయితీ రుణాలు స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు సోమవారం ఉదయం 10 గంటల నుంచి జరుగుతాయని పెదపాడు ఎంపీడీవో ఎస్.ఆశీర్వాదం తెలిపారు. పెదపాడు ఇండియన్ బ్యాంకు పరిధిలో నాయుడుగూడెం, పెదపాడు, సత్యవోలు, వడ్డిగూడెం, తాళ్లగూడెం, కొత్తూరు, వీరమ్మకుంట, గుడిపాడు, సకలకొత్తపల్లి, పునుకొల్లు గ్రామాలకు చెందిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సి ఉంది. అయా అభ్యర్థుల విద్యార్హత, వారు ఎంపిక చేసుకున్న యూనిట్లు తదితర వివరాలను ఇంటర్వ్యూలలో పరిశీలించడం జరుగుతుందని, సబ్సిడీ రుణాల కొరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.



కొవ్వలిలో భక్తాంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

దెందులూరు : మండలంలోని కొవ్వలి హైస్కూలు సమీపంలో ఉన్న భక్తాంజనేయస్వామి 8వ వార్షికోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి అభయాంజనేయస్వామికి ప్రత్యేక సింధూర, తమలపాకుల పూజ నిర్వహించారు. అనంతరం గ్రామస్థుల ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఉత్సవంలో విచిత్ర వేషధారణలతో కళాకారులు

ఘనంగా గంగానమ్మ జాతర

రామచంద్రపురం (పెదపాడు) : పెదపాడు శివారు ప్రాంతం రామచంద్రపురంలో గంగానమ్మ జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామ దేవత గంగానమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గ్రామ పురవీధులలో ఊరేగించారు. దారి పొడవునా మహిళలు పసుపు, కుంకుమలతో కూడిన నీళ్లబిందెలను అమ్మవారికి పోసి మొక్కుబడులు తీర్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాట నృత్యాలు, విచిత్ర వేషధారణలు, భారీ వేషాలు ఎంతగానో సందడి చేశాయి. గంగానమ్మ జాతర ఉత్సవంలో పెద్దసంఖ్యలో మహిళలు, చిన్నారులు, గంగానమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మీ-కోసంను వినియోగించుకోవాలి

పెదవేగి : పెదవేగి తహసీల్దారు కార్యాలయంలో సోమవారం మీ కోసం కార్యక్రమం ఉంటుందని పెదవేగి తహసీల్దారు ఎండీ నజీముల్లాషా తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరవుతారని, ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపై సంబంధిత శాఖ అధికారులు పరిశీలన జరిపి తక్షణం స్పందించే వీలుంటుందని ఆయన చెప్పారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలు సమస్యలు ఉంటే విన్నవించుకోవాలని ఆయన సూచించారు.

రుణాల మంజూరులో నిబంధనలు సడలిస్తే మరింతమందికి ప్రయోజనం

దెందులూరు : దెందులూరు మండలంలోని దత్తత గ్రామాల పరిధిలో ఉన్న బ్యాంకులు మాత్రమే రుణాలు ఇచ్చేందుకు ముందుకు రావడంతో ఉపాధి సోపానం పథకంలో దరఖాస్తుదారులు మాత్రం చాలామంది మిగిలిపోయే పరిస్థితి కనిపిస్తోంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్ల ద్వారా రుణాల మంజూరుకు 3,400 మంది దెందులూరు మండలంలో దరఖాస్తు చేసుకోగా 470 మందికి మాత్రమే యూనిట్లు ఇచ్చేందుకు సంబంధిత బ్యాంకులు ముందుకు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చొరవతో సహకార సంఘం బ్యాంకులు సైతం రుణాలు ఇచ్చేందుకు అంగీకరించాయి. అయితే ప్రభుత్వం నిబంధనల్లో చిన్నపాటి మార్పుచేస్తే వందల మందికి లబ్ధిపొందే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు దెందులూరు ఇండియన్ బ్యాంకు పరిధిలో దెందులూరు, సత్యనారాయణపురం, అలుగులగూడెంతోపాటు రామారావుగూడెం, శ్రీరామవరం గ్రామాలు దత్తత గ్రామాలు కావడంతో ఇండియన్ బ్యాంకులో మాత్రమే ఈ గ్రామాలకు చెందినవారు దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చింది. అయితే ఇండియన్ బ్యాంకు తమకున్న పరిధిలో సగంమంది అర్హులకైనా రుణాలు ఇచ్చే అవకాశం కనిపించడంలేదు. ఈ నేపథ్యంలో కనీసం కార్పొరేషన్ల కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు బ్యాంకు మార్చుకునే విధానాన్ని ప్రభుత్వం అనుమతిస్తే ఎక్కువమందికి సహకారసంఘం బ్యాంకుల ద్వారా అయినా రుణాలు అందించవచ్చునని పలువురు లబ్ధిదారులు అంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆ విధంగా చర్యలు తీసుకోవాలి.

గుండె పోటుతో టీడీపీ నేత మృతి

దెందులూరు : తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, పోతునూరు బ్యాంకు మాజీ డైరెక్టర్ బండారు సుబ్బారావు (50) గుండెపోటుతో ఆదివారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి తెలుగుదేశం అభివృద్ధి, పేదల సంక్షేమానికి సుబ్బారావు కృషి చేశారు. ఈయన పార్థివ దేహాన్ని పోతునూరు సహకార సంఘం బ్యాంకు అధ్యక్షుడు ధూళిపాల నాగేంద్రవరప్రసాద్, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనేరు సురేష్‌బాబు (బాబీ) టీడీపీ నేత గండి రాజా, బీసీ సెల్ మండలాధ్యక్షుడు నున్న లక్ష్మణ్‌తోపాటు పలువురు సందర్శించిన పూలమాలలు వేసి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

హలో ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

దెందులూరు :	9912392539
పెదపాడు :	9491555163
పెదవేగి :	9440614633

వడ్డించేవారు.. తింటారా?

- ●భోజన పథకానికి నాసిరకం గుడ్ల సరఫరా
- ●నాణ్యత లేక కంపుకొడుతున్న వైనం
- ●కోడిగుడ్ల కాంట్రాక్టర్ల కక్కుర్తి
- ●రెండున్నర లక్షల మందికి అందని పౌష్టికాహారం



ఏలూరు రూరల్ మండలం రామానగర్ ఎంపీ యూపీ స్కూలులో విద్యార్థులకు పంపిణీ చేసిన నాసిరకం కోడిగుడ్లు

ఏలూరు అర్బన్: స్కూల్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో పంపిణీ చేస్తున్న ఉడికించిన కోడి గుడ్ల నాణ్యతా ప్రమాణాలు నీరసిస్తున్నాయి. వారానికి మూడు చొప్పున ఉడికించిన కోడిగుడ్ల(బాయిల్డ్ ఎగ్స్)ను గత నెల వరకు పాఠశాలల్లో వండి పెడుతూ ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీలు విద్యార్థులకు పంపిణీ చేశాయి. బహిరంగ మార్కెట్‌లో గుడ్డు ధరల్లో హెచ్చు తగ్గులు ఉండడం, పలు పాఠశాలల్లో నిర్ణీత మెనూ ప్రకారం గుడ్లను విద్యార్థులకు వడ్డించకపోవడం, నాసిరకం గుడ్లు తదితర కారణాల వల్ల గుడ్ల పంపిణీ బాధ్యతల నుంచి ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీలను ప్రభుత్వం తప్పించింది. కేంద్రీకృత స్థాయిలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన నేరుగా పాఠశాలలకు కోడి గుడ్లు పంపిణీ చేసే బాధ్యతను కాంట్రాక్టర్లకు ఈ నెల ఒకటో తేదీ నుంచి ప్రభుత్వం అప్పగించింది. సంబంధిత కాంట్రాక్టర్ కోడి గుడ్లను పాఠశాలలకు పంపిణీ చేస్తే, అక్కడి ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ వాటిని ఉడికించి విద్యార్థులకు వడ్డించేలా విధి విధానాలను అమలు చేస్తున్నారు. ఇలా చేయడం ద్వారా విద్యార్థులకు నాణ్యతతో కూడిన గుడ్లను వడ్డించడంలో పారదర్శకత ఉంటుందని ప్రభుత్వ ఉద్దేశం. ప్రభుత్వధ్యేయం బాగానే ఉన్నా.. జిల్లాలో క్షేత్రస్థాయిలో కోడిగుడ్ల పంపిణీని పరిశీలిస్తే డొల్లతనం బహిర్గతమవుతోంది.

నెలకు 30 లక్షల గుడ్లు

పశ్చిమ గోదావరి, విశాఖ, కర్నూలు, కడప జిల్లాల్లోని పాఠశాలలకు కోడిగుడ్లను పంపిణీ చేసే బాధ్యతను విశాఖపట్నంకు చెందిన యునైటెడ్ ట్రేడర్స్ అనే కాంట్రాక్ట్ సంస్థతో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ (సీఎస్ఈ) కార్యాలయం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ నెల ఒకటో తేదీ నుంచి ప్రస్తుత విద్యా సంవత్సరం ముగిసే వరకు (వచ్చే ఏడాది ఏప్రిల్) ఇదే కాంట్రాక్ట్ ఏజెన్సీ జిల్లాలోని పాఠశాలలు అన్నింటికి కోడిగుడ్లను సరఫరా చేయాలి. జిల్లాలో భోజన పథకం అమలయ్యే పాఠశాలల్లో మొత్తం మూడు లక్షల మంది విద్యార్థులు ఉండగా, వీరిలో 2.60 లక్షల మంది ఈ పథకాన్ని వినియోగించుకుంటున్నారు. వీరిలో 2.50 లక్షల మంది విద్యార్థులు గుడ్లను తీసుకుంటున్నారు. ఒక్కో విద్యార్థికి వారానికి మూడు చొప్పున మూడు రంగుల్లో గుడ్లపై ఎండీఎం ముద్ర వేసి పాఠశాలలకు పంపిణీ చేయాలి. ఆ ప్రకారం జిల్లాలో వారానికి 7.50 లక్షల గుడ్లు చొప్పున నెలకు 30 లక్షల గుడ్లను ఏజెన్సీ సరఫరా చేయాల్సి ఉంటుంది. గుడ్డు పంపిణీ నిమిత్తం ఒక్కో విద్యార్థికి మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ఆహార పదార్థాలను వండిపెడుతున్నందుకు ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లించే కుకింగ్ చార్జీల నుంచి రోజుకు రూ.2.35 పైసలను ప్రభుత్వం మినహాయించుకుంటోంది. పాఠశాలల వారీగా సరఫరా చేసిన గుడ్లకు చెల్లించాల్సిన బిల్లులపై సంబంధిత స్కూల్ హెచ్‌ఎం, ఎంఈవో, డీఈవోల కౌంటర్ సంతకాలతో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కాంట్రాక్ట్ ఏజెన్సీకి నేరుగా బిల్లు మొత్తాన్ని చెల్లిస్తారు.

మూడు రకాల సైజులు - నాసిరకం గుడ్లు

నిబంధనలు పాటించకుండా కాంట్రాక్ట్ ఏజెన్సీ ఇష్టారాజ్యంగా గుడ్లను పాఠశాలలకు పంపిణీ చేస్తూ చేతులు దులుపుకుంటోందని పలువురు ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. వారానికి సరిపడా గుడ్లను పంపిణీ చేసి, అవి వినియోగించిన తర్వాత మరుసటి వారానికి సంబంధించిన గుడ్లను సరఫరా చేయాలి. అలాకాక కాంట్రాక్ట్ ఏజెన్సీ రెండు వారాలకు సరిపడా గుడ్లను పాఠశాలలకు ఒకేసారి పంపిణీ చేస్తుండడం వల్ల అవి పాడైపోతున్నాయి. ఉడికించిన వెంటనే తర్వాత దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఈ కారణం వల్ల పలు పాఠశాలల్లో విద్యార్థులు గుడ్లను తినడానికి తిరస్కరిస్తున్నారని హెచ్‌ఎంలు చెబుతున్నారు. విద్యార్థుల రోల్ ప్రకారం తొలి ట్రిప్‌లో గుడ్లను పంపిణీ చేసిన అనంతరం రెండో వారం నుంచి అంతక్రితం మిగిలిన గుడ్ల బ్యాలెన్స్ పోను సరఫరా చేస్తే ఇబ్బందులు వచ్చేవి కావు. దీనికి భిన్నంగా సరఫరా చేస్తుండడం, అవి పాడైపోతున్నందున వాటిని వెనక్కి తీసుకుని తాజా గుడ్లను ఇప్పించాలని జిల్లా విద్యాశాఖను పలువురు హెచ్‌ఎంలు ఇప్పటికే పలుమార్లు అభ్యర్థించడం గమనార్హం. ఏజెన్సీ సరఫరా చేస్తున్న గుడ్లలో దాదాపు సగం గుడ్లు మూడు సైజుల్లో (పెద్ద, మధ్య తరహా, చిన్నవిగా) ఉంటున్నాయి. ఒప్పందం ప్రకారం ఒక్కో గుడ్డు బరువు 40-50 గ్రాముల మధ్య ఉండాలి. పలు పాఠశాలలకు పంపిణీ అవుతున్న గుడ్లలో చాలా వరకు కనీస బరువుకంటే తక్కువగా ఉంటున్నాయని హెచ్‌ఎంలు అంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో భోజన పథకంలో పంపిణీ అవుతున్న గుడ్ల నాణ్యత, నిబంధనల అమలుపై జిల్లా విద్యా శాఖ దృష్టి సారించాలి.



కుళ్లిన గుడ్లు చూపుతున్న భోజన నిర్వాహకుడు శ్రీనివాసరావు

కుళ్లిన గుడ్లు వడ్డించేదెలా?

ద్వారకాతిరుమల: మండలంలోని తిమ్మాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మూడ్రోజుల క్రితం రెండు వారాలకుగాను 600 కోడి గుడ్లు సరఫరా చేశారు. ఇలా ఒక్కసారిగా నిల్వ ఉన్న గుడ్లు పంపడంతో కుళ్లిపోతున్నాయని భోజన నిర్వాహకులు వాపోతున్నారు. వీటిని ఎలా వడ్డించాలని ప్రధానో పాధ్యాయుడు సీతారామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు నిల్వ లేని గుడ్లు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నిల్వ గుడ్లు తింటే పిల్లల ఆరోగ్యం పాడవుతుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు.

చెత్త సేకరణలో కొత్త ప్రయోగం

- ● గ్రామాల్లో చెత్త తరలింపుపై సరికొత్త సాఫ్ట్‌వేర్
- ● చెత్త తీసుకువెళ్లారో లేదో తెలియజేసే ఆర్‌ఎఫ్‌ఐడి
- ● ఇంటింటికి కార్డు.. డ్యాష్ బోర్డుకు లింకు
- ● ప్రయోగాత్మకంగా 'పశ్చిమ'లో అమలుకు నిర్ణయం
- ● వర్మి కంపోస్టు షెడ్లున్న ప్రాంతాల్లో తొలివిడత అమలుకు ఏర్పాట్లు
- ● చెత్త సేకరణ బాధ్యత గ్రీన్ అంబాసిడర్లదే
- ● చెత్త తరలింపుకు గ్రీన్ వెహికల్స్

పారిశుధ్య నిర్వహణలో భాగంగా చెత్తసేకరణ గ్రామాల్లో క్లిష్టంగా మారిన పరిస్థితుల్లో సరికొత్త విధానంలో చెత్తసేకరణ చేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. గ్రామాల్లో చెత్త తరలింపుపై సరికొత్త విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. దీనికోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి ప్రతిరోజూ పారిశుధ్య కార్మికులు తమ ఇంటికి వచ్చి చెత్తను తీసుకువెళుతున్నారా లేదా అనే విషయాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. అంతేకాక రోజులతరబడి చెత్తను తీసుకువెళ్ళడానికి రానిపక్షంలో స్థానిక అధికారులకు చెప్పాల్సిన అవసరం లేకుండానే ఏ ఒకరోజు చెత్తను తీసుకువెళ్లకపోయినా నేరుగా ఉన్నతస్థాయి నుంచే ఈ విధానంలో స్పందన రానుంది.

(ఏలూరు సిటీ)

చెత్త తరలింపులో రేడియో ఫ్రీక్వెనీ గుర్తింపు కార్డు (ఆర్‌ఎఫ్‌ఐడి)ని ప్రవేశపెట్టనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటిగోడకు ఈ కార్డును అంటిస్తారు. పారిశుధ్య కార్మికుడు చెత్త తీసుకోగానే తన ఫోన్‌తో స్కాన్ చేయడం ద్వారా ఆ సమాచారాన్ని రికార్డు చేయాల్సిన అవసరం ఉంది. నిర్దిష్ట రేడియో ఫ్రీక్వెన్సీ ద్వారా అది నేరుగా సీఎం డ్యాష్ బోర్డుకు లింక్ అవుతుంది. దీంతో చెత్తసేకరణలో ఏ విధమైన నిర్లక్ష్యం వహించినా ప్రజలు అధికారుల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా నేరుగా ఉన్నతాధికారులే స్థానిక అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చే అవకాశం ఉంది.

పశ్చిమ నుంచే అమలు...

ఈ వినూత్న కార్యక్రమాన్ని 'పశ్చిమ' నుంచే అమలు చేయడానికి జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. తొలి విడతలో వర్మి కంపోస్టు షెడ్లు ఏర్పాటైన ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని అమలు చేసి జిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో కూడా ఈ విధానాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఆ ప్రకారం పరిశీలిస్తే జిల్లాలో ఇప్పటికే 200 గ్రామ పంచాయతీల్లో వర్మి కంపోస్టు షెడ్లు ఏర్పాట్లు యుద్ధప్రాతిపదికపై జరుగుతున్నాయి. ఈ విధానం ఇక్కడ అమలు ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా కూడా ఈ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

చెత్త సేకరణ బాధ్యత గ్రీన్ అంబాసిడర్లదే

గ్రామాల్లో ప్రతిరోజూ ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించాల్సిన బాధ్యతను గ్రీన్ అంబాసిడర్లకు అప్పగించాలని నిర్ణయించారు. ఒక్కొక్క గ్రామ పంచాయతీలో ఎవరైనా స్వచ్ఛందంగా ఈ పనులు నిర్వహించడానికి వస్తారో వారిని గ్రీన్ అంబాసిడర్లగా నియమించాలని నిర్ణయించారు. ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో రిజర్వేన్ల ప్రాతిపదికగా స్వచ్ఛందంగా వచ్చే వారి పేర్లు నమోదు చేసే కార్యక్రమం కూడా పూర్తయ్యింది. ఈ గ్రీన్ అంబాసిడర్లకు ఉపాధి హామీ పథకం నుంచి వేతనాలు చెల్లిస్తారు. ప్రతి రోజూ సక్రమంగా చెత్త సేకరణ జరుగుతుందా, గ్రామాలు శుభ్రంగా ఉంటున్నాయా అనే విషయాలను నిరంతరం పరిశీలించేందుకు పంచాయతీరాజ్ శాఖ ఈ వినూత్న కార్యక్రమానికి నాంది పలికింది. ప్రతి ఇంటికి ఆర్‌ఎఫ్‌ఐడి కార్డును ఫిక్స్ చేస్తారు. ఎప్పటికప్పుడు ఉన్నతస్థాయికి సమాచారం చేరవేయడంతో పారిశుద్ధ్యంలో ఏ మాత్రం అలసత్వం లేకుండా చర్యలు తీసుకునేందుకు వీలు కలుగుతుంది.

గ్రీన్ వెహికల్స్

ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సంబంధించి జిల్లాలో చెత్తసేకరణకు గ్రీన్‌వెహికల్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ వాహనాల ద్వారానే చెత్తసేకరించి వాటిని వర్మికంపోస్టు షెడ్లకు తరలిస్తారు. ఈ చెత్త ద్వారా వర్మికంపోస్టు ఎరువులను తయారు చేస్తారు.

ఆర్‌ఎఫ్‌ఐడి టాగ్స్ రావాల్సి ఉంది

ఈ కార్యక్రమం నిర్వహణకు సంబంధించి ఆర్‌ఎఫ్‌ఐడి టాగ్స్ త్వరలో రానున్నాయని తెలుస్తోంది. దీనికి సంబంధించిన సాఫ్ట్‌వేర్ కూడా గ్రామపంచాయతీల్లో అప్‌లోడ్ చేయాల్సిన అవసరం ఉంది. మరికొద్దిరోజుల్లో ఈ కార్యక్రమం పూర్తయ్యి నూతన చెత్తసేకరణ విధానానికి శ్రీకారం చుట్టనున్నారని తెలుస్తోంది.



సత్రంపాడు యాదవ్‌నగర్‌లో సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

50 కేజీల గంజాయి స్వాధీనం

ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఏలూరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కార్డన్ సెర్చ్

ఏలూరు క్రైం : ఏలూరులో గంజాయి మత్తు మాఫియా వెలుగు కొచ్చింది. ఆదివారం పోలీసులు నిర్వహించిన కార్డన్ సెర్చ్ తనిఖీల్లో 50 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విశాఖ ఏజెన్సీ నుంచి గంజాయిని తీసుకువచ్చి విద్యా సంస్థల సమీపంలోనే స్థావరాలు ఏర్పాటు చేసుకుని విద్యార్థులకు గంజాయి మత్తు అలవాటు చేస్తున్నట్టుగా తెలిసింది. జిల్లా ఎస్పీ ఎం.రవిప్రకాష్‌కు అందిన సమాచారంతో ఆయన ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ గోగుల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నగర సీఐ ఎన్.రాజశేఖర్, టూటౌన్ సీఐ జి.మధుబాబు, ఏలూరు రూరల్ సీఐ అడపా నాగమురళీ, సిబ్బంది కలిసి ఆదివారం సాయంత్రం ఐదు ప్రాంతాలపై కార్డన్ సెర్చ్ చేపట్టారు. 100 మంది పోలీసు బలగాలు, ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులతో ప్రత్యేక బృందాలు సత్రంపాడు, యాదవనగర్, శాంతినగర్, ఎంఆర్‌సి కాలనీ, వట్లూరు హౌసింగ్ బోర్డు కాలనీలలో ఏకకాలంలో దాడులు చేపట్టారు. ఏలూరు సత్రంపాడులోని సీఆర్‌ఆర్ లా కాలేజీ(ప్రస్తుతం బీ ఫార్మసి కాలేజీ) వెనుక ప్రాంతంలో మూడు ఇళ్ళల్లో సుమారు 50 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ గోగుల వెంకటేశ్వరరావు, నగర సీఐ రాజశేఖర్, వన్‌టౌన్ ఎస్ఐ కె.రామారావు, త్రీటౌన్ ఎస్ఐ ఎ.పైడిబాబు, వారి సిబ్బందితో గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కందుల పద్మ, గాలం కోటేశ్వరమ్మను అదుపులోకి తీసుకున్నారు. గంధం తిరుపతమ్మ అనే మహిళ పరారైంది. ఆమెతోపాటు మరికొంతమంది గంజాయితో సంబంధం ఉన్న యువకులు కూడా పారిపోయినట్టుగా గుర్తించారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని ఏలూరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



మాదల నాగేశ్వరరావు (ఫైల్ ఫొటో)

విద్యుదాఘాతానికి రైతు బలి

పెదవేగి మండలంలో ఘటన

మృతుని కుటుంబానికి చింతమనేని ఓదార్పు

పెదవేగి: విరిగిన పామాయిల్ మట్టను తొలగించబోయిన ఆ రైతు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పెదవేగి మండలం కొప్పులవారిగూడేనికి చెందిన మాదల నాగేశ్వరరావు ఆదివారం ఉదయం 7.30 గంటల సమయంలో గ్రామానికి సమీపంలోని పామాయిల్ తోటకు వెళ్ళారు. తోటలో విరిగిపడిన పామాయిల్ మట్ట అడ్డుగా ఉందని దానిని తీయబోయారు. అయితే ఆ మట్టను ఆనుకుని విద్యుత్ తీగలు వెళ్ళడం, ఆ తీగల నుంచి విద్యుత్ ప్రవహిస్తుండడంతో నాగేశ్వరరావు విద్యుదాఘాతానికి గురయ్యాడు. కొద్దిసేపటికి అక్కడకు వెళ్ళిన కూలీలు విగతజీవునిగా మారిన మాదల నాగేశ్వరరావు(54)ను ఇంటికి తీసుకొచ్చారు. నాగేశ్వరరావుకు భార్య శ్రీదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న దెందులూరు శాసనసభ్యుడు చింతమనేని ప్రభాకర్ మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

గొల్లవానితిప్ప ప్రాథమిక పాఠశాల



చక్కటి భవనం, పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు

ప్రభుత్వ పాఠశాలల్లో అన్నీ ఉచితమే.. సౌకర్యాలెన్నో.. యూనిఫాం ఉచితం..మధ్యాహ్న భోజనం పెడతారు.. ఆడపిల్లలకు సైకిళ్లు ఇస్తున్నారు..అవకాశం వస్తే ప్రభుత్వ పాఠశాలల గురించి మన అధికారులు, ప్రతినిధులు ఇవే పాఠాలు వల్లిస్తుంటారు.. నిజమే కావచ్చు.. ఇన్ని చేస్తున్నా ఎందుకు పిల్లలు ప్రభుత్వ స్కూళ్లవైపు చూడడం లేదు.. చాలా స్కూళ్లలో కనీస సౌకర్యాలు ఉండడం లేదు.. పాడుపడిన భవనాలు.. మరుగుదొడ్ల సౌకర్యాలు...సరిపడా తరగతి గదులు లేక పోవడం.. ఇటువంటి అసౌకర్యాలు కనిపిస్తున్నాయి.. మచ్చుకు మూడు స్కూళ్లను పరిశీలిస్తే చిత్రమైన పరిస్థితులు కనిపించాయి.. అవేంటో చూద్దాం..

దేగాపురం పాఠశాల



శిథిలావస్థకు చేరడంతో ఈ భవనాన్నే కూల్చివేశారు..

తడబడులు

ఇక్కడన్నీ ఉన్నాయి.. కానీ..!

ఇది భీమవరం గొల్లవానితిప్ప రోడ్డులో ఉన్న ప్రాథమిక పాఠశాల.. ఇక్కడ సౌకర్యాలను చూస్తే అందరికీ ఆశ్చర్య మేస్తుంది. గతేడాది 35 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులతో కొనసాగిన పాఠశాల ఈ ఏడాది ప్రారంభంలో కొంతమంది తగ్గడంతో మూసివేశారు. ఈ పాఠశాలకు సంబంధించి మూడు భవనాలు ఉన్నాయి. వాటిలో రెండేళ్ళ క్రితమే ఓ భవనాన్ని నూతనంగా దాదాపు రూ.15 లక్షలతో నిర్మించారు. పాఠశాల ఆవరణలో క్రీడలకు సంబంధించి పనిముట్లు ఉన్నాయి. ఇన్ని సౌకర్యాలున్న పాఠశాలలో విద్యార్థులు రాకపోవడానికి కారణం పాఠశాలకు పక్కనే ఉన్న యనమదుర్రు గట్టు మీద కొన్ని నెలలుగా వేస్తున్న చెత్తే కారణమని అక్కడివారుతులు చెబుతున్నారు. చెత్త వేయడం వల్ల దుర్వాసన రావడం, విద్యార్థుల సంఖ్య తగ్గడంతో పాటు కొన్ని రోజులకు ఉన్న విద్యార్థులు కూడా రారనే ఉద్దేశంతో పాఠశాలను మూసివేశారు. ఇక్కడ 200 మందికి పైగా విద్యార్థులు చదువుకునేంతగా సౌకర్యాలు ఉన్నాయి. కొన్నేళ్ళ క్రితం కూడా 200 మంది విద్యార్థులు చదువుకునే వారని ఆ ప్రాంతవాసులు చెబుతున్నారు. ఇక్కడ అన్ని సౌకర్యాలున్నా చదువుకునేవారు లేక పాఠశాల మూతేశారు..

వర్షం వస్తే చాలా ఇబ్బంది

డి.సిరి, దేగాపురం పాఠశాల 5వ తరగతి



పాఠశాలకు ఒకటవ తరగతి నుంచి వస్తున్నాను. గత ఏడాది పాఠశాల భవనం ఎప్పుడు కూలిపోతుందా అన్న భయం ఉండేది. అది పడగొట్టేశాక ఇప్పుడు ఎప్పుడు వర్షం వస్తే అప్పుడు విద్యాబోధనకు ఇబ్బందిగా మారింది. నూతన పాఠశాల ఏర్పాటు చేస్తే చదువు సక్రమంగా సాగుతుంది.

భయపడుతూనే వస్తున్నాం

కె.సంధ్యారాణి,దేగాపురం పాఠశాల 4వ తరగతి



పాఠశాల భవనం లేనందున బడికి రావాలంటే భయంగానే ఉంది. ఇంటి దగ్గర తల్లిదండ్రులు కూడా తిడుతున్నారు. అయితే చదువుకోవడానికి వేరే దారి లేక పాఠశాల భవనం లేకపోయినా బయట కూర్చునే చదువుకుంటున్నాం. భవనం ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం : న్యూటన్, ఎంఈవో

దేగాపురంలోని పాఠశాల నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపించాం. త్వరలో నిధులు రానున్నాయి. నిధులు మంజూరైన తరువాత భవన నిర్మాణం చేపడతాం. ప్రస్తుతం చిన్న షెడ్డులో తరగతులు నిర్వహిస్తున్నాం.

ఇక్కడ పాఠశాలకు భవనమే లేదు..!

ఇది భీమవరం మండలం దేగాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల.. దీనికి భవనమే లేదు. ఆరుబయటే చదువులు.వర్షం వస్తే అంతే సంగతి..ప్రారంభమై రెండు నెలలు దాటుతున్నా విద్యార్థులకు మాత్రం ఆరుబయటే పాఠాలు. ఇక్కడ విద్యార్థులు 28 మంది చదువుతున్నారు. గతేడాది అయితే 23మందే ఉండేవారు. నూతన భవనం కోసం ఆరేళ్లుగా ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నారు. మూడేళ్ళ క్రితం నిధులు మంజూరైనప్పటికీ అప్పటి మండల ఇంజనీర్ పాఠశాల భవనం బాగుందని నివేదిక ఇవ్వడంతో వచ్చిన నిధులు వెనక్కు వెళ్ళాయి. అయితే పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో భవనం కూల్చి వేస్తే అదే ప్రదేశంలో నూతన భవనం నిర్మించేందుకు బాగుంటుందన్న భావంతో ఈ ఏడాది చివరిలో భవనాన్ని కూల్చివేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు భవన నిర్మాణం మాత్రం నిధులు లేక ఒక ఇంచైనా కదల్లేదు. పరిస్థితి ఇంతలా ఉన్నా విద్యార్థుల కోసమైనా పాఠశాల భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చెయ్యకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

- భీమవరం రూరల్



వర్షం వస్తే ఈ చిన్నషెడ్డులో తలదాచుకోవాలి..

ఇక్కడ గది ఒక్కటే..తరగతులు ఐదు..!

ఇది యలమంచిలి మండలం కాంభోట్లపాలెం ప్రాథమిక పాఠశాల.. ఇక్కడ విద్యార్థులకు తరగతి గదులు లేవు. పంచాయతీ భవనంలోని ఒకే ఒక ఇరుకుగదిలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు పాఠాలు చెబుతున్నారు. సుమారు 40 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యా యులు ఎడాపెడా బోధన చేస్తున్నారు. ఈ సామూహిక విద్యలో ఆ విద్యార్థులు ఏం వింటారో విద్యాశాఖ అధికారులకే తెలియాలి. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవన నిర్మాణానికి ఎస్ఎస్ఎ నిధులతో మొదలు పెట్టిన భవనం మధ్యలోనే నిర్మాణం నిలిచిపోయింది.గత సంవత్సరం నుంచి పంచాయతీ భవనాన్ని ఉపయోగిస్తున్నారు. అదికూడా ఏవిధమైన సౌకర్యాలు లేని ఒక చిన్నగది. ఇదే భవనంలో రెండు గదులు ఉండగా ఒక గదిలో పంచాయతీ కార్యాలయానికి, మరో గది పాఠశాలకు వినియోగిస్తున్నారు. ఈ భవనం కూడా శిథిలావస్థకు చేరింది. వర్షాకాలంలో వర్షంతో ఇబ్బందులు పడుతూ చిన్నగదిలోనే 1 నుంచి 5వ తరగతి వరకు విద్యాబోధన చేస్తున్నారు. విద్యార్థులకు కనీసం ఆటస్థలం, మరుగుదొడ్ల సదు పాయం అందుబాటులో లేవు.వర్షం వస్తే మధ్యాహ్న భోజనం కష్టమే..గత్యంతరం లేక ఇదే పాఠశాలలో చదివించుకుంటున్నామని ఈ దుస్థితిని చూసైనా భవనం వెంటనే పూర్తయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- యలమంచిలి

కాంభోట్లపాలెం ప్రాథమిక పాఠశాల



ఇరుకు గదిలో విద్యార్థులు



అసంపూర్తిగా నిలిచిన పాఠశాల భవనం

నూతన పాఠశాల భవనాన్ని పూర్తిచేయాలి

వాసంశెట్టి కేశవరావు, కాంభోట్లపాలెం



విద్యార్థులు, ఉపాధ్యాయులు భవన వసతి, క్రీడలకు స్థలం లేక ఇబ్బందులకు గురౌతున్నారు. కొత్త భవనం త్వరగా పూర్తిచేస్తే అన్ని మౌలిక వసతులు సమకూరుతాయి. అధికారులు దృష్టి సారించి భవనం పూర్తి అయ్యేటట్లు చూస్తే బాగుంటుంది.

అందరూ పేద విద్యార్థులే

బాతిరెడ్డి జార్జి, వైసీపీ నాయకుడు, చింతదిబ్బ



కాన్వెంట్‌ల్లో చదివించే స్థోమత లేకపోవడం వల్లే పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించుకుంటున్నారు. ఏడాది కాలం నుంచి భవనాన్ని అసంపూర్తిగా నిలిపివేయడం వల్ల విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. తక్షణం భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలి.

ఆదేశాలు వెంటనే జారీ చేస్తాం

అరుణకుమారి, ఎంఈవో



భవన నిర్మాణానికి సత్వరమే పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టరుకు ఆదేశాలు జారీచేస్తాం. విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు కల్పించి ఉన్నత శిఖరాలకు ఎదిగేలా కృషి చేస్తాం.

భళారే..భళా..!



చంద్రమతి పాత్రలో లలితాకుమారి



దుర్యోధనుడిపాత్రలో దుర్గారావు

తాడేపల్లిగూడెం బీవీఆర్ కళాకేంద్రంలో తాడేపల్లిగూడెం కళా పరిషత్ ఆధ్వర్యంలో పద్మశ్రీ రేలంగి, టీఆర్ త్యాగరాజుల స్మారక జాతీయస్థాయి ఏకపాత్రాభినయ పోటీలు సందడిగా సాగాయి..రాష్ట్రం నలు మూలల నుంచి కళాకారులు పాల్గొని తమ అభినయంతో ప్రేక్షకుల నుంచి కరతాళధ్వనులు అందుకున్నారు.



అర్జునుడిపాత్రలో అంజిరెడ్డి



హరిశ్చంద్ర పాత్రలో మురళీకృష్ణ



మోర్త పాత్రలో హరిరామయ్య

నేడు ఆహార సలహా సంఘ సమావేశం

పెనుమంత్ర: పెనుమంత్ర తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం 11 గంటలకు మండలస్థాయి ఆహార సలహా సంఘ సమావేశం నిర్వహిస్తామని తహసీల్దార్ పి. వెంకట్రావు తెలిపారు. కొవ్వూరు ఆర్డీవో అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో బహిరంగ మార్కెట్ ధరలు, ప్రజాపంపిణీ వ్యవస్థ ప్రాముఖ్యత, నిత్యావసర వస్తువుల లభ్యత కందిపప్పును సబ్సిడీ ధరలకు పంపిణీ చేయుట తదితర అంశాలపై సమీక్ష నిర్వహిస్తామని ఆయన తెలిపారు. మండలంలోని ఆహార సలహా సంఘం సభ్యులందరూ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

కాపులను బీసీల్లో చేర్చాలి



కొతాలపర్రులో కంచాలు వాయిస్తున్న కాపులు

కాపు సంఘం నాయకుల డిమాండ్

కోడేరు(ఆచంట): ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కాపులను బీసీల్లో చేర్చాలని, ముద్రగడ పాదయాత్రకు ప్రభుత్వం తక్షణం అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆదివారం మండలంలోని కాపు సంఘం నేతలు జలదీక్ష చేపట్టి తమ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు చినిమిల్లి వెంకట్రాయుడు మాట్లాడుతూ కాపులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, కాపుల పరిస్థితి చూసి బీసీల్లో చేర్చుతామని ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తరువాత కాపుల గురించి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాపులను బీసీల్లో చేర్చాలని ముద్రగడ శాంతియుతంగా పాదయాత్ర చేపడితే ప్రభుత్వం పాదయాత్రను అడ్డుకుని కాపులను అణగదొక్కేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ఎప్పుడూ రెండు పార్టీలకు చెందిన కులస్థులే అధికారం చేపట్టి పెత్తనాన్ని చెలాయిస్తున్నారన్నారు. రాష్ట్రంలో మెజార్టీగా ఉన్న కాపు కులస్థులను అన్ని రకాలుగా కిందికి తొక్కేయడానికి కొంత మంది నాయకులు కుట్రలు పన్నుతున్నారని చినిమిల్లి ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని మిగిలిన కులాలు వారు తమకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి రాబోయే రోజుల్లో తమ హక్కులు సాధించుకోవడానికి పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సుమారు రెండు గంటల సేపు నిర్వహించిన జలదీక్షలో కాపు సంఘ నేతలు ముచ్చర్ల శ్రీరామ్, వంగా నరసింహారావు, తోలేటి రాంబాబు, గణేసుల నాగేశ్వరరావు, జక్కంపూడి కుమార్, గణేసుల సత్తిబాబు, ఏడిద శ్రీనివాస్, బోణం మునసబు, గెద్దా ఆంజనేయులు, చల్లా శ్రీనివాస్, యర్రంశెట్టి వెంకటరత్నం, దిరిశాల మాచిరాజు, జవ్వాది పరమేష్, రామిశెట్టి రాములతోపాటు 500 మందికి పైగానే ఈ జల దీక్షలో పాల్గొన్నారు.

పెనుమంచిలిలో వంటా వార్పు

పెనుమంచిలి(ఆచంట): కాపులను బీసీల్లో చేర్చాలని, ముద్రగడ పాదయాత్రకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆదివారం మండలంలోని పెనుమంచిలిలో వంటా వార్పు కార్యక్రమాన్ని చేపట్టి కాపులు తమ నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలోని రోడ్డు మీదే వంటా వార్పు చేసి భోజనాలు చేశారు.



జలదీక్షలో పాల్గొన్న కాపు నాయకులు

కార్యక్రమంలో జిల్లా కాపు సంఘం నేతలతోపాటు పెద్ద సంఖ్యలో మహిళలు, చిన్నారులతోపాటు సుమారు వెయ్యి మంది కార్యకర్తలు పాల్గొని తమ నిరసన వ్యక్తం చేశారు.

కాపుల ఆకలి కేకలు ప్రభుత్వానికి వినిపించాలి

పెనుగొండ: కాపుల ఆకలి కేకలు ప్రభుత్వానికి వినిపించే వరకు నిరసన తెలియజేస్తూనే ఉండాలని జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు చినిమిల్లి వెంకట్రాయుడు అన్నారు. కాపుల రిజర్వేషన్‌ల కోసం పోరాడుతున్న ఉద్యమనేత ముద్రగడ పద్మనాభంకు మద్దతుగా కొతాలపర్రులో కాపు యువకులు కంచాలతో డప్పు వాయిస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వంటా వార్పు నిర్వహించారు ముద్రగడ కాపుల రిజర్వేషన్‌లు కోసం మడమ తిప్పకుండా పోరాడుతున్నారని, కాపులంతా ముద్రగడకు బాసటగా నిలవాల్సిన సమయం ఆసన్నమైందని నాయకులు అన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారమే ఇతరులకు నష్టం వాటిల్లకుండా రిజర్వేషన్‌లు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కాకిలేటి బాపిరాజు, ఆకుల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ వాయిస్



ఎన్ని డిగ్రీలు చేసినా ఉద్యోగాలు దొరకడం కష్టం

ఎస్‌వీఎన్ శర్మ, విద్యార్థి సంఘ నాయకుడు, ఆచంట

నిరుద్యోగ సమస్య ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న యువకులందరిని తీవ్రంగా వేధిస్తోంది. మన భారతదేశంలో స్వచ్ఛంద సంస్థల సర్వే ప్రకారం దేశ వ్యాప్తంగా 15 కోట్లకుపైగా యువత నిరుద్యోగ సమస్యతో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రస్తుతం ఎన్ని డిగ్రీలు చేసినా ఉద్యోగాలు దొరకడం కష్టంగా ఉంది. ఉద్యోగం కోసమే చదువు అని కాకుండా సమాజ అభ్యున్నతికి ఉపయోగపడే విద్యను ప్రభుత్వం ప్రవేశపెట్టాలి. యువత ఉద్యోగ కల్పన కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై వత్తిడి తీసుకురావాలి.

● ఆచంట



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

వీరన్న ఛారిటబుల్ సేవలు అభినందనీయం

పెనుగొండ: పేదలకు వాసంశెట్టి వీరన్న ఛారిటబుల్ ట్రస్టు ద్వారా అందిస్తున్న వైద్య సేవలు ప్రశంసనీయమని ఎస్‌వీకేపీ అండ్ డాక్టర్ కెఎస్ రాజు కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్, ప్రముఖ వైద్యుడు డాక్టర్ కె.రామచంద్రరాజు అన్నారు. ఆదివారం వాసంశెట్టి వీరన్న చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విజయవాడ నాగార్జున హాస్పిటల్ సౌజన్యంతో రోటరీ క్లబ్, పీఎంపీ అసోసియేషన్ సహకారంతో ఉచిత కేన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 55 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా వీరిలో ఇద్దరికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. వారికి విజయవాడలో ఉచితంగా శస్త్రచికిత్స చేస్తామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు వాసంశెట్టి చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వివాదస్పదంగా విగ్రహాల ఏర్పాటు

పెనుగొండ: పెనుగొండ గాంధీ బొమ్మల సెంటర్‌లో జాతీయ నేత బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వెలిసింది. ఈ నెల 14న అర్ధరాత్రి భగత్‌సింగ్ విగ్రహాన్ని, 15 అర్ధరాత్రి భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో గుర్తు తెలియని వ్యక్తులు జాతీయ నాయకులు విగ్రహాలు ఏర్పాటు చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఇటువంటి తరుణంలో ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు ఎటువంటి విగ్రహాలు పెట్టనివ్వకుండా రాత్రి వేళల్లో రెవెన్యూ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఆదివారం సాయంత్రం సమయంలో కొందరు వ్యక్తులు గాంధీ బొమ్మల సెంటర్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి వెళ్లిపోయారు. దీంతో పరిసర ప్రాంతాలకు చెందిన వారంతా ఒక్కసారిగా గాంధీ బొమ్మల సెంటర్‌కు చేరుకుని గుమిగూడిపోయారు. సమాచారం తెలియడంతో పెనుగొండ ఇన్‌చార్జి సీఐ జి. సత్యనారాయణ సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి వెళ్లారు. ఈ సంఘటనతో గాంధీ బొమ్మల సెంటర్‌లో పోలీసులు విస్తృతంగా గస్తీ నిర్వహిస్తున్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో విద్వేషాలు రెచ్చగొట్టడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని అనుమానాలు పోలీసులు వ్యక్తం చేస్తున్నారు.



పెనుగొండలో ఆదివారం ఏర్పాటు చేసిన జగ్జీవన్‌రామ్ ప్రతిమ



బియ్యం పంపిణీ చేస్తున్న నన్నేటి పుష్పరాజు

అగ్ని ప్రమాద బాధితులకు బియ్యం పంపిణీ

పోడూరు : పండితవిల్లూరులో శనివారం సంభవించిన అగ్ని ప్రమాదంలో తాటాకిళ్లు దగ్ధమై నిరాశ్రయులైన కుటుంబాలను మాల మహానాడు జిల్లా సమన్వయకర్త నన్నేటి పుష్పరాజు ఆదివారం పరామర్శించి బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పుష్పరాజ్ మాట్లాడుతూ బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట మాలమహానాడు ఆచంట మండల అధ్యక్షుడు రావి నాగరాజు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సరెళ్ల శ్రీనివాస్, పోడూరు మండల నాయకులు సదమళ్ల రవి, చిలకపాటి నవీన్, దిగుపాటి నవిన్ తదితరులు పాల్గొన్నారు.

'అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

పోడూరు : గ్రామాల్లో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసే వరకు సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఉద్యమించాలని పార్టీ జిల్లా సెక్రటేరియట్ కార్యవర్గ సభ్యుడు కేతా గోపాలన్ కోరారు. పోడూరులో ఆదివారం నిర్వహించిన సీపీఎం మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సొంత ఇళ్ళు లేక వేలాది మంది నిరుపేదలు అద్దె ఇళ్ళు, కాలువలు, రోడ్ల పక్కన చిన్న చిన్న గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని, దీంతో ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన పోడూరులో సొంత ఇళ్ళు లేక పేదలు అద్దె ఇళ్ళల్లో, ఇరుకు గదుల్లో నివాసం ఉంటూ నరకం చూస్తున్నారన్నారు. సమావేశానికి సీపీఎం సీనియర్ నాయకుడు కేతా సూర్యరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి పిల్లి ప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని కొన్ని గ్రామాల్లో లబ్ధిదారులకు ఇళ్ళ స్థలాల పట్టాలు ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా ఇంత వరకు స్థలాలు స్వాధీనం చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. ఇళ్ళ స్థలాల పట్టాలు ఇచ్చిన లబ్ధిదారులకు స్థలాలను స్వాధీన పరచి రుణాలు మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం నాయకులు కొప్పర్తి నర్శింహమూర్తి, బూరాబత్తుల వెంకట్రావు, బొంతు శ్రీను, మూడే మోజేష్ తదితరులు మాట్లాడారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న సీపీఎం జిల్లా సెక్రటేరియట్ కార్యవర్గ సభ్యుడు కేతా గోపాలన్

నేడు బీసీ ప్రజా సంక్షేమ సమావేశం

పెనుమంత్ర: బీసీ ప్రజా సంక్షేమ సంఘం మండల స్థాయి సమావేశం మార్టేరులో మావుళ్లమ్మ గుడి ఆవరణలో సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహిస్తామని బీసీ ప్రజా సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అల్లాడ భాస్కర్ తెలిపారు.



మొక్కలు నాటుతున్న పితాని తనయుడు వెంకట్

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ఆచంట : పర్యావరణాన్ని రక్షించుకోవడం కోసం ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని మంత్రి పితాని సత్యనారాయణ తనయుడు పితాని వెంకట్ అన్నారు. వనం-మనం కార్యక్రమంలో భాగంగా ఆదివారం పెదమల్లంలో పితాని వెంకట్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరాస్వామి, ఎంపీటీసీ ముప్పర్తి సత్యనారాయణ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు, సిర్రా చిట్టిబాబు, ఉపసర్పంచ్ దిరిశాల మాచిరాజు, వెంకటేశ్వరరావు, దిరిశాల వెంకటరాజు, ఏఎంసీ డైరెక్టర్ గుణ్ణం శ్రీను తదితరులు పాల్గొన్నారు.





ఆర్టీసీ సమాచారం..

హైదరాబాద్ వెళ్ళే సర్వీసులు :
రాత్రి 8గంటలకు బీహెచ్‌ఈఎల్ వయా కలిదిండి, రాత్రి గం.8.30ని.లకు బీహెచ్‌ఈఎల్ వయా కైకలూరు, 9గంటలకు బీహెచ్‌ఈఎల్ వయా కలిదిండి), గం.9.30ని.లకు బీహెచ్‌ఈఎల్ వయా కలిదిండి, రాత్రి గం.8.15ని.లకు బీహెచ్‌ఈఎల్ (గరుడ, ఏపీ), జీడిమెట్ల రాత్రి గం.8.15ని.లకు, ఈసీఐఎల్, రాత్రి 9గంటలకు..

విజయవాడ : ప్రతీ 20నిమిషాలకు బస్ సర్వీస్ కలదు.
విశాఖపట్టణం : ఉదయం గం.6.30ని.లకు, ఉదయం గం.7.30ని.లకు, రాత్రి గం.8.45ని.లకు, గం.9.10ని.లకు, గం.10.10ని.లకు, గం.10.40ని.లకు. సాయంత్రం గం.5.45ని.లకు బత్తిలి(వయా విశాఖపట్టణం).
తిరుపతి : ఇంద్ర ఏసీ సాయంత్రం 6గంటలకు. ఉదయం గం.10.30ని.లకు.
ప్రతీ ఆదివారం తెల్లవారుజామున 5గంటలకు తూర్పు గోదావరి జిల్లా **'వెల్ల'**కు బస్సు ఉంది. ప్రతీ శనివారం ఉదయం గం.4.30ని.లకు ద్వారకాతిరుమలకు బస్సు ఉంది. డిపో మేనేజర్ గిరిధర్ కుమార్ సెల్ నెం : 9959225485, ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ఎంక్వైరీ 08816239100, రిజర్వేషన్ కౌంటర్ నెంబరు 9666089036.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న కోమటితిప్ప నార్త్ గ్రామ సర్పంచ్

గ్రామ సరిహద్దులు నిర్ణయించాలంటూ ఎమ్మెల్యేకి వినతిపత్రం

భీమవరం రూరల్ : కోమటితిప్ప నార్త్ గ్రామం సరిహద్దుల నిర్ణయం, నూతన పంచాయతీ భవనం నిర్మాణ మార్పులపై గ్రామ సర్పంచ్, గ్రామస్తులు ఆదివారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులకి వినతిపత్రం అందించారు. తొమ్మిది రోజులుగా గ్రామం సరిహద్దులు, పంచాయతీ భవనం గురించి రిలే నిరాహార దీక్షలు చేస్తున్నామని, మాగోడు పట్టించుకోవాలంటూ ఎమ్మెల్యేకు గ్రామసర్పంచ్ నాగిడి ధర్మరాజు విన్నవించారు. నూతనంగా నిర్మాణం జరుగుతున్న పంచాయతీ భవనం జనావాసాలు లేని చోట జరుగుతుందని, అలా కాకుండా జనని వాసాలు ఉన్నచోట పంచాయతీ భవనాన్ని నిర్మిస్తే గ్రామస్తులకు ఉపయోగపడుతుందని తెలిపారు. పంచాయతీ భవనం లేక ఎన్నో సంవత్సరాలు ఇబ్బందులు పడ్డామని,నిధులు మంజూరై వచ్చిన పంచాయతీ భవనం ఉపయోగకరం లేనిచోట నిర్మించడం వల్ల గ్రామస్తులకే ఇబ్బంది అని సమస్యను పరిష్కరించాలని కోరారు.

మద్యం ఉద్యమాల్లో 'రాజకీయం'



సొంతపార్టీల నుంచే వ్యాపారులకు వేధింపులు

డిపాజిట్లు చెల్లించి ఐదు నెలలు అవుతున్నా ఇంకా తెరుచుకోని 30 షాపులు..9 బార్‌లు.

మద్యం ధరలు 5 నుంచి 10 శాతం పెంచినా కమీషన్ కోతతో పడిపోయిన ఆదాయం

భీమవరం :
రాష్ట్ర ప్రభుత్వం కొత్త మద్యం పాలసీలో నియామవళి కారణంగా మద్యం వ్యాపారులు ఇప్పటికీ ఇంకా జిల్లాలో కొన్నిచోట్ల దుకాణాలను తెరవలేకపోయారు. బార్‌లు కూడా అదే పరిస్థితిలో ఉన్నాయి. జిల్లాలో మద్యం షాపులు, బార్‌లు దక్కించుకున్న వారిలో అధికార తెలుగుదేశం, వైసీపీ, బీజేపీ పార్టీలకు చెందిన వారు ఉన్నారు. జాతీయ రహదారులకు 500 మీటర్లు దాటి ఉండాలన్న నిబంధనతో గత రెండు నెలలుగా మద్యం వ్యాపారం ఒడుదుడుకుల్లో నడుస్తోంది. ఈసారి మద్యం షాపులు జాతీయ రహదారికి దూరంగా వెళ్ళడం వల్ల కొన్ని ప్రాంతాల్లో స్థానిక ప్రజలు వీటి ఏర్పాటును వ్యతిరేకిస్తున్నారు. జిల్లాలో 182 మద్యం షాపులకు వ్యతిరేకంగా అనేక మంది స్థానికులు ఆందోళనలు చేస్తూ వచ్చారు. వారిని బతిమాలుకునో, కొందరికి వేరే ఆశ చూపించో మొత్తానికి వ్యాపారులుదుకాణాలు తెరుచుకుంటూ వచ్చారు. వీరి వెనుక ఇదే వ్యాపారంలో ఉన్న ఆయా పార్టీలకు చెందిన కేడరో, ప్రజాప్రతినిధులో ఉండటం గమనార్హం.వీరు నాయకత్వం వహిస్తూ తమ ప్రాంతంలో షాపు తెరవొద్దంటూ ఆందోళనకు తెర తీయడం గమనార్హం. తెలుగుదేశం పార్టీకి చెందిన వారి దుకా ణం పెడితే వైసీపీ, వైసీపీ వారికి సంబంధించి దుకాణం ఉంటే అక్కడ టీడీపీ వారు అలాగే బీజేపీకి సంబంధించిన వారు ఉంటే ఏదో ఒక పార్టీ వారు ఆందోళనం చేయడం జరుగుతోంది.ఇలా రెండు నెలల నుంచి ఆందోళనలు నడుస్తున్నాయి.

జిల్లాలో అనుమతి లభించక ఇంకా 30 షాపులు తెరుచుకోలేదు. 47 బార్‌లు మంజూరు కాగా 9 బార్లు ఇంకా తెరుచుకోలేదు. ఈ ఏడాది మార్చి నెలలో ఒక్కొక్క వ్యాపారి మద్యం దుకాణం కోసం రూ.16 లక్షలు చెల్లించారు. మొదటి మూడు నెలలు ఆ డిపాజిట్ సొమ్ము ప్రభుత్వం దగ్గర ఉండిపోయినా వ్యాపారానికి మాత్రం అవకాశం లభించలేదు. తీరా జూలై నుంచి వ్యాపారాలు తెరిచే సరికి ఇలా రాజకీయ ఉద్యమాలు మొదలయ్యాయి. జాతీయ రహదారులకు దూరంగా తెరవాలని ఆదేశాలు ఉండటంతో ప్రధానంగా గ్రామీణ ప్రాంతంగా ఉన్న జిల్లాలోని 165 జాతీయ రహదారి ఆకివీడు నుంచి ఉండి, భీమవరం, వీరవాసరం, పాలకొల్లు, చించినాడ వరకు ఉంది. దీంతో ముఖ్యంగా ఉండి, భీమవరం, పాలకొల్లు అసెంబ్లీల్లో జాతీయ రహదారిలో ఉన్న వ్యాపారులందరూ ఇబ్బందులు పడ్డారు. తీర ప్రాంతంలో దిగమర్రు నుంచి లోసరి వరకు 316ఏ జాతీయ రహదారి ఉండటంతో నరసాపురం, భీమవరం అసెంబ్లీ నియోజకవర్గాల్లోని తీర గ్రామాల్లో ఉన్న మద్యం వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా దూరంగా వెళ్ళాల్సి వచ్చింది.

భీమవరంలో మద్యం రాజకీయం

మద్యం వ్యాపారంలో భీమవరం రాజకీయం కాస్త వేడెక్కింది. భీమవరం శాసనసభ్యుడికి, మాజీ ఎమ్మెల్యేకు మద్యం వ్యాపారం లేదు. అయితే అందులో వారివారి పార్టీలకు ంబంధించిన వారు ఉన్నారు. కొంతమంది వ్యాపారులు, మధ్యవర్తులు వీరి పేర్లను కూడా వినియోగించేసుకుంటున్నారు. కొంతమంది దళారులైతే వ్యాపారులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే రామాంజనేయులు ఎక్సైజ్ అధికారులను పిలిపించి ఎవరైనా తన పేరు వాడుకుంటే సీరియస్‌గా తీసుకోవాలని, అవసరమైతే వారి లైసెన్స్‌లు రద్దు చేయాలంటూ హెచ్చరించారు. ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు ఒకరు ఈ విషయంలో కొందరు మధ్యవర్తులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇక్కడ కూడా ఆ పార్టీకి చెందిన వ్యాపారస్తులకు వ్యతిరేకంగా ఈ పార్టీ వారు, ఈ పార్టీకి చెందిన వారికి వ్యతిరేకంగా ఆ పార్టీ వారు కూడా వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇలా ఉంటే భీమవరంలో ఇంకా మూడు బార్‌లు తెరుచుకోవలసి ఉంది. ఆరు మద్యం షాపులు తెరవాలి. వీరికి స్థలాలు లేక భారీగా ఆదాయం కోల్పోయామని వాపోయారు.

తగ్గిన ఆదాయంతో ఆందోళన

మరోవైపు గతంలో ఉన్న కమిషన్ భారీగా తగ్గిపోయింది. 5 నుంచి 10 శాతం వరకు కొత్త పాలసీలో మద్యం ధరలు పెరిగాయి. అయితే వీటి విక్రయాలపై ఉన్న కమిషన్‌ను మాత్రం గణనీయంగా కోత వేశారు. ఒక క్వార్టర్ మద్యం అమ్మితే సుమారు రూ.15 వరకు గతంలో మిగిలేదని, ఇపుడు అది కాస్త రూపాయిన్నర నుంచి రూ.5వరకు తగ్గిపోయిందని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో వాటర్ ప్యాకెట్లు, మంచినీళ్ళ వ్యాపారం నయం అంటూ వాపోతున్నారు. డిపాజిట్లు తగ్గించినా ఇలా మిగులులో కోత పడిపోవడం వల్ల ఈసారి కొత్త మద్యం పాలసీ వ్యాపారులకు వచ్చే ఆదాయాన్ని గణనీయంగా దెబ్బతీసిందని చెబుతున్నారు



అమ్మవారికి సారె అందిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

కన్యాకాపరమేశ్వరికి శ్రావణమాస సారె

భీమవరం టౌన్ : శ్రావణ మాసం సందర్భంగా త్యాగరాజ భవనంలో ఉన్న కన్యాకాపరమేశ్వరీ అమ్మవారికి గునుపూడి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రావణమాస సారె అందజేశారు. సంఘ సభ్యులు అమ్మవారికి చీర, పసుపు,కుంకుమ, గాజులు, చలిమిడి,పలు రకాల స్వీట్లు, పండ్లతో సారె అందజేశారు. ఆలయ అర్చకులు పూజలు చేసి అమ్మవారికి సారెను సమర్పించారు. ఈకార్యక్రమంలో సంఘ అద్యక్షుడు పూసరపు కోదండ రామకృష్ణ ప్రసాద్, సంఘ సభ్యులు, కంచర్ల సాయిబాబా, మావుళ్ళమ్మ దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మన్ కార్మూరి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు. మహిళలు పారాయణ చేశారు.



స్వామివారికి,అమ్మవారికి కల్యాణం చేస్తున్న దృశ్యం

ఘనంగా మాస శివరాత్రి పూజలు

భీమవరం టౌన్ : మాస శివరాత్రి సందర్భంగా పంచారామ క్షేత్రమైన గునుపూడిలోని సోమేశ్వర స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. తెల్లవారు జామున ఆలయ అర్చకులు కందుకూరి సోంబాబు, చెరుకూరి రామకృష్ణ ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు అభిషేకాలు చేయించుకున్నారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకారం చేశారు. ఇందులో భాగంగా స్వామివారికి, అమ్మవారికి బృందావనం శ్రీనివాస్ దంపతులు కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ వేగేశ్న రంగరాజు, ఈవో కేశవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా అన్నసమారాధన

భీమవరం టౌన్ : శ్రీకృష్ణాష్టమి ఉత్సవాల ముగింపు సందర్భంగా మార్వాడీ సందులో బులియన్ ధర్మకాట సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు విజ్జురోతి వెంకటరమణ మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుంచి ఈ వేడుకలను నిర్వహిస్తున్నామని, సమారాధనను సంఘ సభ్యులు, బంగారు వర్తకుల సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు.యక్కల శ్రీనివాస్, శ్రీనివాసరావు, శ్రీను, సంజయ్ శేర్, విట్టూశేర్, ఉమామహేశ్వరరావు, నారాయణరావు, నాగేశ్వరరావు, అల్లు శ్రీనివాస్, నాయుడు, పైలా సత్యనారాయణ, మీసాల రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మావుళ్ళమ్మ జాతర

భీమవరం టౌన్ : మావుళ్ళమ్మ జాతర ఆదివారం రెస్ట్‌హౌస్ రోడ్డులోని శ్రీవినాయక గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రెండు రోజులుగా అమ్మవారి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. ఆసాదుల నృత్యాలు, భేతాళ వేషాలు, తీన్ మార్ డప్పులు, బుట్టబొమ్మలతో ఆప్రాంతంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేకంగా అలంకరించిన హంసవాహనంపై అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించగా భక్తులు పూజలు చేసుకున్నారు. కళాజాతాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పడమటి రామకృష్ణ, మేకా సూర్యనారాయణ, పడమటి సోమేశ్వరరావు, ఏకుల దానాయ్య, మేకా దుర్గా ప్రసాద్, జోగి నాగ శ్రీను, అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జాతరలో భేతాళ వేషాలు



మావుళ్ళమ్మకు బంగారం విరాళం

భీమవరం టౌన్ :మావుళ్ళమ్మకి ఆధివారం పట్టణానికి చెందిన పురుషోత్తంరాజు, ఉషారాణి దంపతులు నాలుగు గ్రాముల బంగారం అందించారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేయించున్న దాతలకు అర్చకులు పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు అడ్డగర్ల ప్రభాకరగాంధీ, దేవరపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

1,2 తేదీల్లో ఎస్ఎఫ్ఐ శిక్షణ తరగతులు

భీమవరం ఎడ్యుకేషన్ : వచ్చే నెల 1,2 తేదీల్లో భీమవరం పట్టణంలో జరగనున్న భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లాస్థాయి విద్యావైజ్ఞానిక శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.శివరాజు కోరారు.ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శివరాజు మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా తీసుకువస్తున్న సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ఇండిపెండెంట్ స్కూల్స్ బిల్లుని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ బిల్లు అమలైతే ఇప్పటికే రాష్ట్రంలో కొనసాగుతున్న విద్యావ్యాపారం ఇంకా కొనసాగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. శిక్షణ తరగతులకు రాష్ట్ర అధ్యక్షుడు రాము ముఖ్యఅతిథిగా వస్తారన్నారు. డివిజన్ అధ్యక్షులు హేమంత్, కార్యదర్శి మణికంఠ, కార్తీక్, డేవిడ్, రాజ్‌కుమార్, చిరంజీవి ఉన్నారు.

స్టూడెంట్ వాయిస్



పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహమివ్వాలి

బాలం గణేష్ ,విద్యార్థి , భీమవరం

నిరుద్యోగులకు ప్రభుత్వం ప్రకటించిన నిరుద్యోగ భృతిని కల్పిస్తే పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవడానికి అవకాశం ఉంటుంది. విద్య ఉపాధిని కల్పించేదిగా ఉండాలి. నేటి విద్యార్థులకు సాంకేతిక శిక్షణను అందిస్తూ వారిలో నైపుణ్యాలను వెలికితీసేలా ఉండాలి. ఉపాధి కల్పించే విధంగా వృత్తి విద్యా కోర్సులు ఉండాలి. నవ్యాంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల స్థాపన పెరిగితే యువతకు ఉపాధి లభిస్తుంది. డిగ్రీలు, ఇంజనీరింగ్ చేసిన వేలాది మంది యువత నిరుద్యోగులుగా ఉంటున్నారు. ప్రభుత్వం వారికి ఉపాధి కల్పించే విధంగా పరిశ్రమలను ఎక్కువ స్థాపించాలి. అలాగే పరిశ్రమలను స్థాపించే విధంగా యువతకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి. పరిశ్రమలు అవసరాలను తగిన వృత్తి విద్యా కోర్సులను ఎప్పటిక ప్పుడు ఆధునీకరించడం ద్వారా నిరుద్యోగ సమస్య అరికట్టవచ్చు.

● భీమవరం రూరల్

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

భీమవరం :	99854 11550
,, రూరల్ :	94414 48581
,, టౌన్ :	94406 25154
,, క్రైం :	98665 93356
,, అర్బన్ :	99481 40404
వీరవాసరం :	98667 41833

సినిమా గైడ్ :

వీరవాసరం :
వీరహనుమాన్ లై
రామకృష్ణ (కొణితివాడ) జయజానకీ నాయక


మత్స్యపురిలో రహదారి వెంబడి వర్షపు నీరు


బొబ్బనపల్లిలో ..


రాయకుదురు లో సీసీ రహదారి పై నిలిచిన నీరు

వర్షం వస్తే రహదారులపైనే నీరు..

గ్రామాలలో కచ్చా డ్రెయిన్‌ల జాడేదీ... నీరు వెళ్లే మార్గమే లేదు

వీరవాసరం : వర్షం కురిస్తే రహదారులు కాలువలుగా మారుతున్నాయి. నీరు వెళ్ళేమార్గం లేక ఎక్కడికక్కడ నిలిచిపోతున్నది. వర్షాకాలం వస్తుందంటే గ్రామాల్లో మురుగునీరు వెళ్ళటానికి కచ్చాడ్రెయిన్లు ఏర్పాటు చేసి నీరు వెళ్ళేందుకు చర్యలు తీసుకుంటారు. అటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రధాన రహదారులు వెంబడి వర్షపునీరు నిలిచి వాహన దారులకు ఇబ్బందులు సృష్టిస్తున్నాయి. ప్రతీయేటా గ్రామపంచాయతీలు రహదారుల వెంబడి వర్షాకాలంలో నీరు వెళ్ళటానికి డ్రెయిన్లు తవ్వేందుకు నిధులు కేటాయిస్తుంటాయి. ప్రస్తుతం నిధులు కేటాయింపునకు సంబంధించి పంచాయతీలు కూడా ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని తెలుస్తుంది. మరోపక్క రహదారుల భవనాలశాఖ సైతం రహదారులు వెంబడి కచ్చాడ్రెయిన్లు తవ్వకం పోవడంతో నీరు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నది.


సమావేశంలో మాట్లాడుతున్న స్టేట్‌బ్యాంకు టెంపరరీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

ఎస్‌బీఐ తాత్కాలిక సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

భీమవరం అర్బన్ : భారతీయ స్టేట్ బ్యాంకు టెంపరరీ ఎంప్లాయిస్‌కు 1983 నుంచి 1997 వరకు టెంపరరీగా పని చేయించుకున్న బ్యాంకు యాజమాన్యం ఇంతవరకు పర్మినెంట్ చెయ్యకపోవడం దారుణమని డివిజన్ కార్యదర్శి బి.వాసుదేవరావు అన్నారు. ఆదివారం సీఐటీయు కార్యాలయంలో భారతీయ స్టేట్ బ్యాంకు టెంపరరీ ఎంప్లాయిస్ సంఘం సమావేశం నిర్వహించారు.వాసుదేవరావు మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి ఉద్యోగులను పర్మినెంట్ చేయకుండా కాలయాపన చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును కూడా అమలు జరపకుండా ఔట్‌సోర్సింగ్ విధానంలో మెసెంజర్స్ ఉద్యోగాలు కొనసాగిస్తున్నారన్నారు. స్టేట్ టెంపరరీ ఎంప్లాయిస్ సంఘం అధ్యక్షుడు రాంబాబు మాట్లాడుతూ హైకోర్టు జస్టిస్ సోమశేఖర్ ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.జి.విజయదైనాథ్, ఎస్.వెంకటేశ్వరరావు, రత్నంరాజు, ఎన్‌వీ శేఖర్, ఏ.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వానలతో అప్రమత్తం..

మారిన వాతావరణంపై ఆక్వా, వరిరైతుల దృష్టి

భీమవరం :జోరువానలతో రైతులు అప్రమత్తమయ్యారు. ముఖ్యంగా ఆక్వారంగంతో పాటు వరి రైతులు కూడా మారిన పరిస్థితులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. అవసరమైన సస్యరక్షణ చర్యలకు ఉపక్రమించారు. మూడు రోజులుగా వాతావరణం చల్లబడి వర్షాలు కురుస్తున్నాయి. జోరువానలు కురవడంతో ఉష్ణోగ్రత తగ్గుముఖం పట్టింది. 22 డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గుముఖం పట్టకుండా ఆక్వారైతులు చర్యలు చేపట్టారు. ఆక్సిజన్ లోపంతో ఇబ్బంది పడకుండా ఏరియేటర్లను నిరంతరాయంగా తిప్పుతున్నారు. మరోవైపు ప్రొబయోటిక్స్ వాడకం ద్వారా రొయ్యలు, చేపలు ఉక్కిరిబిక్కిరి కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. అవసరం మేరకు అదనపు పెట్టుబడులు పెడుతున్నారు. ప్రస్తుతం వరిపంట కూడా మొన తిరగడంతో అందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. దోమలు, ఎలుక కొట్టుడం, ఇతర చీడ,పీడలు వంటివి దరి చేరకుండా మారిన వాతావరణానికి అనుకూలంగా సస్యరక్షణ చేపడుతున్నారు.



జంక్షన్ రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న దృశ్యం

రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛభారత్

భీమవరం అర్బన్ : భారత రైల్వేశాఖ రైల్వేస్వచ్ఛ పక్వాడ్ పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం భీమవరం జంక్షన్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో జంక్షన్ రైల్వేస్టేషన్, ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ సలహా సంఘ సభ్యులు చెరుకువాడ రంగసాయి ఆధ్వర్యంలో ప్రయాణికులతో స్టేషన్ పరిశుభ్రత చేసి ప్రయాణికులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జంక్షన్ రైల్వేస్టేషన్ మేనేజర్ సత్తిబాబు తెలిపారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రైల్వే డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్ కుసుమేశ్వరరావు(విజయవాడ) కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ప్రధాని మోదీ పిలుపు మేరకు రైల్వేస్టేషన్లో స్వచ్ఛంద సంస్థలు, ప్రయాణికులు, సంఘసేవకులతో స్వచ్ఛభారత్ కార్యక్రమాలను నిర్వహిస్తుండటం అభినందించదగ్గ విషయమన్నారు. రైల్వేబోగీలు, రైల్వేస్టేషన్లను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతిఒక్కరూ స్వచ్ఛభారత్ స్ఫూర్తితో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పిలుపునిచ్చారు. స్టేషన్ మేనేజర్ సత్తిబాబు మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ వరకు ప్రతీ రైల్వేస్టేషన్‌లోనూ పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. స్టేషన్ బయట ప్రాంగణం, స్టేషన్, రైల్వే బోగీలలో చీపుర్లతో ప్రయాణికులతో కలిసి శుభ్రం చేశారు. రైల్వే అధికారులు ఎస్ఈ వర్క్స్ రవి, కిషోర్, హెచ్ఐ టి శ్రీనివాసరావు, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ కోటేశ్వరరావు, పట్టణ బీసీ సెల్ అధ్యక్ష, కార్యదర్శులు గంటా త్రిమూర్తులు, శేషు, యలమంచిలి శ్రీనివాసు, రంగినేని శ్రీనివాసరాజులు ఉన్నారు.

తపాలాశాఖ గ్రామీణ ఉద్యోగుల సమ్మె

ఖాతాదారులకు ప్రత్యేక ఏర్పాట్లు

భీమవరం : తపాలా శాఖలో ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ ఉద్యోగులు ఈనెల 16 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నందున ఖాతాదారులు, వినియోగదారులకు సంబంధించిన పోస్టల్ లావాదేవీలకు అవరోధం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టినట్లు భీమవరం తపాలా శాఖ సీనియర్ సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. సేవింగ్స్ ఖాతా, రికరింగ్ డిపాజిట్లను సమీపంలోని కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ సౌకర్యం ఉన్న అన్ని సబ్‌పోస్టాఫీస్‌ల్లో వినియోగించుకోవచ్చునన్నారు. వినియోగదారులకు సంబంధించి అకౌంటబుల్ ఆర్టికల్స్ (రిజిస్టర్డ్ లెటర్స్, పార్శిల్స్ వంటివి, మనియార్డర్లు) బట్వాడా తీసుకోవడానికి సమీపంలో గల పోస్టాఫీస్‌కు వెళ్ళి గుర్తింపుకార్డులు చూపిస్తే బట్వాడా తీసుకునే అవకాశం కల్పించామని తెలియచేశారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం అర్బన్ : వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2017 విద్యా సంవత్సరానికి వసుధ మెరిట్ స్కాలర్‌షిప్‌లు మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ కోర్సులు చదువుతున్న విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్పులకు దరఖాస్తు చేసుకోవచ్చునని, ఇంటర్, పదవ తరగతి పరీక్షల్లో 80 శాతం మార్కులు తెచ్చుకున్న వారు ఈ మెరిట్ స్కాలర్‌షిప్‌కు అర్హులన్నారు. అలాగే ఎంసెట్‌లో 50వేల లోపు ర్యాంకు పొందిన వారు కూడా అర్హులని తెలిపారు.ఏలూరు, భీమవరం, గరగపర్రు, జంగారెడ్డిగూడెం, కొవ్వూరు, తణుకు, పాలకొల్లు ప్రాంతీయ కార్యాలయాల నుండి దరఖాస్తులు పొంది ఈ నెల 31వ తేదీ లోపు పూర్తిచేసిన దరఖాస్తులు అందచేయాలని సంస్థ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజు తెలిపారు.


అనంతపురంలో అవార్డు అందుకుంటున్న వేల్పుల నాగేశ్వరరావు

రచయిత వేల్పుల నాగేశ్వరరావుకి జెన్ని సాహిత్య పురస్కారం

భీమవరం అర్బన్ : భీమవరం పట్టణానికి చెందిన ప్రముఖ నాటక రచయిత, ఏఆర్‌కెఆర్ మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయుడు వేల్పుల నాగేశ్వరరావు జెన్ని సాహిత్య పురస్కారం అందుకున్నారు. నాటక రంగంలో చేస్తున్న విశేష కృషికి శనివారం అనంతపురంలో జాతీయస్థాయిలో జెన్ని సాహిత్య అకాడమీ వారు 2017 సంవత్సరానికి ఈ పురస్కారం అందించారు. కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాచపాళెం చంద్రశేఖరరెడ్డి చేతుల మీదుగా డాక్టర్ జెన్ని ఆనందకుమార్ సాహితీ సంస్థ వారు అందజేశారు. తెలుగు నాటక, సాహిత్య రంగాలలో విశేష కృషిచేసిన వారికి ఈ పురస్కారాలు అందించినట్లు నాగేశ్వరరావు తెలిపారు. నాగేశ్వరరావుకు అవార్డు రావడం పట్ల ఎస్‌కెడీ యూనివర్శిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ఇనాక్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి సీతారామప్రసాద్ గోపాలకృష్ణ, పలువురుపట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

దిరుసుమర్రు ప్రజలకు అంబులెన్స్ అందించిన సూర్యమిత్ర యాజమాన్యం

భీమవరం : పరిశ్రమలు కేవలం వ్యాపారమే కాకుండా ఆ ప్రాంత ప్రజల కోసం సేవా కార్యక్రమాల కోసం కొంత ఖర్చు చేయాలని, ఆ విషయంలో ఆక్వాకంపెనీ సూర్యమిత్ర యాజమాన్యం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం రూరల్ మండలం దిరుసుమర్రులో సూర్యమిత్ర ఆధ్వర్యంలో ఉచిత అంబులెన్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.కంపెనీ ఉద్యోగులకు, పరిసర గ్రామప్రజలకు ఉపయోగపడేలా ఈ అంబులెన్స్ ప్రారంభించడాన్ని అభినందించారు. కంపెనీ ఛైర్మన్ డాక్టర్ సూర్యారావు మాట్లాడుతూ పరిసర ప్రాంత ప్రజలకు ఉపయోగపడేలా ఈ అంబులెన్స్‌ను ఏర్పాటు చేశామన్నారు.


అంబులెన్స్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

మల్లికార్జున స్వామికి ఏకాదశ రుద్రాభిషేకాలు

ద్వారకా తిరుమల : వేంకటేశ్వరస్వామి ఉపాలయం క్షేత్రపాలకుడైన భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో మాస శివరాత్రి మహన్యాస ఏకాదశ రుద్రాభిషేకాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకుడు రాఘవయ్య, వేద పండితులు పంచామృతాలతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో మహన్యాస ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి వేండ్ర త్రినాథరావు పాల్గొన్నారు.



స్టూడెంట్ వాయిస్



సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఉండాలి

కూరాకుల మధుబాలాజీ యాదవ్, విద్యార్థి,

ప్రతి విద్యార్థి సాంకేతిక పరిజ్ఞానం పట్ల అవగాహన పెంచుకోవాలి. ప్రస్తుత సమాజంలో సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన చాలా అవసరం.. పోటీ ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానం లేనిదే ముందుకు వెళ్లలేము.పోటీ పరీక్షల్లో ప్రతి విద్యార్థి ముందంజలో ఉండేలా పాఠ్యాంశాలపై అవగాహన పెంచుకోవాలి. సాంకేతిక పరిజ్ఞానాన్ని అవసరానికే వినియోగించాలి.. దుర్వినియోగం చేయకూడదు.. నేటి యువత నెట్, ఫేస్‌బుక్, వాట్సాప్‌లతో సమయాన్ని వృథా చేస్తున్నారు.

● ద్వారకా తిరుమల

వర్షాలతో రైతుల్లో హర్షం

నల్లజర్ల : మెట్టలో ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంటలకు ఈ వర్షాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొంటున్నారు. వాగులు పొంగిపొర్లుతూ నీరు సమృద్ధిగా ఉందని ఆనందిస్తున్నారు.

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

నల్లజర్ల	: 98667 44751
గోపాలపురం	: 94410 52929
ద్వారకాతిరుమల	: 99511 78597
దేవరపల్లి	: 94404 02036

సినిమా గైడ్

దేవరపల్లి :

త్రినాథ్	నేనే రాజు నేనే మంత్రి
రామనాథ్	జయ జానకీ నాయకా

యర్నగూడెం :

నల్లజర్ల :

శ్రీనివాస	లై

అనంతపల్లి :

అన్నపూర్ణ	లై

ఎర్రకాల్వకు పెరిగిన వరద ఉధృతి..

నల్లజర్ల : కొంగువారిగూడెం ఎర్రకాల్వ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తివేయడంతో నల్లజర్ల మండలంలో ఎర్ర కాల్వ పొంగిప్రవహిస్తోంది.ఆదివారం సాయంత్రం అనంతపల్లి వద్ద ఎర్ర కాల్వ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎక్కడైనా గట్టు తెగితే పల్లపు ప్రాంతాల్లోని పంటలను ముంచెత్తుతుందన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. ఎగువ ప్రాంతాల్లో అధిక వర్షాలకు ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ ఏడాది ఎర్ర కాల్వ ఈ స్థాయిలో ప్రవాహించడం ఇదే ప్రథమం కావడంతో స్థానికులు చూసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుతం ఎటువంటి ప్రమాదం లేకపోయినప్పటికీ రైతుల్లో మాత్రం ఆందోళన తగ్గడం లేదు. అనంతపల్లి నుంచి నందమూరు వరకు అభివృద్ధి చేయాల్సిన ఎర్ర కాల్వ పనులు ఇంకా పెండింగ్ లోనే ఉన్నాయి.



ఉధృతంగా ప్రవహిస్తున్న ఎర్రకాల్వ

వ్యక్తిగత విభేదాలు వీడి ఐక్యంగా పనిచేయాలి

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

గోపాలపురం : క్షేత్ర స్థాయిలో బూత్ కమిటీల ద్వారా పార్టీని మరింత పటిష్టపర్చాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఏఎంసీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు మేర్ని సుధాకర్ అధ్యక్షతన నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఆశించిన మేరకు అభివృద్ధి పనులు జరుగుతున్నప్పటికీ వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు విఫలమవుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి పలువురు తీసుకెళ్లారు. గోపాలపురానికి చెందిన సీనియర్ నాయకుడు చెదలవాడ ప్రసాద్ మాట్లాడుతూ టీడీపీలో ఒక్క సామాజిక వర్గానికి మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సముచిత స్థానం దక్కడంలేదంటూ వాదనకు దిగారు. వ్యక్తిగత విభేదాలు వీడి పార్టీ అభివృద్ధికి అంతా ఏకాభిప్రాయానికి రావాలని సూచించారు. గోపాలపురం ఏఎంసీ చైర్మన్ పదవిని బీసీలకు కట్టబెట్టాలని లేదంటే ఆందోళనకు దిగుతామని తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వర్గవిభేదాలు వీడి అధిష్ఠానం సూచనల మేరకు పనిచేయాలన్నారు. ఏ ఒక్కరి నిర్ణయాలకు కట్టుబడి పార్టీ పరువును బజారుకు ఎక్కించవద్దన్నారు.వచ్చే నెల ఒకటి నుంచి అక్టోబర్ 30వ తేదీ వరకు నియోజకవర్గంలో ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంతో పాదయాత్ర చేపడుతున్నామన్నారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెలికాని సోంబాబు, మూడు మండలాల పార్టీ అధ్యక్షులు మేణ్ని సుధాకర్, కొయ్యలమూడి చిన్నబాబు, సుంకర ధర్మయ్య, జడ్పీటీసీ ఈలి పద్మజారాణి, కె.లక్ష్మీరమణ, ఎంపీపీలు జమ్ముల సతీష్, ఏఎంసీ చైర్మన్ ముళ్లపూడి వెంకట్రావు, ఈలి శరత్ బాబు, కొర్లపాటి రాము, టీడీపీ జిల్లా కార్యదర్శి వడ్లమూడి రమేష్ బాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యేష్ఠ శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి అశోక్, బీసీ సెల్ అధ్యక్షుడు జామి సూర్యచంద్రరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

యోగా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నల్లజర్ల : యోగా జిల్లా అసోషియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న నిడదవోలులో జరిగిన యోగాసన ఛాంపియన్‌షిప్ పోటీల్లో నల్లజర్ల మండలం దూబచర్ల హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు దూబచర్ల హైస్కూల్ పీడీ, యోగా గురువు దూబకుంట్ల రాజారావు తెలిపారు. ఎనిమిదేళ్ల వయస్సు కలిగిన బాలబాలికల విభాగం నుంచి 11ఏళ్ల వయస్సు కలిగిన బాల బాలికల వరకు పోటీలు నిర్వహించినట్టు పేర్కొన్నారు. లక్ష్మీ ప్రసన్న, జయ ప్రతిభ, ప్రభాస్, మైథిలి, దివ్యచంద్రిక, చందుబాబు రాష్ట్ర స్థాయి విజేతలుగా నిలిచారు. విద్యార్థులను వైస్ ఎంపీపీ ఈడే శ్రీను,సర్పంచ్ సుందరరావు, హెచ్‌ఎం భారతి, కూచిపూడి ఉదయ భాస్కర్ అభినందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.పి. స్వామి, కోశాధికారి జి.మోహన్, ఎ.శ్రీను పాల్గొన్నారు.



చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

'పేదల సంక్షేమానికి రాజీవ్‌గాంధీ కృషి'

ద్వారకాతిరుమల : రాజీవ్‌గాంధీ బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పాకలపాటి త్యాగభీమేశ్వరరావు అన్నారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా మండలంలోని రామన్నగూడెంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు జుత్తిగ సత్యనారాయణ, యూత్ కాంగ్రెస్ మండల కార్యదర్శి కె.మల్లేశ్వరరావు, పెండ్లి శ్రీను పాల్గొన్నారు.

పశువులను తరలిస్తున్న లారీ స్వాధీనం

నల్లజర్ల : తూర్పుగోదావరి జిల్లా తుని నుంచి హైదరాబాద్ తరలిస్తున్న 30 పశువులను నల్లజర్ల గో సంరక్షణ సమితి సభ్యులు అడ్డుకున్నారు.ముందస్తు సమాచారం మేరకు గంటవారిగూడెం శివారులో గోవులను తరలిస్తున్న లారీని నిలిపివేశారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో డ్రైవర్‌ను అరెస్టు చేశారు.



తోటలను పరిశీలిస్తున్న అటవీశాఖాధికారులు

కప్పలకుంటలో పులి అడుగులు!

పరిశీలించిన అటవీశాఖాధికారులు

ద్వారకా తిరుమల : రెండు నెలలుగా పులిసంచరిస్తుందనే అనుమానంతో మండల ప్రజలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలకు రైతులు సమూహంగా వెళ్లాల్సి వస్తోంది.. పులి భయంతో రెండునెలలుగా కంటిమీద కునుకు లేకుండా ప్రజలు గడుపుతున్నారు. తిరుమలంపాలెం గ్రామ శివారులో గుళికలు తిని ఒక చిరుతపులి మృతి చెందింది. అప్పటి నుంచి పావులూరివారిగూడెం, రాజుపాలెం, ద్వారకాతిరుమల శ్రీవారి శేషాచలకొండపై పులి అడుగుజాడలు కనపడ్డాయన్న ప్రజల ఆందోళనతో అటవీ సిబ్బంది గస్తీ కాస్తున్నారు. పులిని పట్టుకోవడానికి బోను కూడా ఏర్పాటు చేశారు. గుణ్ణంపల్లి పంచాయతీ పరిధిలోని కప్పలకుంట గ్రామతోటల్లో పులి అడుగుజాడలు కనిపించాయని అటవీసిబ్బందికి ఆదివారం సమాచారం అందడంతో రేంజ్ అధికారి సాంబశివరావు తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పులి అడుగు జాడలను బట్టి రాళ్ళకుంట వద్ద ఇనుప బోనును ఏర్పాటు చేస్తున్నట్టు రేంజ్ అధికారి సాంబశివరావు తెలిపారు.

ముగిసిన స్వామివారి పవిత్రోత్సవాలు


ద్వారకా తిరుమల : లక్ష్మీపురం గ్రామంలో ఉన్న జగన్నాథ స్వామి ఆలయంలో వేంకటేశ్వర స్వామి పవిత్రోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. దేవాలయంలోని యాగశాలలో నాలుగు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించారు. పవిత్రోత్సవాలను వేదపండితులు, ఆలయార్చకులు వేదమంత్రాలతో నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి వేండ్ర త్రినాథరావు పాల్గొన్నారు.

పాము కాటుకు వ్యక్తి మృతి

నల్లజర్ల : అయ్యవరంలో పాము కాటుకు గురై ఆస్పత్రి పాలైన దెయ్యల వెంకటేశ్వరరావు(70) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన వెంకటేశ్వరరావును కాము కాటు వేయడంతో తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందినట్టు ఎస్ఐ పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

దూబచర్లలో 400 మందికి ఉచిత వైద్యం

నల్లజర్ల : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దూబచర్లలో ఉచిత మెగా నేత్ర, గుండె వైద్య శిబిరం నిర్వహించారు. దూబచర్ల సంఘమిత్ర స్కూల్లో ఆదివారం నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో 400మందికి వైద్య సేవలందించారు. 30మందిని కంటి ఆపరేషన్ నిమిత్తం పాలకొల్లు పంపగా మరో 30మందికి గుండెకు సంబంధించిన వ్యాధుల చికిత్స కోసం విజయవాడలోని ఒక ఆస్పత్రికి సిపారస్సు చేశామని దూబచర్ల లయన్స్ క్లబ్ కమిటీ పేర్కొంది. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.పి.స్వామి, కార్యదర్శి రాజులపాటి ఆదినారాయణ, కోశాధికారి గురివిందుల మోహన్,సభ్యులు తాతిన సత్యనారాయణ, కూచిపూడి భాస్కర్, బేతిన లక్ష్మణరావు,కీర్తి ఉమా మహేశ్వరరావు, అంబటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న లయన్స్ సభ్యులు

రామసింగారం పాఠశాలలో వనం మనం

కుక్కునూరు: రామసింగారం పాఠశాలలో ఆదివారం అటవీశాఖ ఆధ్వర్యంలో వనం మనం కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణ అంతా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖాధికారి టి.నరసింహారావు, ఉప సర్పంచ్ దండు నారాయణరాజు, డిఆర్వోలు వెంకటేశ్వరావు, అశోక్‌కుమార్, ఉపాధ్యాయుడు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

రాజీవ్‌కు నివాళులు

జంగారెడ్డిగూడెం టౌన్ : దివంగత నేత రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణత్యాగం చేశారని కాంగ్రెస్ నాయకుడు ఉక్కుర్తి దుర్గారావు అన్నారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా బస్టాండ్ సెంటర్ వద్ద రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

బీ.. అలర్ట్!

అపార్ట్‌మెంట్‌లకు ఆనుకొని విద్యుత్ తీగలు

మహిళలు, పిల్లలుకు పొంచి ఉన్న ప్రమాదం

నిబంధనలు పట్టించుకోని అధికారులు, బిల్డర్లు



అపార్ట్‌మెంట్‌కు ఆనుకొని ఉన్న విద్యుత్ తీగలు.. కాలిబూడిదైన చీర (ఫైల్)

జంగారెడ్డిగూడెం టౌన్ : పట్టణంలో పలు అపార్ట్‌మెంట్‌లకు ఆనుకొని విద్యుత్ తీగలు ఉండడంతో ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు. పట్టణంలో ఇష్టారాజ్యంగా కట్టేసిన అపార్ట్‌మెంట్‌ల వలన పారిశుధ్యం, పార్కింగ్, మంచినీటి సదుపాయం వంటి సమస్యలతో ప్రజలు ఇప్పటికే సతమవుతున్నారు. ఇదిలా ఉంటే రోడ్ల మీద యమపాశాల్లా వేలాడుతున్న విద్యుత్ తీగలు, రక్షణ వలయాలు లేని ట్రాన్స్‌ఫార్మర్‌ల సమస్య పట్టణంలో ఉండనే ఉన్నది. కొన్ని సమస్యలను అధికారులు పరిష్కరించినప్పటికీ పలు వార్డుల్లో మాత్రం ఏళ్ళ తరబడి పరిష్కారం కాని సమస్యలు ఉన్నాయని పలువురు వాపోతున్నారు. సాధారణంగా అపార్ట్‌మెంట్ లకు వాటి సామర్ధ్యాని బట్టి ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవల్సి ఉంది. అయితే, అపార్ట్‌మెంట్‌ల వద్ద ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్‌లకు, ఏర్పాటు చేసిన విద్యుత్‌తీగలకు ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోకపోవడం వలన పలు రకాల సమస్యలు తలెత్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల సుబ్బారెడ్డి కాలనీలోని అపార్ట్‌మెంట్‌కు ఆనుకొని ఉన్న విద్యుత్ తీగల వల్ల ఒక మహిళకు తృటిలో ప్రాణాపాయం తప్పింది. అపార్ట్‌మెంట్‌లోని 2వ అంతస్తులో నివసిస్తున్న లక్ష్మి అనే మహిళ తడిచీరను ఆరేసే క్రమంలో అపార్ట్‌మెంట్‌కు అతి దగ్గరలో ఉన్న విద్యుత్ తీగకు చీర తగిలింది. వెంటనే అప్రమత్తమైన మహిళ చీరను వదిలేయడంతో చేతికి స్వల్పగాయంతో బయటపడింది. చీర కాలి బూడిదైపోయింది.

ఇదే విషయమై విద్యుత్ అధికారులను ఆరా తీయగా పూర్తి బాధ్యులు అపార్ట్‌మెంట్ బిల్డర్‌లేనని స్పష్టం చేశారు. అంతేకాకుండా అక్కడ నివాసం ఉంటున్న వారు సైతం కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే విద్యుత్ తీగలను దూరంగా ఏర్పాటు చేస్తామని చెప్పారు. అయితే, అపార్ట్‌మెంట్‌కు విద్యుత్ అనుమతులు ఇచ్చే క్రమంలోనే బిల్డర్‌లను హెచ్చరించాల్సిన బాధ్యత అధికారులపై లేదా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. మహిళ అప్రమత్తం అవ్వడంతో స్వల్పగాయాలతో బయటపడింది. అదే పరిస్థితిలో చిన్న పిల్లలు, వృద్ధులు ఉంటే పెద్ద ప్రమాదమే జరిగేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ తీగలను ఏర్పాటు చేసే క్రమంలోనే అధికారులు నిబంధనలను పాటించి ఉంటే ఇటువంటి ప్రమాదాలు తలెత్తేవి కావని పలువురు వాపోతున్నారు.

స్టూడెంట్ వాయిస్



నిరుద్యోగ సమస్య పరిష్కరించాలి

అజార్, విద్యార్థి

నిరుద్యోగులు అధికమవుతున్నారు. అధిక శాతం పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి నిరుద్యోగులుగా కాలం వెళ్ళ దీస్తున్నారు. విద్యా సంస్థలు అధిక పీజులు వసూలు చేస్తున్నా వాటిని నియంత్రించాల్సిన అధికారులు స్పందించడం లేదు. దాంతో పేద విద్యార్థులకు ఉన్నత విద్య భారమవుతున్నది. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి ప్రతీ నియోజకవర్గంలో పరిశ్రమలు స్థాపించాలి. నిరుద్యోగులు పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్ళే పరిస్థితి నివారించాలి

● జంగారెడ్డిగూడెం టౌన్



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

దోమల నివారణపై అవగాహనా ర్యాలీ

జంగారెడ్డిగూడెం టౌన్: ప్రతిభా ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో దోమల నివారణా దినం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కాసర సరోజారెడ్డి మాట్లాడుతూ దోమల మీద దండయాత్ర అని ప్రభుత్వాలు నినాదాలిస్తున్నాయన్నారు. నిధులు కేటాయిస్తున్నాయన్నారు. కాని అన్ని తూతూ మంత్రంగానే సాగుతున్నాయన్నారు. సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం, ఖాళీ స్థలాల్లో మురుగునీరు చేరడం వంటివి దోమల విస్తరణకు దోహదపడుతున్నాయన్నారు. ప్రజల్లో దోమల నివారణ పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్లకార్డులతో ర్యాలీ ని నిర్వహించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ బంగారు శివలక్ష్మికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ సుభాష్‌రెడ్డి, సింధూషారెడ్డి, సంగీతారెడ్డి, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, విజయ బాబు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో ఎస్.లవన్న

భావితరాల అభివృద్ధిలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర

జంగారెడ్డిగూడెం టౌన్ : ఉపాధ్యాయుడు బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తే భావితరాలు అభివృద్ధి చెందుతాయని ఆర్డీవో ఎస్.లవన్న అన్నారు. ఆదివారం బడ్స్ అండ్ బ్లోసమ్స్ హైస్కూల్‌లో విజయోత్సవ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గుంటూరులో నిర్వహించిన యూసీఎంఎఎస్ స్టేట్ లెవెల్ పోటీల్లో బడ్స్ అండ్ బ్లోసమ్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేయడం గర్వకారణమన్నారు. విశ్రాంతి ఎంఈవో చావా రమేష్ బాబు, ఎంఈవో రాముడు, ప్రిన్సిపాల్ పివి. వరలక్ష్మి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డీవైఈవో సురేష్‌బాబు, జర్నలిస్టు మ్యాగజైన్ చీఫ్ ఎడిటర్ కృష్ణంరాజు, సిటికేబుల్ ఎండి పాలపర్తి శ్రీనివాస్, అకడమిక్ డైరెక్టర్ మహేష్ వర్మ, కరస్పాండెంట్ సీతారామరాజు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆశ్రమంలో జన్మదిన వేడుకలు

జంగారెడ్డిగూడెం టౌన్ : దివ్యాంగులకు సేవ చేయడం దైవ కార్యంతో సమానమని అమ్మానాన్న వికలాంగుల ఆశ్రమం నిర్వాహకులు డి. ఆంజనేయులు అన్నారు. పోల్నాటి బాబ్జి కుమారుడు పొల్నాటి తారక్ సాయి మణికంఠ పుట్టిన రోజు వేడుకలను దివ్యాంగుల మధ్య జరుపుకున్నారన్నారు. పుట్టిన రోజు కేక్‌ను కట్ చేసి దివ్యాంగులకు పంచిపెట్టి, భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ మండెల నాగరాజు పాల్గొన్నారు.



సొసైటీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

నాణ్యమైన సేవలతోనే సుస్థిర స్థానం

జంగారెడ్డిగూడెం టౌన్: నాణ్యమైన సేవలతోనే సుస్థిర స్థానం చేకూరుతుందని పోలవరం శాసనసభ్యులు మొడియం శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణంలో ముద్రా అగ్రికల్చర్ స్కిల్‌డెవలప్‌మెంట్ మల్టీ స్టేట్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొడియం శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు సబ్సిడి రుణాలు పొందవచ్చని, నిరుద్యోగ యువతకు సంస్థ ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ సేవలు అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆవుల గౌతమ్‌బాబును జిల్లా డైరెక్టర్‌గా నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ తిప్పినేని రామదాసపు నాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు పెనుమర్తి రామ్‌కుమార్, బిజేపీ మహిళా నాయకురాలు పివి. రామలక్ష్మి, వైసీపీ అధికార ప్రతినిధి పోల్నాటి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న చిరు అభిమానులు

చిరు అభిమానుల రక్తదానం

జంగారెడ్డిగూడెం టౌన్: మెగాస్టార్ చిరంజీవి జన్మదినం సందర్భంగా అభిమానులు రక్తదానం చేశారు. పట్టణానికి చెందిన వికలాంగుడైన మెగా అభిమాని రేపాక దుర్గాప్రసాద్ 10వ సారి రక్తదానం చేశారు. ఆంధ్రప్రదేశ్ వైద్యవిదాన పరిషత్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. ఈ శిబిరంలో బ్లడ్ బ్యాంక్ ఆర్గనైజర్ వలవల తాతాజీ, ప్రముఖ న్యాయవాది అచ్యుత శ్రీనివాసరావు, మానవతా మూర్తి, పారేపల్లి నరేష్, రఫీ ఆలీషా, సాయి, రాజేష్‌కుమార్, గంగాధర్, వసంతాటి మంగరాజు, వెంకన్న , జనసేన నాని, గుబ్బల ప్రసాద్ తదితరులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని చిరంజీవి యువత అధ్యక్షులు చింతల నాని పర్యవేక్షించారు.

కుక్కునూరు ..

ఆదమరిస్తే ప్రమాదమే

కుక్కునూరు-దాచారం గ్రామాల మధ్య అధ్వానంగా మారిన రహదారి

కుక్కునూరు: కుక్కునూరు-దాచారం గ్రామాల మధ్య రహదారి అధ్వానంగా మారింది. గత నెలలో కురిసిన వర్షాలకు గుండేటివాగు వరద లోలెవల్ కాజ్‌వే నుంచి ప్రవహించింది. దీంతో కాజ్‌వే ఇరువైపులా ఉన్న అప్రోచ్‌లకు గండ్లు పడ్డాయి. కుక్కునూరు-దాచారం వైపు ప్రతి రోజూ 20 గ్రామాల ప్రజలు, వేలేరుపాడు మండల ప్రజలు ఇటువైపు నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. కాజ్‌వేకు పడిన గండ్లుకు ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టపోవడంతో ప్రజల ప్రయాణం ప్రమాదకరంగా మారింది. నాలుగు చక్రాల వాహనాలు రావాలంటే గండ్లును తాత్కాలికంగా మరమ్మతులు చేసుకొని ముందుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. లేదంటే ఈ రహదారిని వదిలి నల్లకుంట మీదుగా 12 కి.మీ అదనంగా తిరిగి ప్రయాణించాల్సి ఉంది. విద్యార్థులు, రైతులు ఎక్కువగా గుండేటివాగు మీదుగానే వెళుతుంటారు. అలాగే ఈరహదారిపై పలు చోట్ల గోతులు ఏర్పడ్డాయి. గ్రావెల్‌తోనైనా మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.




గుండేటివాగు వద్ద వరద ఉధృతికి కోసుకుపోయిన రహదారి.. తాత్కాలికంగా గండ్లు పూడ్చుకుని వాహనదారుల పాట్లు

సినిమా గైడ్

జంగారెడ్డిగూడెం :

లక్ష్మి	ఫిదా
సౌభాగ్య	జయ జానకి నాయక
,, స్క్రీన్-2	నక్షత్రం
శ్రీ పద్మ	నేనే రాజు నేనే మంత్రి
శ్రీ రాజరాజేశ్వరి	లై

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

జంగారెడ్డిగూడెం	: 9603519823
,, టౌన్	: 9866666757
కుక్కునూరు	: 9440255016
వేలేరుపాడు	: 9440242054

ఆంధ్రజ్యోతి
కొవ్వూరు టౌన్
3 సోమవారం 21 ఆగస్టు 2017
। కొవ్వూరు । కొవ్వూరు టౌన్ ।





కొవ్వూరు రైల్వే సమాచారం..

రైలు నంబర్ - బండి పేరు	సమయం
●విజయవాడ వైపు...	
57230 మచిలీపట్టణం-నరసాపురం (పా)	00.14
57272 రాయగడ - విజయవాడ(పా)	01.38
17449 పూరీ -తిరుపతి (ఎక్స్)	03.38
17481 బిలాస్‌పూర్-తిరుపతి (ఎక్స్)	03-38
67262 రాజమండ్రి - విజయవాడ (పా)	04-02
77242 రాజమండ్రి - భీమవరం(పా)	04-43
57232 కాకినాడ పోర్ట్- విజయవాడ (పా)	06-27
57322 రాజమండ్రి - నరసాపురం(పా)	08-16
57258 కాకినాడ పోర్ట్ -తిరుపతి(పా)	09-32
17240 సింహాద్రి(ఎక్స్)విశాఖ-గుంటూరు	10-52
77238 రాజమండ్రి-భీమవరం(పా)	12-33
57226 విశాఖపట్టణం-విజయవాడ(పా)	13-56
13351 బొకారో ధన్‌బాద్-అలెప్పీ (ఎక్స్)	13-29
17644 సర్కార్ కాకినాడ ఫోర్-చెన్నై ఎగ్మోర్	16-01
17488 తిరుమల విశాఖపట్టణం - తిరుపతి(ఎక్స్)	17.32
67299 రాజమండ్రి -విజయవాడ(పా)	17-32
12737 గౌతమి (ఎక్స్) కాకినాడ పోర్ట్ - సికింద్రాబాద్	21.52
విశాఖపట్టణం వైపు...	
5727 విజయవాడ - రాయగడ (పా)	00-17
57229 మచిలీపట్టణం-నరసాపురం (పా)	2.05
12738 గౌతమి సికింద్రాబాద్ -కాకినాడ పోర్టు	5.10
17487 తిరుమల (ఎక్స్) తిరుపతి-విశాఖ	5.32
17643 సర్కార్ చెన్నై ఎగ్మోర్ - కాకినాడ పోర్ట్	7.09
67300 విజయవాడ-రాజమండ్రి(పా)	8.21
77237 భీమవరం - రాజమండ్రి(పా)	9.26
13352 బొకారో అలెప్పీ-ధన్‌బాద్-టాటానగర్	9.42
57225 విజయవాడ-విశాఖ(పా)	11.50
17239 సింహాద్రి(ఎక్స్) గుంటూరు -విశాఖపట్టణం	12.47
57321 భీమవరం - రాజమండ్రి(పా)	16.28
57257 తిరుపతి - కాకినాడ పోర్టు	17.42
57231 విజయవాడ - కాకినాడ పోర్టు (పా)	20.08
67261 విజయవాడ - రాజమండ్రి (పా)	21.28
77241 భీమవరం - రాజమండ్రి(పా)	22.49
17480 తిరుపతి -పూరీ (ఎక్స్)	23.26
17482 తిరుపతి -బిలాస్‌పూర్ (ఎక్స్)	23.26

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

కొవ్వూరు	: 94900 86600
తాళ్లపూడి	: 94410 87274
చాగల్లు	: 94404 15499

సినిమా గైడ్

కొవ్వూరు :

గాయత్రి	జయ జానకి నాయక
అనన్య	లై, నేనే రాజు.. నేనే మంత్రి

చాగల్లు :

వెంకటకృష్ణ	జయ జానకి నాయక
వెంకట్రామా	లై

ప్రయాణం..ప్రమాదకరం


గోతులతో అధ్వానంగా మారిన కొవ్వూరు-దొమ్మేరు ఈజీకే రోడ్డు





ఈజీకే రహదారిపై గోతులు పడి ప్రమాకరంగా మారిన దృశ్యాలు

కొవ్వూరు : ఈజీకే రహదారి గోతులు పడి ప్రమాదకరంగా తయారైంది. రాజమండ్రి-కొవ్వూరు మధ్య నూతనంగా నిర్మించిన నాలుగు లైన్‌ల గామన్ బ్రిడ్జిపై రాకపోకలు ప్రారంభమైన నాటి నుంచి ఈ రహదారిలో విశాఖపట్టణం, విజయవాడ వైపు భారీ వాహన రాకపోకలు విపరీతంగా పెరిగాయి. వాహన రాకపోకలు పెరిగినప్పటికి వంతెనకు అనుసంధానంగా రోడ్డును విస్తరించాల్సిన అధికారులు అలసత్వం వహించడంతో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. కొవ్వూరు గామన్ జంక్షన్ నుంచి దొమ్మేరు వరకు రోడ్డుపై గోతులు పడి రాళ్లు పైకి లేచి రహదారి ప్రమాదకరంగా మారింది. వర్షాకాలంలో గోతుల్లో నీరు నిలిచిపోతుంది. దీంతో వాహనదారులు ప్రమాదాలు బారిన పడి తీవ్ర గాయాలు, మృత్యువాత పడిన సంఘనలు చోటు చేసుకుంటున్నాయి. ఇకనైనా అధికార యంత్రాంగం ఈ ప్రమాదకర రహదారిపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



అభివృద్ధి పనులు పరిశీలించిన మంత్రి



పశివేదలలో అభివృద్ధి పనులు పర్యవేక్షిస్తున్న మంత్రి జవహర్

పశివేదల(కొవ్వూరు) : నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్టు మంత్రి కెఎస్.జవహర్ అన్నారు. ఆదివారం మండలంలోని పశివేదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలో రూ.13 లక్షలతో చేపట్టిన ఆవరణలో లెవెలింగ్ పనులను మంత్రి పర్యవేక్షించారు. దత్తత గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలో విద్య, వైద్యానికి ప్రాధాన్యం కల్పిస్తున్నామన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వేగి చిన్న, బేతిన నారాయణ, గారపాటి శ్రీనివాసరావు, గెల్లా శ్రీనివాసరావు, పొట్రు శ్రీనివాసరావు, మద్దుకూరి సురేష్ పాల్గొన్నారు.

రాజీవ్‌కు ఘన నివాళి

దొమ్మేరు(కొవ్వూరు) :అతి చిన్నవయస్సులో దేశ ప్రధానిగా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌కు వన్నె తెచ్చిన వ్యక్తి మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎండీ.రఫీయుల్లాబేగ్ అన్నారు. దొమ్మేరులో బేగ్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూల మాలలు వేశారు. దేశానికి గ్రామీణ ప్రాంతాలే పట్టుకొమ్మలు అన్న మాటలు నిజం చేస్తూ ప్రధానిగా రాజీవ్‌గాంధీ ప్రవేశపెట్టిన సంస్కరణలే నేటికి గ్రామ పంచాయతీలకు అందుతున్నాయడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి సీతా వెంకటేశ్వర్లు, డీసీసీ కార్యదర్శి కంఠం శెట్టి దుర్గారావు, గ్రామపెద్దలుపాల్గొన్నారు.



దొమ్మేరులో రాజీవ్‌గాంధీకి నివాళులర్పించిన రఫీయుల్లాబేగ్

పోస్టల్ సేవలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం

కొవ్వూరు : గ్రామీణ ప్రాంతాల్లోని పోస్టుమాస్టర్‌లు చేస్తున్న సమ్మె కారణంగా తపాలా సేవలకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని కొవ్వూరు పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎస్ఎస్ఈఎస్ కుమార్ తెలిపారు. ఈనెల 16 నుంచి గ్రామీణ డాక్ సేవక్‌లకు చెందిన ఒక విభాగం సమ్మె చేపట్టిందన్నారు. ఈ సమ్మె వల్ల తపాలా సేవలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు. సేవింగ్స్ ఖాతాలకు సంబంధించి లావాదేవీలు గ్రామీణ తపాలా బీమా, తమాలా జీవిత బీమా లావాదేవీలకు సంబంధించి ఆటంకం లేకుండా సేవలందేలా దగ్గరలోని సబ్ పోస్టాఫీసులో ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు. ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని అసిస్టెంట్ సూపరింటెండెంట్ కుమార్ తెలిపారు. పోస్టల్ ఖాతాదారులకు ఉత్తమ సేవలందించేందుకు కృషి చేస్తున్నామని కుమార్ తెలిపారు.



గోష్పాదేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న పండితులు

సుందరేశ్వర స్వామికి లక్ష బిల్వార్చన

కొవ్వూరు టౌన్ : గోష్పాద క్షేత్రంలో ఉన్న బాలా త్రిపుర సుందరి సమేత సుందరేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఆదివారం గోష్పాద క్షేత్ర లక్షబిల్వార్చన కమిటీ ఆధ్వర్యంలో బాలా త్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సుందరేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్షబిల్వార్చన, బాలా త్రిపురసుందరీదేవికి లక్ష కుంకుమ పూజలు, రుద్రహోమం నిర్వహించారు.

సుగర్స్ కార్మికులకు బకాయిలు చెల్లించాలి

కొవ్వూరు : చాగల్లు జైపూర్ సుగర్స్ యాజమాన్యం పది నెలలుగా కార్మికులకు వేతనాలు చెల్లించక పోవడంతో సుమారు 700 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని టీడీపీ జిల్లా కార్యదర్శి కేవీకే.రంగారావు అన్నారు. బకాయిలు చెల్లించాలని ఐదు రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న కార్మికులకు మద్దతు తెలిపారు. యాజమాన్యం నిరంకుశ వైఖరిని ఎండగట్టారు. చెరుకు క్రషింగ్ సీజన్ ప్రారంభం కానున్నందున ప్రభుత్వం జోక్యం చేసుకుని బకాయిలు తక్షణమే చెల్లించాలన్నారు.

నేడు ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు

కొవ్వూరు : పురపాలక సంఘ పరిధిలో సోమవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ పరిధిలోని అభ్యర్థులకు సోపాన పథకం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు మునిసిపల్ చైర్‌పర్సన్ జొన్నలగడ్డ రాధారాణి తెలిపారు. ఎస్‌బీఐ పరిధిలో 375 మంది దరఖాస్తులు చేసుకున్నారని వారంతా జిరాక్స్, ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10గంటలకు మునిసిపల్ కార్యాలయంలో హాజరు కావాలన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో.. కాపవరం గ్రామానికి సంబంధించి కొవ్వూరు సిండికేట్ బ్యాంక్ మేనేజర్ సత్యసాయి కుమార్ ఆధ్వర్యంలో ఉదయం 9గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో రాము తెలిపారు.

నేటి నుంచి 29 వరకు
సోపానం ఇంటర్వ్యూలు

ఉండ్రాజవరం :మండలంలో ఈ నెల21 నుంచి 29వ తేదీ వరకు స్వయం ఉపాధి సోపానం రుణాల దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బి.వీరాస్వామి చెప్పారు. 21న వేలివెన్ను పంచాయతీ వద్ద స్థానిక ఇండియన్ బ్యాంక్, దువ్వ బ్యాంక్ పరిధిలోని వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. 23న ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో ఆంధ్రాబ్యాంక్ పరిధిలోని వారికి, 24న ఎస్‌బీహెచ్ సత్యవాడ పరిధి, తణుకు కెనరా బ్యాంక్ పరిధిలోని దరఖాస్తుదారులకు, 28న పాలంగి ఐడీబీఐ బ్యాంక్, ఉండ్రాజవరం ఎస్‌బీహెచ్ శాఖ పరిధిలోని వారికి,29న మోర్త ఆంధ్రాబ్యాంక్, ఇండియన్ బ్యాంక్, తణుకు పరిధిలో లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

ఉండ్రాజవరం : తాడిపర్రు హైస్కూల్లోని విద్యార్థులకు ఆ గ్రామానికి చెందిన రామ కృష్ణ ఆర్థిక సాయంతో క్రీడాదుస్తులు అందజేసినట్టు హెచ్‌ఎం ఎన్.వి.రమణారెడ్డి చెప్పారు.రామకృష్ణను సర్పంచ్ కరుటూరి కృష్ణవేణి, ఉపాధ్యాయులు అభినందించినట్టు రమణారెడ్డి చెప్పారు.

నేడు మీ కోసంలో అర్జీల స్వీకరణ

ఉండ్రాజవరం : తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మీ కోసం కార్యక్రమం నిర్వహించనున్నట్టు తహసీల్దార్ జాన్ రాజు తెలిపారు. పరిష్కారం కాని సమస్యలుంటే అర్జీలు అందజేయాలని సూచించారు. సమావేశంలో ప్రజల నుంచి వివిధ రకాల దరఖాస్తులను స్వీకరిస్తామని మండల స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

తాళ్ళపూడి : వివాహిత పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి దుర్భాషలాడిన వ్యక్తిపై పి ద్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు. బల్లిపాడుకు చెందిన మల్లిపూడి సుబ్బలక్ష్మి కుటుంబం కొబ్బరికాయలు వేసిన వెంకటేశ్వరరావు కుటుంబం ఇరుగు పొరుగున ఉంటున్నారు. ఆదివారం ఉదయం వెంకటేశ్వరరావు అసభ్యకరంగా ప్రవర్తించడంతో బాధితురాలు సుబ్బలక్ష్మి ఫిర్యాదు చేసిందన్నారు. ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఘనంగా అన్నసమారాధన

చాగల్లు : స్థానిక సెంటర్‌లోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఘనంగా జరిగాయి. వారం రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం వేళ పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు. యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం జరిపారు.

మట్టి ప్రతిమలనే వాడండి..

వినాయక చవితి వేడుకల నేపథ్యంలో ప్రజలకు బుర్రకథ ద్వారా అవగాహన

తాళ్ళపూడి : పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీవో జి.జ్యోతిర్మయి అన్నారు. వినాయక చవితి వేడుకల్లో మట్టి గణపతి ప్రతిమను వినియోగించి పూజించాలని ప్రజలకు తెలియజేయడానికి ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కళాజాత ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం బస్‌స్టాండ సెంటర్లో విభూతి బ్రదర్స్ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వి.లోవరాజు బుర్రకథ రూపంలో ప్రజలకు అర్థమయ్యేలా అవగాహన కల్పించారు. రసాయనాలు వినియోగించి తయారుచేసే వినాయకుడి ప్రతిమలను కొనుగోలు చేయవద్దని హితవు పలికారు. మట్టిగణపతికే ప్రాధాన్యం ఇవ్వాలని ప్రజలకు వివరించాడు. కార్యక్రమంలో కళాకారులు ఎం. వెంకటేష్ రాజు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఉండాలి : పేరూరి నాగరాజు, ఎస్ఐ



పెరవలి : గణపతి ఉత్సవాలకు తగు జాగ్రత్తలు పాటించాలని పెరవలి ఎస్ఐ పేరూరి నాగరాజు అన్నారు. గణపతి నవరాత్రులను పురస్కరించుకుని మండలంలోని గ్రామాల్లో గణపతి ప్రతిమలను ప్రతిష్ఠించేవారు అనుమతి తీసుకోవాలన్నారు. ఈ విగ్రహాలను ఏర్పాటు చేసే చోట వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. విగ్రహాల వద్ద మైకులు ఏర్పాటు చేస్తే తప్పనిసరిగా అనుమతి ఉండాలని, పెద్ద ప్రతిమలను ప్రతిష్ఠించే కమిటీ వారు వివరాలు పోలీసులకు తెలియజేయాలన్నారు. నవరాత్రుల్లో అసాంఘిక కార్యక్రమాలు, రికార్డింగ్ డ్యాన్స్‌లు, గుండాట, పేకాట వంటి కార్యక్రమాలు నిర్వహిస్తే సహించమన్నారు. విగ్రహాల ఊరేగిం పు, నిమజ్జనం ప్రదేశాలను, తేదీలను పోలీసులకు ముందే తెలియజేయాలన్నారు. మందుగుండు సామగ్రి కాల్చరాదని అన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే పెరవలి పోలీసు లకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

వయోజన విద్య పరీక్షలు

పెరవలి : చదవడంరాని మహిళలను అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రభుత్వం చేపట్టిన వయోజన విద్య కార్యక్రమంలో భాగంగా ఆదివారం పరీక్షలు నిర్వహించారు. పెరవలి మండలంలో 452 మంది మహిళలు ఉండగా వారిలో 429 మందికి కనీస విద్య మూడో తరగతిని విద్యావలంటీర్ల ద్వారా నేర్పించి వారికి ఆదివారం ఆయా ప్రాంతాల్లోని పాఠశాలల వద్ద పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షా కేంద్రాల వద్ద స్థానిక ఈవోఏలు ఉండగా మండలంలోని సీసీలు, ఏపీఎం ఈ కేంద్రాలను పరిశీలించారు. జిల్లా నుంచి వచ్చిన సీసీ నాగరాజు కొన్ని పరీక్షా కేంద్రాలను సమీక్షించారు.


పరీక్షలు రాస్తున్న మహిళలు

నెరవేరని లక్ష్యం..

ప్రక్కిలంక(తాళ్ళపూడి) : చదవడం రాని వారికి విద్య నేర్పించేందుకు ఐకేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టిన వయోజన విద్య కార్యక్రమం లక్ష్యం నీరుగారుతోంది. ఆ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంతో నామమాత్రంగా తరగతులు నిర్వహించి పరీక్షలు తూతూమంత్రంగా రాయిస్తున్నారు. ఇందుకు నిదర్శనం తాళ్ళపూడి మండలంలో ఆదివారం 11 సెంటర్లలో జరిగిన పరీక్షలే. 409 మంది మహిళలకు గాను 322 మంది పరీక్షలు హాజరయ్యారయ్యారని సీసీ శ్రీనివాస్ చెబుతున్నారు. పరీక్షలపై ఏపీఎం పర్యవేక్షణ కొరవడటంతో సీసీలు, వీవోఏలు కాకి లెక్కలు చెబుతూ ప్రభుత్వ లక్ష్యాన్ని పక్కదారిపట్టిస్తున్నారు.

23న కౌలు హక్కు వేలం

పెరవలి : తీపర్రులోని లక్ష్మీనర్సింహ స్వామి ఆలయానికి చెందిన వ్యవసాయ భూమి సుమారు ఐదెకరాలకు ఈ నెల 23న కౌలు హక్కు వేలం వేయనున్నట్టు ఆలయ కార్య నిర్వాహణాధికారి వెంకట్రావు తెలిపారు. పాటలో పాల్గొనే వారు రూ.10 వేలు దరావత్తు చెల్లించాలన్నారు. కానూరు కొండాలమ్మ అమ్మవారి దేవస్థానానికి చెందిన చీరలు, రవికలు అదే రోజు మధ్యాహ్నం సోమేశ్వర స్వామి ఆలయంలో వేలం వేస్తామన్నారు.

పాటమ్మ పేటలో 130 మందికి ఉచిత వైద్యం

చాగల్లు : పాటమ్మపేటలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈశిబిరాన్ని ఎంపీపీ కోడూరి రమామణి ప్రారంభించారు. 130 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు ఆలపాటి సాంబశివరావు, మైఖేల్, ఆరుగొలను జైదీప్, వైద్య సేవలందించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రాయపాటి సుబ్బారావు, కార్యదర్శి కోడి సూర్యప్రకాశరావు, కోశాధికారి దొంగ రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రముఖులు పిచికల వెంకట సత్యనారాయణ, కోడూరి రామకృష్ణ, ఆళ్ళ సత్యనారాయణ పాల్గొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంచి నీటి సౌకర్యం కోసం దాత ఆలపాటి మాణిక్యాలరావు రూ.లక్ష విరాళంగా అందజేశారు.

రోడ్లు ఛిద్రం..

పెరవలి : వెంకట్రాయపురం గ్రామంలో కొన్ని ప్రాంతాల్లో రోడ్లు వర్షాలకు ఛిద్రంగా మారాయి. అడుగు ముందుకు వేయలేని పరిస్థితి.. పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు రోడ్లపై నిలిచిపోవడంతో ఇబ్బందిగా మారిందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు, నాయకులు ఇక్కడ పరిస్థితిని గమనించి సిమెంటు రోడ్లు వేయించాలని స్థానికులు కోరుతున్నారు.


వెంకట్రాయపురం
రోడ్డు దుస్థితి


గ్రామ సభ నిర్వహిస్తున్న దృశ్యం

భూ సమస్యలపై గ్రామ సభ

పెరవలి : నిడదవోలు ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు చొరవతో తహసీల్దార్ వజ్రపు జితేంద్ర మండలంలోని కానూరు అగ్రహారం గ్రామంలో ఆదివారం గ్రామ సభ నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా గ్రామంలో పంట భూముల క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. అంతేకాకుండా రైతులకు తక్కువ వడ్డీకి బ్యాంక్ రుణాలు కూడా అందని పరిస్థితి. ఈ విషయంపై ప్రత్యేక దృష్టిపెట్టిన ఎమ్మెల్యే ఎన్నికల హామీ మేరకు ఆదివారం ఈ గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ వజ్రపు జితేంద్ర మాట్లాడుతూ ఇంకా దస్తావేజులివ్వాల్సిన వారి గురించి మాట్లాడారు.. మరో 60 రోజుల్లో పాస్ పుస్తకాల జారీకి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉబా మోషే, ఉప సర్పంచ్ దాసం వెంకన్న, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజల గుండెల్లో నిలిచిన రాజీవ్‌గాంధీ

పెద్దేవం(తాళ్ళపూడి) : దివంగత నేత రాజీవ్‌గాంధీ చేసిన సేవలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పూసల రామారావు అన్నారు. పెద్దేవంలో రాజీవ్‌గాంధీ జయంతిని పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో జరిపారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పాలాభిషేకం చేసారు. పూలమాలలు వేసి మననివాళులర్పించారు. కార్యక్రమంలో పూసల రామారావు, పీసీసీ సభ్యులు గెద్దం సాయిబాబా పాల్గొన్నారు.

'సమస్య పరిష్కారానికి కృషి చేస్తా'

చాగల్లు : జైపూర్ సుగర్స్ కంపెనీ కార్మికులు చేపట్టిన నిరాహార దీక్షలు ఆదివారం ఐదో రోజుకు చేరాయి. బీజేపీ నాయకుడు, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఫీయుల్లాబేగ్ శిబిరాన్ని సందర్శించి కార్మికులకు సంఘీభావం తెలిపారు. సమస్య పరిష్కారానికి కేంద్ర కార్మిక శాఖ మంత్రితో మాట్లాడతానని ఎమ్మెల్యే ఆకుల తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షుడు ఎన్.వి.కృష్ణారావు, నాయకులు ఎం.శ్రీనివాసరావు, కె. సోమరాజు, కె.శ్రీనివాసరావు, పి.అగస్త్యేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యక్తిని గాయపరిచిన ఇరువురిపై కేసు

వాడపల్లి(కొవ్వూరు) : పాత కక్షల నేపథ్యంలో ఒక వ్యక్తిని గాయపరిచిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ సతీష్ జానా తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం రాజమండ్రికి చెందిన కత్తిముక్కల శ్రీనివాసరావుకు వాడపల్లిలో పొలం ఉంది. ఆ పొలంలోకి కత్తిముక్కల సూర్యప్రకాశరావు, వెంకటేష్‌స్వామి అనే ఇద్దరు వ్యక్తులు ఈనెల 12న అక్రమంగా ప్రవేశించి శ్రీనివాసరావును కొట్టారు. దీనిపై వారు పొలంలో ప్రవేశించి తనను కొట్టి, వెయ్యి కొబ్బరి కాయలు తీసుకుపోయినట్టు శ్రీనివాసరావు ఆదివారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఇరువురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



స్టూడెంట్ వాయిస్



విద్య ఉపాధిని కల్పించాలి

జి.భానుతేజ, విద్యార్థి, ఉండ్రాజవరం

ప్రభుత్వం వృత్తి విద్యా కోర్సులకు ప్రాధాన్యం ఇవ్వాలి. పాఠశాల స్థాయి నుంచి వృత్తి విద్యా కోర్సులు నిర్వహించడం ద్వారా డిగ్రీ స్థాయిలో ఎంతో ఉపయోగపడతాయి. వృత్తి విద్యా కోర్సులు అభ్యసించడం వల్ల నిరుద్యోగ సమస్య తగ్గేఅవకాశం ఉంటుంది. విద్య అనేది విద్యార్థికి జీవనోపాధి కల్పించేలా ఉండాలి. పదో తరగతి వరకు మామూలు విద్య కోర్సులుంటాయి. ఇంటర్ నుంచి వృత్తి విద్యాకోర్సులు ఉంటున్నాయి. 6వ తరగతి నుంచే వృత్తి విద్యా కోర్సులు పెట్టడం మంచిది. ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో చదివే వారికి ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలి. ఉపాధి కోర్సులు మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రవేశపెట్టాలి.

● ఉండ్రాజవరం

నేడు సోపానం ఇంటర్వ్యూలు

నిడదవోలు : మునిసిపల్ కార్యాలయంలో సోమవారం బ్యాంక్ ఆఫ్ ఇండియా పరిధిలో దరఖాస్తుదారులకు ఉదయం 9నుంచి ఇంటర్వ్యూలను నిర్వహించి లబ్ధిదారుల ఎంపిక నిర్వహిస్తామన్నారు. సకాలంలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కమిషనర్ కృష్ణమోహన్ తెలిపారు.

నేడు ఆహార సలహా సంఘ సమావేశం

నిడదవోలు : మండలస్థాయి ఆహార సలహా సంఘం, విజిలెన్స్ కమిటీ సమావేశం సోమవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించనున్నారు.సమావేశానికి కొవ్వూరు రెవెన్యూ డివిజనల్ అధికారి బి. శ్రీనివాసరావు అధ్యక్షతన ఈ సమావేశం జరగనుందని ఆహార సలహా సంఘం, విజిలెన్స్ కమిటీ సభ్యులంతా హాజరు కావాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు కోరారు.

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

నిడదవోలు	: 83410 21222
నిడదవోలు రూరల్	: 9491713669
పెరవలి	: 9493448995
ఉండ్రాజవరం	: 98664 24817

సినిమా గైడ్

నిడదవోలు :

వీరభద్ర	ఆనందోబ్రహ్మ
రాధాకృష్ణ	నేనేరాజు నేనే మంత్రి
గణపతి	జయజానకీ నాయక



మరమ్మతులు చేసినా మళ్లీ గొయ్యి ఏర్పడిన దృశ్యం

షరామామూలే..

మరమ్మతులు చేపట్టినా ఫలితం శూన్యం

రోడ్లు వాహనదారుల పాలిట యమపాశాలుగా మారాయి.. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రజలు వాపోతున్నారు. ఏ సమయంలో చేయాల్సిన పనులు అప్పుడే చేయాలని, వేసవిలో చేపట్టాల్సిన మరమ్మతులు వర్షాకాలంలో చేపట్టినా ఫలితం లేదని పేర్కొంటున్నారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలకు స్పందించి మరమ్మతులు చేపట్టినా వర్షాలకు మళ్లీ గోతులు దర్శనమిస్తున్నాయి.. అధికారుల పనితీరుపై పలువురు పెదవి విరుస్తున్నారు. మేలో చేపట్టాల్సిన మరమ్మతులను ఆగస్టు మొదటి వారంలో నిర్వహించడమే అధికారుల పనితీరుకు నిదర్శనమని పలువురు ఆరోపిస్తున్నారు. గోతులను పూడ్చి రోడ్డు ప్రమాదాలను నివారించాల్సిందిగా వాహనచోదకులు అధికారులను కోరుతున్నారు. **- నిడదవోలు రూరల్**



బాధిత కుటుంబానికి సాయం చేస్తున్న శ్రీనివాసరావు

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి సాయం

కాటకోటేశ్వరం (నిడదవోలు రూరల్) : కాటకోటేశ్వరంలోని అగ్ని ప్రమాద బాధిత కుటుంబాన్ని పెరవలి నీటి సంఘం అధ్యక్షుడు బూరుగుపల్లి శ్రీనివాసరావు ఆదివారం పరామర్శించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకుని సాయాన్ని అందజేశారు. ఆయన వెంట టీడీపీ మండలాధ్యక్షుడు మారిశెట్టి వీరవెంకట సత్యనారాయణ, కొమ్మిన వెంకటేశ్వరరావు, సర్పంచ్ పోలిమాటి వీరాస్వామి, కైకరపు రత్నం, బండారు రాము, బండారు రామారావు, సూరిపండు, కోరశీక చంద్రమౌళి, మల్లుల ప్రసాదు, టి.బాబి, మధుబాబు, బుజ్జి, పాపారావు పాల్గొన్నారు.



మేల్కొలుపు యాత్ర నిర్వహిస్తున్న కాపు సంఘ నాయకులు

పందలపర్రులో కాపుల మేల్కొలుపు యాత్ర

పందలపర్రు(నిడదవోలు రూరల్) : కాపులను బీసీల్లో చేర్చాలని కోరుతూ ముద్రగడ చేస్తున్న పాదయాత్రకు మద్దతుగా పందలపర్రులో శ్రీకృష్ణదేవరాయ సేవా సంఘం ఆధ్వర్యంలో మేల్కొలుపు యాత్ర ఆదివారం నిర్వహించారు. కాపులను బీసీల్లో చేర్చాలంటూ ముద్రగడ చేస్తున్న పోరాటంలో న్యాయముందని ముద్రగడ చేస్తున్న పోరాటానికి మద్దతుగానే మేల్కొలుపు యాత్ర నిర్వహించామన్నారు. ఈయాత్రలో గలిగొండ బాపన్న, అత్తిలి వాసు, ఘంటా రామకృష్ణ, పి.రామకృష్ణ, పల్లా మాణిక్యం, సి.హెచ్.శ్రీకాంత్, గోపిరెడ్డి శ్రీనివాసు, నరేష్, కర్రి వినోద్, జి.చిట్టిబాబు, పి.సుబ్బారాయుడు పాల్గొన్నారు.

నేడు సోపానం ఇంటర్వ్యూలు

సమిశ్రగూడెం(నిడదవోలు రూరల్) : స్వయం ఉపాధి సోపాన రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సమిశ్రగూడెం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిడదవోలు బ్రాంచ్ అధికారులచే ఇంటర్వ్యూలు నిర్వహించబడునని మండల ప్రజా పరిషత్ అధికారి అబ్బిరి ఆంజనేయులు తెలిపారు. ఎంపికైన లబ్ధిదారులు రెండు ఖాతాలు ప్రారంభించేందుకు అవసరమైన డేటాతో హాజరుకావాలని ఆంజనేయులు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో కోట సత్తెమ్మ

కోట సత్తెమ్మకు ప్రత్యేక పూజలు

నిడదవోలు : తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూలతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై, ధూపహారతి, నిత్యార్చన, లలిత పారాయణం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక, ఉచిత దర్శనం, క్షీర, మహానివేదన చేశారు. అమ్మవారికి ఆదివారం ఒక్కరోజు రూ.53,500 ఆదాయం లభించిందని కార్యనిర్వహణాధికారి పాతూరి లోకేశ్వరి తెలిపారు.

అదుపు తప్పి కారు బోల్తా

తాళ్ళపాలెం (నిడదవోలు రూరల్) : వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి పొలాల్లోకి బోల్తా కొట్టిన సంఘటన నిడదవోలు మండలం తాళ్లపాలెంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం యానాం నుంచి విజయవాడ వెళ్తున్న కారు నిడదవోలు మండలం తాళ్లపాలెం వద్ద అదుపుతప్పి పొలాల్లోకి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో కారులోని ఇరువురు ఎటువంటి గాయాలు తగలకుండా క్షేమంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



చెట్టును ఢీకొట్టి ఆగిన కారు

సమ్మెతో ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు

నిడదవోలు : గ్రామీణ ప్రాంతాల్లోని బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ల సమ్మె కారణంగా సేవలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని నిడదవోలు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ఎస్.వి.ఎ.కె.కుమార్ తెలిపారు. ఈ నెల 16 నుంచి గ్రామీణ డాక్ సేవక్‌కు చెందిన ఒక యూనియన్ పిలుపు మేరకు జరుగుతున్న సమ్మెతో ప్రజలకు ఎటువంటి ఇబ్బందీ తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ముఖ్యంగా సేవింగ్స్ ఖాతాలకు సంబంధించి లావాదేవీలకు, గ్రామీణ తపాల జీవిత బీమాకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా సమీపంలోని సబ్ పోస్టాఫీసుల ద్వారా లావాదేవీలు జరుపుకోవచ్చని కుమార్ తెలిపారు.



విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

రాజీవ్‌గాంధీ జయంతి

నిడదవోలు : రాజీవ్‌గాంధీ భారత దేశాన్ని సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చేసి అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కాంగ్రెస్ పట్టణ నాయకులు పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని స్థానిక పాత పంగిడి రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.వి.వి.సత్యనారాయణ, చిన్నం మురళీకృష్ణ, ఇ.వెంకట సత్యనారాయణ, ధరణీపతి, షేక్ ఖాసిం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ నాయకులు

మైనార్టీల సంక్షేమానికి వైఎస్సార్ కృషి

నిడదవోలు : దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మైనార్టీలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించారని వైసీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎం.డి.అస్లాం అన్నారు. ఆదివారం నిడదవోలులోని వైసీపీ కార్యాలయంలో వైసీపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే జిల్లా అంతటా పట్టణ, మండల కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. నిడదవోలు పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేక్ మసాన్ వలి, ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ హఫీజ్, కార్యదర్శిగా ఇజహార్ అహ్మద్, సహాయ కార్యదర్శిగా అప్సర్ జానీబేగ్ మరో 20 మంది కార్యవర్గ సభ్యులను నియమించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు మద్దిపాటి ఫణీంద్ర, పెంటపాటి ప్రసాద్, షేక్ చాన్ బాషా, గాజుల రంగారావు, గోపిరెడ్డి శ్రీనివాస్, షేక్ వజీరుద్దీన్, ఎం.డి.ఫయాజ్, ఎం.డి.ఇంతియాజ్, ఆరుగొల్లు వెంకటేశ్వర్లు, కొనగళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

పెరవలి : నూతనంగా ఎన్నికైన బీజేపీ మండల కమిటీ సభ్యులు, అనుబంధ కమిటీలు పార్టీ బలోపేతానికి మరింతగా కృషి చేయాలని కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు, క్వాయర్ బోర్డు డైరెక్టర్ పెన్మెత్స సుబ్రహ్మణ్య వర్మ పేర్కొన్నారు. తీపర్రులోని ఈద్పుగంటి రత్తమ్మ ధర్మ సత్రంలో నిడదవోలు, తణుకు, ఆచంట మండలాలకు సంబంధించి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం చేస్తున్న కృషిని ప్రచారం చేయాలని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల నాటికి పార్టీ మరింతగా బలపడేలా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జి సింహాద్రి సత్యనారాయణ, తణుకు నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లిన రాధాకృష్ణ, ఆచంట నియోజకవర్గ ఇన్‌చార్జి కపర్థి, జిల్లా ప్రధాన కార్యదర్శి తాతాజీ పాల్గొన్నారు.



ఆర్టీసీ సమాచారం



నరసాపురం నుంచి ఇతర ప్రాంతాలకు

సర్వీసు పేరు	సమయం
హైద్రాబాద్	రాత్రి 7.15. 7.45, 8.00
విశాఖ	మధ్యాహ్నం 12.00, రాత్రి 8.00, 10.00
తిరుపతి	ఉదయం 10.30
భద్రాచలం	ఉదయం 6.15
పామర్రు	సాయంత్రం 2.45
కాకినాడ	ఉదయం 5.00, మధ్యాహ్నం 1.00
ద్వారకాతిరుమల	ఉదయం 5.30
అశ్వారావుపేట	ఉదయం 7.30
మచిలీపట్నం	ఉదయం 6.30, మధ్యాహ్నం 1.30
జంగారెడ్డిగూడెం	ఉదయం 5.00
కమలాపురం	ఉదయం 4.00, మధ్యాహ్నం 2.15
సత్తుపల్లి	ఉదయం 4.00, 5.15
నాగాయలంక	మధ్యాహ్నం 1.45

రాజమండ్రి(ఉదయం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రతి అరగంటకు ఒక సర్వీస్)

ఏలూరు (ఉదయం 5 గంటల నుంచి రాత్రి 8 గంటలకు ప్రతి అరగంటకు ఒక సర్వీస్)



నరసాపురం నుంచి రైళ్ల వివరాలు

నెంబర్	రైలు పేరు	సమయం
77265	నిడదవోలు	ఉ. 4.20
57382	గుంటూరు (ఫాస్ట్ ప్యాసింజర్)	ఉ. 6.05
77203	గుడివాడ	ఉ. 7.45
17241	విశాఖ (సింహాద్రి ఎక్స్‌ప్రెస్)	ఉ. 10.00
17213	నాగర్‌సోల్ (ఎక్స్‌ప్రెస్)	ఉ. 10.25
57316	గుంటూరు ప్యాసింజర్	మ. 12.40
77025	భీమవరం	మ. 3.55
17404	తిరుపతి ఎక్స్‌ప్రెస్	సా. 5.15
17255	హైద్రాబాద్ ఎక్స్‌ప్రెస్	రా. 6.55
77241	రాజమండ్రి	రా. 7.45
57264	విశాఖ పాస్ట్‌ప్యాసింజర్	రా. 11.05

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

నరసాపురం : 99854 08990
,, రూరల్ : 80087 07494
నరసాపురం అర్బన్ : 9491018919
మొగల్తూరు : 92474 93435

సినిమా గైడ్ :

నరసాపురం :

అన్నపూర్ణ	నేనే రాజు నేనే మంత్రి
రాజరాజేశ్వరి	జయ జానకీ నాయక
కనకదుర్గ	లై

మొగల్తూరు :

శ్రీదేవి జానకి	జయ జానకీ నాయక
శ్రీదేవి జానకి మినీ	నేనే రాజు నేనే మంత్రి

ఆగని ఆందోళనలు

ఇంకా తెరుచుకోని నాలుగు మద్యం దుకాణాలు, రెండు బార్లు
తలలు పట్టుకుంటున్న ఎక్సైజ్ అధికారులు

నరసాపురం : మద్యం షాపుల ఏర్పాటుపై పట్టణంలో ఆందోళనలు ఇంకా కొనసాగుతునే ఉన్నాయి. ప్రతిరోజు ఏదో ఒక చోట ధర్నాలు, ఆందోళనలు చేస్తుండడంతో అధికార యంత్రాంగానికి తలనొప్పిగా మారింది. ఇప్పటి వరకు పట్టణ పరిధిలో మూడు షాపులను మాత్రమే ఏర్పాటు చేశారు. ఇంకా నాలుగు దుకాణాలు, రెండు బార్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. వీటి ఏర్పాటుకు లెసెన్స్‌దారులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. నివాసాల మధ్య షాపుల ఏర్పాటుపై మహిళలతో పాటు పరిసర ప్రాంత ప్రజలు కూడా అడ్డుకుంటున్నారు. సబ్ కలెక్టర్, ఎక్సైజ్ కార్యాలయాల వద్ద ధర్నా చేసి నిరసన తెలియజేస్తున్నారు. ఇటు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందిస్తున్నారు. రెండు రోజుల కిందట పాతబజార్‌లో మసీదుకు సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం తొలగించాలని ముస్లిం సోదరులు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. వారం రోజుల కిందట చలవపేటలో బార్ ఏర్పాటు చేసేందుకు సిద్ధం అవుతుండగా స్థానికులు సబ్ కలెక్టర్‌ను కలసి నివాసాల మధ్య అనుమతించవద్దంటూ విన్నవించారు. తాజాగా శనివారం రాత్రి 26వ వార్డులో మద్యం షాపు తెరిచేందుకు చేసిన ప్రయత్నాన్ని మహిళలు అడ్డుకున్నారు. తెచ్చిన స్టాక్‌ను ధ్వంసం చేశారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. లెసెన్స్‌దారుడు పోలీస్ కేసు కూడా పెట్టారు. దీంతో ఆందోళనకారులు ఆదివారం ఎమ్మెల్యే మాధవనాయుడును కలిశారు. తాము వద్దంటున్నా షాపును ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసం అంటూ ఆవేదన వెలుబుచ్చారు. తమపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని కోరారు. దీంతో మద్యం షాపుల ఏర్పాటు ఎక్సైజ్ అధికారులకు గుదిబండగా మారింది.

నివాసాల మధ్య షాపు ఏర్పాటు తగదు

జన నివాసాల మధ్య మద్యం షాపులు ఏర్పాటు సరికాదు. దీని వల్ల మహిళలు రోడ్లపై తిరగలేరు. కళాశాలకు వెళ్లే విద్యార్థినులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. షాపులు దగ్గరగా ఉంటే మద్యానికి మరింత బానిసయ్యే అవకాశం ఉంది. ఊరుకు చివరిలో షాపులు ఏర్పాటు చేసుకోవాలి. నివాసాల మధ్యలో ఎట్టి పరిస్థితుల్లో అనుమతించం.



- కంబాల కుమారి, 26వ వార్డు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన మహిళలు

మెగాస్టార్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

ఎమ్మెల్యే మాధవనాయుడు



అభిమానులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మాధవనాయుడు

నరసాపురం టౌన్ : ఒక సాధారణ కుటుంబంలో జన్మించి కృషి, పట్టుదల, స్వయం కృషితో సినీ, రాజకీయ రంగాల్లో రాణించిన మెగాస్టార్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవనాయుడు అన్నారు. ఆదివారం చిరు జన్మదిన వేడుకల్లో భాగంగా స్టీమర్‌రోడ్‌లోని మల్లిపూడి ప్లాజాలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి రక్తదానం చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఎంత ఎదిగినా... ఒదిగి ఉండడం చిరును చూసి నేర్చుకోవాలన్నారు. మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. డాక్టర్ ప్రకాష్, మరోఅతిథి డాక్టర్ బళ్ళ మురళి మాట్లాడుతూ చిరు అభిమానులు వైద్య శిబిరాలు నిర్వహిస్తే ఉచితంగా వైద్య సేవలందిస్తామన్నారు. అనంతరం అభిమాన సంఘం సీనియర్ నాయకులైన గుగ్గిలపు బుజ్జి, బళ్ళ సత్తిబాబు, దివి సత్యన్, గ్రంధి శ్రీను, పులపర్తి ప్రతాప్, కునా వెంకన్న, కర్నేని లక్ష్మీనారాయణలను ఘనంగా సన్మానించారు. రాష్ట్ర అభిమాన సంఘం నాయకులు కోపల్లి శ్రీనివాస్, యాదంరెడ్డి సుబ్బారావు, కొండేటి నాగశ్రీను, చెన్నంశెట్టి నాగు, శ్రీనివాస్, కూనపరెడ్డి రామకృష్ణ, జిలాని, జొన్నలగడ్డ సతీష్, కొట్టు బాబి, వీసీ పొన్నాల నాగబాబు, టీడీపీ నాయకులు రాయుడు శ్రీరాములు, కొప్పాడ రవి, కొల్లు పెద్దిరాజు, పతివాడ మార్కండేయులు, కోరాడ పాపారావు పాల్గొన్నారు.

అవినీతి పాలనకు సీఎం చంద్రబాబు నిలువెత్తు నిదర్శనం

మాజీ ఎమ్మెల్యే ప్రసాదరాజు



నరసాపురం : రాష్ట్రంలో అవినీతి పాలన జరగడానికి సీఎం చంద్రబాబే నిలువెత్తు నిదర్శమని మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఎద్దేవా చేశారు. ఆదివారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ మూడేళ్ల పాలనలో చంద్రబాబు కట్టింది అవినీతి ప్రాజెక్టులేనని విమర్శించారు. ఆయన అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సంక్షేమాన్ని మరిచి అవినీతి, నీచ రాజకీయాలు చేస్తున్నారన్నారు. రాయలసీమకు ప్రాజెక్టులు కడితేనే సాగునీరు అందుతున్న ఉద్దేశంతో దివంతనేత రాజశేఖర్‌రెడ్డి యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారన్నారు. కానీ చంద్రబాబు మాత్రం గాలేరు నగరి, హంద్రీనీవా, తెలుగు గంగ వంటి ప్రాజెక్టులను పూర్తి చేయలేకపోయారన్నారు. చంద్రబాబు కనీసం వెయ్యి ఎకరాలకు సాగునీరు అందించారా..? అంటూ టీడీపీ నేతలకు సవాల్ విసిరారు. కమీషన్లను కక్కుర్తిపడి తనయుడు లోకేష్‌కు ప్రాజెక్టులు అప్పగిస్తున్న ఘనత అయనకే దక్కిందన్నారు. నంద్యాల ఎన్నికల్లో ప్రభుత్వం ఎన్ని కుత్రాలు పన్నినా... సైకిల్‌కు ఫంచర్ కావడం ఖాయమన్నారు. చంద్రబాబు మోసపూరితమైన హామీలను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. టీడీపీ నంద్యాల ఎన్నికల్లో ఎన్ని వేషాలు వేసినా వైసీపీకి పట్టం కడతారన్నారు. నంద్యాల గెలుపు 2019 ఎన్నికలకు నాంధి అవుతుందన్నారు.

'చలో కిర్లంపూడి'కి తరలివెళ్లిన కాపు నాయకులు



కిర్లంపూడి బయలు దేరుతున్న కాపు సంఘం నాయకులు

నరసాపురం టౌన్ : కాపులను బీసీ జాబితాలో చేర్చాలంటూ కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం చేస్తున్న ఆందోళనకు సంఘీభావం తెలిపేందుకు ఆదివారం తీరం ప్రాంతం నుంచి కిర్లంపూడికి భారీగా కాపు సోదరులు తరలివెళ్లారు. పట్టణ, మండల, మొగల్తూరు ప్రాంతాల నుంచి తరలివచ్చిన కాపు సోదరులు ముందుగా తెలగ కల్యాణ మండపం వద్దకు చేరుకున్నారు. అక్కడ కొద్ది సేపు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు చినమిల్లి రాయుడు మాట్లాడుతూ ఎన్నికల్లో కాపులను బీసీలో చేరుస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి విస్మరించడం సరికాదన్నారు. కమిషన్ పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తుందే తప్ప ఇచ్చిన హామీని మాత్రం నెరవేర్చడం లేదన్నారు.

60 కార్లలో కిర్లంపూడికి..

60 కార్లలో కాపు సోదరులంతా కిర్లంపూడికి ర్యాలీగా బయలు దేరి వెళ్లారు. ర్యాలీని నియోజకవర్గ కన్వీనర్ కోటిపల్లి సురేష్ జెండా ఊపారు. సంఘం నాయకులు జీవీకే రామారావు, తమ్మిశెట్టి బాబ్జి, పాలంకి ప్రసాద్, కోటిపల్లి బ్రహ్మానందం, అడబాల అయ్యప్పనాయుడు, మేడిద రాము, గుగ్గిలపు మురళి, పోలిశెట్టి మధు, లంకలపల్లి నాగేశ్వరరావు, తోట శ్రీధర్, దాసరి శ్రీను, చెన్నా రమేష్, దినేష్, తాతాజీ, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

నరసాపురం రూరల్ : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సర్పంచ్ కొట్టు వెంకట్రావు అన్నారు. ఆదివారం పసలదీవి గ్రామంలో మొక్కల పెంపకం కార్యక్రమం చేపట్టారు. ఎంపీపీ వాతాడి కనకరాజు రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలే అధారమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొట్టు వెంకట్రావు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు వేములదీవిలో వైద్య శిబిరం

నరసాపురం రూరల్ : మెగాస్టార్ జన్మదిన వేడుకల్లో భాగంగా సోమవారం వేములదీవి గ్రామంలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చిరు, పవన్ అభిమాన సంఘ మండల అధ్యక్షుడు కొండేటి నాగశ్రీను తెలిపారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే జానకీరామ్, డాక్టర్ ప్రకాష్ ముఖ్య అతిథులుగా విచ్చేస్తారన్నారు. ఈ శిబిరాన్ని తీర ప్రాంత ప్రజలు స్వదినియోగపర్చుకోవాలని ఆయన కోరారు.



సభలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రత్నమాల

ఉల్లాసంగా 'హ్యాపీ సండే'

నరసాపురం టౌన్ : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన 'హ్యాపీ సండే' ఉత్సాహంగా.... ఉల్లాసంగా సాగింది. పురపాలక ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు కేరింతలు కొట్టించాయి. స్వచ్ఛ భారత్‌పై కమిషనర్ రమణ రచించిన గీతం మనస్సుకు హత్తుకుపోయే విధంగా ఉంది. సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ హ్యాపీ కార్యక్రమం చివరివరకు సందడిగా సాగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రత్నమాల మాట్లాడుతూ ఉద్యోగుల్లో ఒత్తిళ్లను తగ్గించాలని ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమం సెలవు రోజున శాఖల్లోని ఉద్యోగులందరిని ఒక చోటకు తీసుకొచ్చిందన్నారు. వీసీ పొన్నాల నాగబాబు, ఆర్వో శివాజీ, డీఈ శ్రీకాంత్, ఆర్ఐ భద్రి, శ్రీమన్నారాయణ, సత్యనారాయణ, ఉపాధ్యాయులు కేఆర్ మురళి, కె.నారాయణరావు, అంజిబాబు, టీవీ సత్యవతి, అఫీజుల్లా పాల్గొన్నారు.



విద్యార్థినులు



పందుల జోరు.. జనం బేజారు

- పలు గ్రామాల్లో స్వైర విహారం
- వీధి లైట్లు లేక జనం ఆందోళన
- నిర్మూలనకు వినతి



ఇళ్ల వద్ద సంచరిస్తున్న పందులు

యలమంచిలి: పందుల స్వైర విహారంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని అబ్బిరాజుపాలెం, ఇలపకుర్రు, బూరుగుపల్లి, దొడ్డిపట్ల శివారు, కుమ్మరి వారిపాలెం, శెట్టిబలిజపాలెం, సుంకరపాలెం, గుంపర్రు, లంక పొలం, బూరుగుపల్లి, కట్టుపాలెం, గంగడపాలెం ఇంకా పలుగ్రామాల్లో పందులు స్వైర విహారం చేస్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో వీధిలైట్లు వెలగకపోవడం, పందులు పెరిగిపోవడంతో తమపై దాడి చేస్తాయేమోనని పలువురు భయాందోళన చెందుతున్నారు. తెల్లవారితే చాలు గుమ్మాల్లోకి వచ్చి పరిసరాలను ఛిద్రం చేయడమే కాక అదిలించినా కదలడం లేదని దీంతో పిల్లలకు ఏం హానికలుగుతోందనని పలువురు మహిళలు ఆందోళన చెందుతున్నారు. మట్లపాలెం గ్రామంలో పందుల ఆవాసాలు ఉండటంతో పందులు ఇలపకుర్రు, దొడ్డిపట్ల గ్రామాలకు వచ్చి సంచరిస్తున్నాయని, అదేవిధంగా పొలాలను సైతం నాశనం చేస్తున్నాయని పలువురు రైతులు ఆవేదనతో చెబుతున్నారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టడంతో చెత్తా చెదారం తగ్గి పందులకు ఆహారం దొరకక ఇండ్లపై దండెత్తుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వాటి నిర్మూలనకు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

స్టూడెంట్ వాయిస్



మొక్కల సంరక్షణపై అవగాహన కల్పించాలి

ఎం. పవన్‌కుమార్,
బిఎస్సీ విద్యార్థి, పాలకొల్లు

వర్షాకాలంలో నాటిన మొక్కలు బాగా పెరుగుతాయి. అయితే ట్రీ గార్డులు ఏర్పాటు చేయాలి. లేకుంటే పడిన శ్రమ వృథా అవుతుంది. పాఠశాల ఆవరణతో పాటుగా ఇంటి పరిసరాల్లో కూడా మొక్కలు నాటడాన్ని విద్యార్థి దశ నుంచి అలవాటు చేయడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకునే అంశంలో విద్యార్థులను భాగస్వాములుగా చేయవచ్చు. చదువులతోపాటు మొక్కలను సంరక్షిచడం, పెంచడంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. వారానికి రెండు క్లాస్‌లు అయినా మొక్కల విశిష్టతను తెలియజేసేందుకు సమయాన్ని కేటాయించాలి మొక్కలు నాటి సంరక్షించడం వల్ల భవిష్యత్తులో విద్యార్థులకు వాటిపై మమకారం ఏర్పడుతుంది.

● పాలకొల్లు రూరల్

ఆరోగ్యానికి, ఆనందానికి యోగా మార్గదర్శిని



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న యోగా గురువు

పాలకొల్లు అర్బన్: నేడు సమాజంలో ఉన్న ఒత్తిడిలు మానవ జీవితంపై ప్రభావం చూపిస్తున్నాయి. దీనిని ఎదుర్కొనేందుకు యోగా ఒక్కటే మార్గదర్శినిగా చెప్పుకోవచ్చునని భగవాన్ శ్రీ సత్య సాయిబాబా యోగా గురువు వీరస్వామి గురూజీ అన్నారు. స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్న శ్రీ సత్యసాయి ఆదిత్య యోగా తరగతుల ప్రారంభ కార్యక్రమంలో గురూజీ మాట్లాడుతూ జీవితంలో అభివృద్ధి చెందడం ఎంతో అవసరమని అందుకు ప్రశాంత జీవనం తప్పనిసరి అన్నారు. వృత్తిలో పోటీతత్వం, వ్యాపారాల్లోను, చదువుల్లోనే ఉండే ఒత్తిడులను ఎదుర్కొనేందుకు మనశ్శాంతి అవసరమని ఇందుకు వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అందులో ముఖ్యమైనవి యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం అని పేర్కొన్నారు. యోగా తరగతులు సోమవారం నుంచి 29వ తేది వరకు ప్రతి రోజూ ఉదయం 5గంటల నుండి 7గంటల వరకు, సాయంత్రం 6గంటల నుండి 8 గంటల వరకు నిర్వహిస్తున్నామని ఈ కోర్సు పూర్తి వివరాలకు సంప్రదించాలని కోరారు. ఈ అవగాహన తరగతుల్లో సుమారు 150 మంది పాల్గొన్నారు.



కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

సాంకేతిక విజ్ఞాన అభివృద్ధికి..
రాజీవ్ సేవలు చిరస్మరణీయం : బాబ్జి

పాలకొల్లు అర్బన్: దేశంలో సాంకేతిక విజ్ఞాన అభివృద్ధికి మాజీ ప్రధాని, దివంగత రాజీవ్‌గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి వర్ధినీడి బాబ్జి అన్నారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు యడ్ల శివాజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాబ్జి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీనియర్ నాయకుడు బోణం వెంకట్రావు తదితరులు ప్రసంగించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక గాంధీబొమ్మల సెంటర్‌లో ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి, గజలక్ష్మి థియేటర్ వద్ద ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా లీలాకల్యాణం

పాలకొల్లు అర్బన్: ఆదివారం మాసశివరాత్రి సందర్భంగా స్థానిక క్షీరారామలింగేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి లీలా కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ఏకవార రుద్రాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని లక్ష ముత్యాలతో అలంకరించారు. పట్టణానికి చెందిన భక్తులు పలువురు కళ్యాణాన్ని జరిపించారు. ముందుగా స్వామివారిని, అమ్మవారిని పల్లకిలో ఉంచి మాడవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమాల్లో ఈవో భద్రాజీ, సిబ్బంది, ట్రస్టీలు, అర్చకులు మల్లికార్జున శర్మ, నాగబాబు, క్రిష్టప్ప, పూర్ణయ్య, అభిషేక పండితులు భవిడిపాటి వెంకన్న, మద్దూరి సూరిబాబు, భక్తులు పాల్గొన్నారు.

కోడిగట్టులోని శ్రీశంకరమఠంలో కాశీ విశ్వేశ్వరునికి అభిషేకాలు, అన్నపూర్ణదేవికి కుంకుమ పూజలు, శంభన్న అగ్రహారంలోనే శంభేశ్వర స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

ఇలపకుర్రు పాఠశాలకు అవార్డుపై హర్షం

యలమంచిలి: ఇలపకుర్రు గ్రామంలో ఐదెకరాల విశాలమైన మైదానంలో చిలువూరి కుమార దత్తాత్రేయ వర్మ పేరిట నిర్మితమైన జడ్పీ పాఠశాల స్వచ్ఛ విద్యాలయంగా ఎంపిక కావడం ఆనందంగా ఉందని ప్రధానోపాధ్యాయుడు చింతా చిట్టిబాబు పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థులకు సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం తయారుచేసే విధానం, గదుల శుభ్రత, ఉపాధ్యాయుల బోధన విధానం తదితర అంశాలను పరిశీలించిన రాష్ట్ర, కేంద్ర బృందాల నివేదికతో ఇలపకుర్రు జడ్పీ పాఠశాలకు స్వచ్ఛ విద్యాలయ జాతీయ అవార్డుకు ఎంపికైందని వివరించారు. స్వచ్ఛ విద్యాలయ జాతీయ అవార్డుకు తమ స్కూల్ ఎంపిక కావడం పట్ల సర్పంచ్, ఏఎంసీ మాజీ చైర్మన్, స్కూల్ భవన నిర్మాణ దాత చిలువూరి కుమార దత్తాత్రేయ వర్మ హర్షం వ్యక్తం చేశారు.

నేడు శివాలయంలో పూజలు

యలమంచిలి: అబ్బిరాజుపాలెం శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. స్వామివారికి అభిషేకాలు నిర్వహించి, పంచామృతాలతో పూజలు నిర్వహించనున్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం అఖండ అన్నసమారాధన జరుగుతుందని .నిర్వాహకులు తెలిపారు.



అత్యధికంగా రక్తదానం చేసిన వారికి మెమెంటోలిస్తున్న సీఐ కృష్ణకుమార్

అభిమానుల రక్తదానం భేష్

పాలకొల్లు: రేపు సినీ హీరో చిరంజీవి పుట్టినరోజును పురస్కరించుకుని పట్టణంలో రాష్ట్ర చిరంజీవి యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి తులా రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం స్థానికంగా చిరు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పట్టణ సీఐ బి. కృష్ణకుమార్ పాల్గొని కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ కృష్ణకుమార్ మాట్లాడుతూ చిరంజీవి అభిమానులు రక్తదాన కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా అత్యధికంగా రక్తదానం చేసిన 40 మంది చిరంజీవి అభిమానులకు సీఐ కృష్ణకుమార్ మెమెంటోలు ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో తులా సురేష్, శిడగం సూరి, అంజనకుమార్, మణికంఠ డేగల వెంకటేష్, బల్లెం ప్రశాంత్‌తో పాటు గగ్గిపర్రు, వర్ధినం, అడవిపాలెం, అబ్బిరాజుపాలెం, చిక్కాల, యలమంచిలి లంక తదితర గ్రామాల నుంచి చిరు అభిమానులు చిరు జన్మదిన వేడుకల్లోను, రక్తదాన శిబిరంలోను పాల్గొన్నారు.

మానసిక వికలాంగుల పాఠశాలలో పుట్టినరోజు వేడుకలు

పాలకొల్లు: స్థానిక అంజలి మానసిక వికలాంగుల పాఠశాలలో పట్టణానికి చెంది న బోళ్ళ తేజబాబు, నీలిమా దేవి దంపతుల కుమారుడు దివాస్‌చౌదరి తొలిపుట్టిన రోజు సందర్భంగా ఆదివారం విద్యార్థులకు మిఠా యిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి విద్యార్థులకు పంచారు. మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేశారు.



విద్యార్థులకు కేక్ పంపిణీ చేస్తున్న దృశ్యం

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

పాలకొల్లు : 99854 11548
పాలకొల్లు అర్బన్ : 97053 46813
పాలకొల్లు టౌన్ : 9966374187
పాలకొల్లు రూరల్ : 92485 25459
యలమంచిలి : 94915 55894

సినిమా గైడ్ :

పాలకొల్లు :

శ్రీ అన్నపూర్ణ	ఫిదా
శ్రీనివాస	ఏజెంట్ భైరవ
శ్రీనివాస మినీ	గ్రీన్ కార్డు
శ్రీనివాసా డిజిటల్	నక్షత్రం
రంజని	ఆనందో బ్రహ్మ
దాసరి మినీ	దువ్వాడ జగన్నాథం
మారుతి	నిన్ను కోరి


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బండి ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

మొగల్తూరు: తీర ప్రాంత ప్రజల ఆరాధ్య దేవత ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. మన ప్రాంతంతో పాటు సరిహద్దు జిల్లాలైన కృష్ణా, తూర్పు గోదావరి జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తమ మొక్కుబడులైన దూపహారం, కుంభ హారాలను అమ్మవారికి నివేదించారు. భక్తులకు కావల్సిన సదుపాయాలను ట్రస్ట్ బోర్డు ఛైర్మన్, ఈవో, సిబ్బంది పర్యవేక్షించారు.

కిర్లంపూడి తరలిన కాపు నాయకులు

మొగల్తూరు: కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం చేపట్టిన నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపేందుకు మొగల్తూరు నుండి కాపు సంఘ నాయకులు ఆదివారం తరలివెళ్ళారు. కాపులను బీసీ జాబితాలో చేర్చాలని ముద్రగడ చేపట్టిన మూడవ రోజు దీక్షకు తాము మద్దతుగా వెళ్ళినట్టు పట్టణ కాపు సంఘ అధ్యక్షుడు ముక్కుపుల్లయ్య నాయుడు, తన్నీడి గిరి తెలిపారు. మండలంలోని మొగల్తూరు, రామన్నపాలెం, శేరేపాలెం, ముత్యాలపల్లి, పేరుపాలెం, కెపిపాలెం గ్రామాల నుంచి 9 ట్యాక్సీల్లో సంఘ నాయకులు కొత్తపల్లి శ్రీను, త్రినాథ్, కటికల బాలాజీ, అడ్డాల వెంకటేశ్వరరావు, ఠాగూర్, ఆకన శ్రీను ఆధ్వర్యంలో తరలివెళ్ళారు.

నేడు మంత్రి గంటాతో డీఎస్సీ '98 క్వాలిఫైడ్ టీచర్ల భేటీ

పాలకొల్లు అర్బన్: సోమవారం రాష్ట్ర రాజధానిలో విద్యాశాఖా మంత్రి గంటా శ్రీనివాస రావు, ఆ శాఖ ఉన్నతాధికారులతో డీఎస్సీ '98 క్వాలిఫైడ్ టీచర్ల రాష్ట్ర కమిటీ సభ్యులు సమావేశం అవుతున్నట్లు రాష్ట్ర ప్రసిడెంట్ వై. సుబ్బారాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్సీ '98 క్వాలిఫైడ్ టీచర్లకు ఎస్జీటీలుగా ఉద్యోగాల్లో నియమించేందుకు పాఠశాల విద్యాశాఖ ఫైల్ సిద్ధం చేసిన సందర్భంగా ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. జిల్లాకు చెందిన మంత్రి పితాని, ఎమ్మెల్యేలు రామానాయుడు, పులపర్తి రామాంజనేయులు సహకారంతో ప్రభుత్వంతో సంప్రదించేలా ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు.

వృద్ధులకు వస్త్రాలు పంపిణీ

నరసాపురం టౌన్: పట్టణంలోని బొండాలమ్మ వృద్ధాశ్రమంలో ఆదివారం బట్టలు, పండ్లు పంపిణీ చేశారు. మండలంలోని ఎల్‌బీచర్ల ఉప సర్పంచ్ గుబ్బల మార్రాజు ఆర్థిక సాయంతో వీటిని కొనుగోలు చేసి వృద్ధులకు అందించారు. కార్యక్రమంలో కొండా యాకోబు తదితరులు పాల్గొన్నారు.

గోతుల రోడ్లు... ప్రజల పాట్లు

మొగల్తూరు మండలంలోని పలు గ్రామాల్లో ఛిద్రమైన రోడ్లు
వానాకాలంతో మరిన్ని ఇబ్బందులు
బస్సు సర్వీసులు నిలిపివేశారు..
భారీగా ఆటో కిరాయిలతో వెతలు


గోతులతో వర్షం నీరు నిలిచి ఉన్న వెంప-మొగల్తూరు ఆర్ అండ్ బీ రహదారి


గోతులమయంగా మోడి-కొత్తకాయలతిప్ప రహదారి

మొగల్తూరు: మండలంలోని ఆర్ అండ్ బీ రహదారులు గోతులతో ఉండటంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల కారణంగా గోతుల్లో నీరు నిలిచి మరింత ఛిద్రమయ్యాయి. మొగల్తూరు గాంధీబొమ్మల సెంటర్ నుంచి వెంప వంతెన వరకూ గల 5 కిలోమీటర్ల రహదారి, ఇటీవల ఆర్ అండ్ బీకి బదలాయించిన పాలకమ్మ చెరువు-నవుడూరు గరువు రహదారితోపాటు కొత్తకాయలతిప్ప-పేరుపాలెం, కొత్తకాయలతిప్ప-వోడి రహదారులు గోతులతో ఉన్నాయి. ముఖ్యంగా మొగల్తూరు నుంచి వివిధ గ్రామాల ప్రజలు భీమవరం చేరుకునేందుకు వెంప రహదారి అనువైంది. గతంలో ఈ రహదారి మెరుగ్గా ఉండటంతో మండల ప్రజలు తక్కువ సమయంలో భీమవరం చేరుకునేవారు. నరసాపురం నుంచి మొగల్తూరు వెంప మీదుగా ఏలూరుకు రెండు బస్ సర్వీసులు, మొగల్తూరు నుంచి భీమవరంనకు బస్ సర్వీసులు ఉండేవి. అయితే రహదారి గోతులతో ఉండటంతో బస్ సర్వీసులు నిలిపివేశారు. దీంతో ఆసుపత్రులు, మార్కెటింగ్‌కు భీమవరం వెళ్ళలేకపోతున్నారు. మొగల్తూరు నుంచి ఆటోకు కిరాయి 21 కిలోమీటర్ల దూరానికి పగలు రూ.350లు, రాత్రి సమయంలో రూ.500 నుండి 600లు వెచ్చించాల్సి వస్తోంది. కనీసం మొగల్తూరు-వెంప, పాలకమ్మ చెరువు, కొత్తకాయలతిప్ప-పేరుపాలెం, మోడి రహదారులను పునరుద్ధరించాలని తీర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



రూ. 6 కోట్లతో ప్రతిపాదనలు పంపాం: ఎమ్మెల్యే బండారు

మొగల్తూరు నుంచి వెంప వెళ్ళే రహదారిని విస్తరించి పునః నిర్మించేందుకు రూ.6 కోట్లు అంచనాలతో ప్రభుత్వానికి పంపాం. ఇప్పటికే పరిపాలనా అనుమతులు లభించాయి. మరికొద్ది రోజుల్లో టెండర్లు పిలిచి రహదారి నిర్మాణాన్ని ప్రారంబిస్తాం. ఇతర రహదారులు పునః నిర్మాణానికి కృషి చేస్తున్నాం.


గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్, జడ్పీటీసీ తదితరులు

అర్హులైన పేదలకు గృహాలు

మొగల్తూరు: ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో గ్రామానికి మంజూరైన గృహాలు అర్హులైన పేదలకు కేటాయించాలని గ్రామసభ తీర్మానించింది. మొగల్తూరు పంచాయతీ గ్రామ సభ సర్పంచ్ కలిదిండి స్వర్ణ అధ్యక్షతన నిర్వహించారు. జడ్పీటీసీ గుబ్బల నాగరాజు మాట్లాడుతూ గ్రామానికి మంజూరైన 246 గృహాలను ఇంతవరకూ సొంత ఇల్లు లేని పేదలకు కేటాయించాలని, మంజూరైన గృహాలు వేగవంతంగా నిర్మించుకునేలా లబ్ధిదారులను చైతన్య పరచాలని సూచించారు. సమావేశంలో ఉప సర్పంచ్ కుమార్‌బాబు, జన్మభూమి కమిటీ సభ్యులు పాలా రాంబాబు, డొల్లా రత్నంరాజు, వర్ధనపు సుధాకర్, పంచాయతీ కార్యదర్శి కె.ఎం.వైభవతి, వార్డు సభ్యులు మోకా నాగశంకరం, ఏన్నాబత్తుల నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'మీ కోసం'లో సమస్యలు తెలపండి

యలమంచిలి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మీకోసం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వి. స్వామినాయుడు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని ప్రజలు వారి సమస్యలను అర్జిల రూపంలో సమర్పిస్తే పరిష్కారానికి కృషిచేయడం జరుగుతుందని తెలిపారు.

నేడు 'సోపానం' ఇంటర్వ్యూలకు

దరఖాస్తుదారులు హాజరుకావాలి

మునిసిపల్ కమిషనర్ రమణ

నరసాపురం టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్టు కమిషనర్ రమణ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆయన కోరారు.

బీచ్‌లో పర్యాటకుల సందడి

మొగల్తూరు: ఉదయం నుంచి చిరుజల్లులు పడుతున్నా ఆదివారం పర్యాటకులు పేరుపాలెం బీచ్‌కు తరలివచ్చారు. ఆదివారం కావడంతో వాతావరణం అనుకూలంగా లేకున్నా, అమావాస్య కారణంగా సముద్రం అలలు ఎగసి పడుతున్నా సముద్ర స్నానం చేసేందుకు ప్రాధాన్యత ఇచ్చారు. స్నానం అనంతరం తీరం నందు గల ఆలయాలను సందర్శించుకున్నారు.


సముద్ర స్నానం చేస్తున్న సందర్శకులు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బుద్ధావతారం రాజు

నేటి నుంచి బ్యాడ్మింటన్ పోటీలు

పాలకొల్లు అర్బన్: బ్యాడ్మింటన్‌లో పాలకొల్లుకు జాతీయ ర్యాంకుల సాధనకు కృషి చేస్తున్నామని కాస్మో కల్చరల్స్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అధ్యక్షుడు సిహెచ్ బుద్ధావతారం రాజు అన్నారు. స్థానిక కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు కాస్మోకల్చరల్ స్పోర్ట్స్ క్లబ్‌లో రాష్ట్ర స్థాయి పురుషుల, మహిళల బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. రాష్ట్ర బ్యాడ్మింటన్ సెక్రటరీ (ఈవెంట్స్) కెసిహెచ్ పున్నయ్య చౌదరి మాట్లాడుతూ రాష్ట్రం నుంచి ప్రతి ఏటా 10 మంది సభ్యులుతో కూడిన మహిళలు, పురుషుల జట్లు జాతీయ స్థాయిలో పాల్గొంటున్నారని తెలిపారు. 21 నుంచి జరిగే పోటీల్లో విజేతలు 27 నుంచి భీమవరంలో జరిగే అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. సమావేశంలో కార్యదర్శి గాంధీభగవాన్‌రాజు, గౌరవ అధ్యక్షుడు సిహెచ్ శ్రీనివాసరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె రఘురామరాజు (మున్ని), రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్ రఘుకిరన్, జిల్లా కార్యదర్శి వివి సోమరాజు, తెలంగాణా అసోసియేషన్ ప్రతినిధిగా ఉప్పలపాటి వెంకటనారాయణబాబు, గొట్టుముక్కల శ్రీనురాజు, డాక్టర్ కెఎస్‌పిఎన్ వర్మ, పిఆర్‌ఓ జిఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పావలా వడ్డీ రాయితీ ఏదీ..? / ప్రశ్నిస్తున్న డ్వాక్రా మహిళలు

యలమంచిలి: డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలకు పావలా వడ్డీ కూడా కట్టాల్సిన అవసరం లేదని కట్టిన సొమ్ము వాపసు తీసుకొవచ్చునని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని, అయితే నేటికీ ఆచరణ శూన్యమని పలువురు డ్వాక్రా మహిళలు ఆరోపిస్తున్నారు. డ్వాక్రా రుణంతో చిన్నచిన్న వ్యాపారాలు పెట్టుకుని జీవనం వెలిబుచ్చుతున్న కుటుంబాలకు సీఎం చంద్రబాబు ఇచ్చిన డ్వాక్రా వడ్డీ రాయితీ విని ఎంతో మురిసి పోయామని 18 నెలలు గడుస్తున్నా నేటికి వడ్డీ రాయితీ కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నామని, ఇంకా తమ ఖాతాల్లో జమ కాలేదని చెప్పడంతో నిరాశ చెందుతున్నామని బాడవ గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు పున్నం వెంకాయమ్మ, రావూరి సీతామహాలక్ష్మి, వినుకొండ వెంకటలక్ష్మి, ఇంటి నాగవేణి వాపోతున్నారు. ఇకనైనా పావలా వడ్డీ రాయితీ ఇస్తే వ్యాపారాలు మరింత పురోభివృద్ధి సాధించే అవకాశం ఉంటుందని పలు గ్రామాల డ్వాక్రా మహిళలు అంటున్నారు.

సత్వరమే వడ్డీ రాయితీ ఇచ్చి ఆదుకోవాలి



పావలా వడ్డీని సైతం వెనక్కు ఇచ్చేస్తున్నామని సీఎం చంద్రబాబు డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలి. పలుమార్లు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా వారు సొమ్ము రాలేదని చెబుతున్నారు. వడ్డీ రాయితీ ఇచ్చి ఆదుకుంటే తాము చేసుకునే చిన్నపాటి వ్యాపారం అభివృద్ధి చెందుతుంది.

-కాపా సావిత్రి, డ్వాక్రా మహిళ, ఇలపకుర్రు

అభివృద్ధిని అడ్డుకున్నదెవరో ప్రజలకు తెలుసు

టి.నర్సాపురం : తిరుమలదేవిపేట పంచాయతీలో అభివృద్ధిని అడ్డుకుంటున్నామని టీడీపీ నాయకులు దుష్ప్రచారం చేయడం తగదని సర్పంచ్ ఎల్లిన లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరు అభివృద్ధిని అడ్డుకుం టున్నారో ప్రజల్లోకి వెళ్లి తేల్చుకుందామన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి తీర్మానాలు ఇవ్వడం లేదని అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. గ్రామ పంచాయతీలో ఎనిమిది గ్రావెల్ రోడ్లు, ఏడు అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపీడీవోకు తీర్మానాలు ఇచ్చామన్నారు. అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు ఐసీడీఎస్ అధికారులకు, మంచినీటి సరఫరా పనులకు సంబంధించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తీర్మానాలు ఇచ్చామని తెలిపారు. ఇకనైనా అసత్య ఆరోపణలు మాని అభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు.

స్టూడెంట్ వాయిస్



విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించాలి

అల్లాడి వంశీ, పదో తరగతి
జీలుగుమిల్లి

చదువుతోపాటు విద్యార్థులు క్రమశిక్షణ అలవరచుకోవాలి. తోటి విద్యార్థులతో కలసి విద్యాభ్యాసం చేసే క్రమంలో సందేహాలను నివృత్తి చేసుకోవాలి. తెలియని సబ్జెక్టులపై పట్టు సాధించేందుకు పరీక్షల సమయంలోనే కాక మొదటి నుంచి కృషి చేయాలి. సందేహాల్ని ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులు దృష్టికి తీసుకెళ్లాలి. తద్వారా మంచి ఉత్తీర్ణతను సాధించాలి. గ్రామీణ ప్రాంతంలో చదువుకునే విద్యార్థుల్లో ఆంగ్ల భాషపై పట్టు తక్కువగా ఉంటోంది. తక్కువ మార్కులు సాధించే విద్యార్థులపై ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలి.

● **జీలుగుమిల్లి**

జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా నాగరాజు



బి.నాగరాజు

టి.నర్సాపురం : గ్రామానికి చెందిన వర్ధమాన కవి బి.నాగరాజు జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎంపిక కావడం పట్ల అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర కార్యదర్శి వి.నాగార్జున సాగర్ హర్షం వ్యక్తం చేశారు. టి.నర్సాపురంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కృష్ణాపురం లాంటి మారుమూల ప్రాంతంలో జన్మించిన నాగరాజు 'నాగాస్త్ర' అనే కలంతో తన రచనల ద్వారా మండలానికి మంచి పేరు తెచ్చారన్నారు. ఆయన ఉన్నత శిఖ రాలు అధిరోహించాలని నాగార్జునసాగర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రచార కార్యదర్శి పురం శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం నాయకులు కొనకళ్ల రామారావు, సంఘ సేవకులు ఆకుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

కొయ్యలగూడెం : మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ జయంతిని ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ఆదివారం విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకుడు ఎ.దిలీప్ మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ దేశ అభివృద్ధి కోసం ఎన్నో ప్రణాళికలు ప్రవేశపెట్టారని, సాంకేతిక రంగంలో ఆయన తీసుకువచ్చిన మార్పుల వలన దేశం అభివృద్ధి పథంలో పయనించిందన్నారు.

ఏజెన్సీలోని చెరువులకు జలకళ

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కళకళలాడుతున్న వాగులు, వంకలు



కొయ్యలగూడెంలో నీటితో కళకళలాడుతున్న చెరువు

బుట్టాయగూడెం : ఏజెన్సీ ప్రాంతంలోని పంట చెరువులు వర్షపునీటితో నిండుకుండలా మారి కళకళలాడుతున్నాయి. చెరువులు నిండటంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. బంగాళఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా ఋతుపవనాలు చురుగ్గా కదలటంతో మూడు రోజులుగా ఏజెన్సీ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో సాగునీటి కోసం ఎదురు చూసిన రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. కుండపోత వర్షాలకు మన్యం ప్రాంతంలోని కొండ వాగులు జలకళ సంతరించుకున్నాయి. జల్లేరు కొండవాగులోని వరదనీరు కాలువల ద్వారా పంట చెరువులకు చేరుతోంది. కొమ్ముగూడెం (మొద్దుల చెరువు) చెరువు నీటితో కళకళలాడుతోంది. చెరువు కింద సుమారు 300 నుంచి 500 ఎకరాలు సాగు భూమి ఉందని, వరి పంట కన్నా వాణిజ్య పంటలను అధికంగా సాగు చేస్తామని రైతులు తెలిపారు. వరి పంటను సుమారు 100 ఎకరాల వరకు సాగుచేస్తున్నామని వారు తెలిపారు. తాళ్ల చెరువులోకి వరదనీరు పుష్కలంగా చేరు తుండటంతో కళింగి ద్వారా వరద నీరు బయటకుపోతోంది. మండలంలోని అన్ని కొండ వాగుల్లో వరదనీరు ప్రవహిస్తుండడంతో రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ప్రకృతి కరుణిస్తే రైతులు బాగుపడతారని, పది మందికి అన్నం పెట్టగల రని రైతులు అంటున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సాగునీటికి ఇబ్బందులు ఉండకపోవచ్చని రైతులు తెలియజేస్తున్నారు.



నిండుకుండలా కళకళలాడుతున్న కొమ్ముగూడెం (మొద్దుల చెరువు) పంట చెరువు

కొయ్యలగూడెం : ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు నీటితో కళకళలా డుతున్నాయి. మండలంలోని గవరవరం, పొంగుటూరు గ్రామాల మధ్య ఉన్న కామయ్యచెరువు పూర్తిగా నీటితో నిండింది. ఇప్పటివరకు నీళ్ళు లేక వెలవెలబోయిన చెరువులు ఇటీవల కురిసిన వర్షాలతో జలకళను సంతరించుకోవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నీరు-చెట్టు కార్యక్రమంలో చెరువులు అభివృద్ధి చేయడంతో మరింత నీరు నిల్వ చేరింది.

విలేకరులు వృత్తి పట్ల బాధ్యతతో వ్యవహరించాలి

జీలుగుమిల్లి : గ్రామీణ ప్రాంతంలో విలేకరులు వృత్తి పట్ల బాధ్యతతో వ్యవహరించాలని, ప్రజా సమస్యల్ని, వాస్తవాల్ని ప్రభుత్వాలకు తెలిసేలా పత్రికల్లో వార్తలు రాయాలని ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షుడు ఎన్‌వీ అప్పారావు అన్నారు. జీలుగుమిల్లి మండల ప్రెస్‌క్లబ్ ఎన్నిక ఆదివారం జడ్పీ ఉన్నతపాఠశాల వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా బొమ్మారెడ్డి దుర్గాప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా తూంపాటి రవిచంద్ర, కార్యదర్శిగా కోలా రాము, కోశాధికారిగా క్రొవ్విడి నాగేంద్రప్రసాద్, సభ్యులుగా చిట్టిబొమ్మ శ్రీనివాస్, దేవరబట్ల సత్యకుమార్, కొప్పుల కృష్ణప్రసాద్, జెట్టి రామకృష్ణ, నేలటూరి సత్యనారాయణ, మద్దిశెట్టి ఏసుబాబు, బొంతు రామారావు, ఎన్.సురేష్, ఒ.రవితేజ, ఎన్.రవి, పవన్, సాయి ఎన్నికయ్యారు.



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

వైద్య, ఆరోగ్య శాఖలో పోస్టుల భర్తీ ఎప్పుడో...?

బుట్టాయగూడెం : ఏజెన్సీ ప్రాంతంలోని వైద్య, ఆరోగ్య శాఖలో పోస్టుల కోసం దరఖాస్తు చేసుకుని సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకున్న గిరిజన అభ్యర్థులు పోస్టింగ్ కోసం రోజుల తరబడి ఎదురు చూస్తున్నారు. గత సోమవారమే పోస్టింగ్ ఆర్డర్లు ఇస్తారని అభ్యర్థులు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూసినా వారికి నిరాశే ఎదురయింది. ఉద్యోగాల భర్తీకి సంబంధించిన ప్రక్రియ మొత్తాన్ని ఐటీడీఏ పీవో ఎస్.షణ్మోహన్ ఏనాడో పూర్తి చేసి కలెక్టర్‌కు పంపారు. ఫైలును కలెక్టర్ పరిశీలించి సంతకం చేసిన వెంటనే పోస్టింగ్ ఇస్తామని డీఅండ్‌హెచ్‌వోను తెలిపారు. ఉత్తర్వులు ఆలస్యమవడంతో తమకు అన్యాయం జరుగుతుందేమోనని అభ్యర్థులు సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీ ఐదు గిరిజన మండలాల్లో స్టాఫ్ నర్సులు నాలుగు, మొదటి ఏఎన్ఎంలు ఆరు, ఫార్మాసిస్టులు ఆరు పోస్టులు కలిపి మొత్తం 16 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయగా వందలాది మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పోస్టులను అమ్ముకుంటున్నారని, లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయని వచ్చిన ఆపోహలను పీవో సీరియస్‌గా తీసుకున్నారు. అమరావతికి బదిలీ అయినా పోస్టు లను భర్తీ చేసిన తర్వాతనే ఇక్కడ నుంచి వెళతానని స్పష్టం చేసిన పీవో ఎటువంటి అపోహలకు తావు లేకుండా కేవలం మార్కులు ఆధారంగా మెరిట్ లిస్టును సిద్ధం చేశారు. మూడు ధపాలుగా వడపోత కార్యక్రమాన్ని నిర్వహించారు. అప్పటివరకు చకచక పనులు జరిగినా తర్వాత ఎందుకనో భర్తీ ప్రక్రియ మందగించింది. జిల్లా కేంద్రానికి ఫైలు చేరిన రెండు రోజుల్లో అభ్యర్థులు పోస్టింగ్ ఉత్తర్వులు అందుతాయని అధికారులు తెలిపినా నేటికీ ఆ దిశగా చర్యలు కనిపించడం లేదని వాపోతున్నారు. సమయం గడుస్తున్న కొద్ది పోస్టింగులు ఎవరికి దక్కుతాయోననే ఆందోళన అభ్యర్థుల్లో నెలకొంది. అధికారులు స్పందించి వెంటనే పోస్టులు భర్తీ చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.



అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించిన ఐటీడీఏ కార్యాలయం ఇదే

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

టి.నర్సాపురం : మండలంలోని టి.నర్సాపురం, బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఒంగోలు లోని ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌కు ఎంపికయ్యారని ఎంఈవో టి. రామ్మూర్తి తెలిపారు. టి.నర్సాపురం గ్రామానికి చెందిన తిరువీధుల శ్రీకన్య, బొర్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన శ్యామల పావని ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులను గ్రామస్థులు అభినందించారు. విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.



నూతనంగా ఎన్నికైన బీజేపీ పోలవరం మండల అధ్యక్షుడు ఘంటా శ్రీనివాస్, ఇతర సభ్యులు

బీజేపీ పోలవరం మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్

పోలవరం : భారతీయ జనతా పార్టీ పోలవరం మండల అధ్యక్షుడిగా ఘంటా శ్రీనివాస్ ఎంపికయ్యారు. పోలవరంలోని సృజల అతిథి గృహంలో ఆదివారం ఆయన మండల అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తనను పార్టీ మండల అధ్యక్షుడిగా ఎంపిక చేసిన జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌శర్మ తనను అధ్యక్షుడిగా నియమించారన్నారు. మండల పార్టీ ప్రధాన కార్యదర్శిగా పెద్దిన గణపతిని నియమించారని ఆయన తెలిపారు. మండ లంలోని పలువురు శ్రీనివాస్‌కు అభినందనలు తెలియజేశారు.



బాధిత కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్, టీడీపీ నాయకుడు సోమసుందరం తదితరులు

ఎమ్మెల్యే పరామర్శ

జీలుగుమిల్లి: ప్రమాదవశాత్తు మృతి చెందిన కుటుంబాలకు టీడీపీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని పోలవరం ఎమ్మెల్యే శ్రీనివాస్ అన్నారు. ఇటీవల ఉదయ్‌భాస్కర్ కాలనీలో పొలంలో పని చేస్తూ పాముకాటుతో కాకర్ల సోమరాజు మృతి చెందారు. ఆయన కుమారులు వెంకటేశ్వరావు, దుర్గారావును ఆదివారం ఎమ్మెల్యే పరామర్శించి వారితో మాట్లాడారు. చంద్రన్న బీమా వర్తించేలా చూస్తానని, టీడీపీ పార్టీ సభ్యత్వం ఉంటే తగిన సాయం అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. వంకవారిగూడెంలో రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లైన్‌మెన్ కాకర్ల భాస్కర్, ఇటీవల మృతి చెందిన గరిమళ్ల రామకృష్ణ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే శ్రీనివాస్ టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఉండవల్లి సోమసుందరంతో కలసి పరామర్శించారు.



స్టూడెంట్ వాయిస్



సౌకర్యాలు మెరుగుపర్చాలి

పి. బాలు, డిగ్రీ విద్యార్థి, తణుకు

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యా ప్రమాణాలు మరింతగా మెరుగుపరచాలి. విద్యార్థులకు ప్రభుత్వం ఉపాధి కల్పించే విధంగా కోర్సులను ప్రవేశపెట్టాలి. కోర్సు పూర్తి చేసిన వెంటనే ఉపాధి కల్పిస్తే నిరుద్యోగ సమస్య తగ్గే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించడంతో పాటు సంబంధిత సబ్జెక్టుకు సంబంధించిన నిపుణులను నియమించాలి. మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలి.

● తణుకు

గ్యాస్ సమాచారం

■ సుబ్బారావు అండ్ కో హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో ఈ నెల 13,14 తేదీల్లో గ్యాస్ నమోదు చేసుకున్న వారికి ఈ నెల 21న డెలివరీ ఇస్తారు.. ఫోన్‌: 222144, 222534

■ దుర్గా ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీలో ఈ నెల 15,16 తేదీల్లో బుక్ చేసిన వారికి ఈ నెల 21న డెలివరీ ఇస్తారు.ఫోన్ : 224330

■ సందీప్ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో ఈ నెల 15,16 తేదీల్లో గ్యాస్ నమోదు చేసుకున్న వారికి ఈ నెల 21న డెలివరీ ఇస్తారు. ఫోన్ : 229776. - తణుకు

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

తణుకు	:	9985411556
తణుకు టౌన్	:	9652889592
తణుకు అర్బన్	:	9966228918
అత్తిలి	:	9848964821
ఇరగవరం	:	9652889592

సినిమా గైడ్

తణుకు :

లక్ష్మి	జయ జానకి నాయక
మినీ లక్ష్మి	లై
నరేంద్ర	నేనే రాజు..నేనే మంత్రి
మినీ నరేంద్ర	శమంతకమణి
శ్రీచిత్ర	అనబెల్
వెంకటేశ్వర	ఆనందో.. బ్రహ్మ
ప్రత్యూష	ఫిదా
ప్రత్యూష మినీ	నక్షత్రం

అత్తిలి :

వెంకట్రామ	లై
కనకదుర్గ	జయ జానకి నాయక

వైద్యానికి కేరాఫ్!



ఓపీ రాయించుకునేందుకు రోగుల క్యూ

ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యం ఎక్కడ బాగుంటుందమ్మా.. ఇంకెక్కడ తణుకులోనే.. ఇది చాలా మంది మాట.. అందుకే ఎప్పుడూ ఆసుపత్రి రోగులతో కిటకిటలాడుతూనే ఉంటుంది.. ప్రైవేటు ఆసుపత్రులతో పోటీ పడుతోంది. పేరుకు వంద పడకల ఆసుపత్రి అయినా అంతకు మించి వైద్య సేవలందిస్తోంది.. సిబ్బంది ఇబ్బంది పెట్టినా.. సేవల్లో మాత్రం సూపర్ అంటారు.. తణుకు ఆసుపత్రికి వెళ్లొచ్చిన రోగులు.. అందుకే నిత్యం వందలాది మంది రోగులు ప్రభుత్వాసుపత్రి అయినా వైద్యానికి క్యూ కడతారు.

తణుకు : ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వాసుపత్రిలో సేవలందుతున్నాయి. పట్టణంలో పదుల సంఖ్యలో ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. వాటితో ప్రభుత్వాసుపత్రి పోటీ పడుతోంది. ఆసుపత్రిలో పలు విభాగాలకు సంబం ధించి పది మంది వైద్యులున్నారు. గైనకాలజీ విభాగానికే ఇద్దరు వైద్యులున్నారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రిలో మహిళల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. అందుకే ఆసుపత్రికి రోజూ 500 నుంచి 600 మంది వివిధ ప్రాంతాల నుంచి వచ్చి వైద్య సేవలు పొందుతుంటారు. అదే విధంగా కనీసం అన్ని విభాగాల్లోనూ 120 మంది ఇన్‌పేషెంట్లు ఉంటున్నారు.

8 రోజులు 72 ప్రసవాలు..

ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు చేయని రోజంటూ ఉండదు. అన్ని విభాగాల్లోనూ శస్త్ర చికిత్సలుజరుగుతున్నాయి. అవి కాకుండా ఒక్క మహిళలకు సంబంధించే ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకు చూస్తే 72 ప్రసవాలు జరిగాయి. వాటిలో 22 సహజంగా, 50 శస్త్రచికిత్సలు చేశారు. 10వ తేదీన రెండు సహజంగా, ముగ్గురికి శస్త్ర చికిత్స చేశారు. 11వ తేదీన మూడు సహజంగా, 8 శస్త్రచికిత్సలు, 12వ తేదీన రెండు సహజంగా, 8 శస్త్ర చికిత్సలు, 13న రెండు సహజం, 4 శస్త్రచికిత్సలు, 14న రెండు సహజం, 4 శస్త్ర చికిత్సలు, 15న 5 సహజంగా, 11 శస్త్ర చికిత్సలు, 16న 4 సహజంగా, 8 శస్త్రచికిత్సలు, 17న రెండు సహజంగా, 4 శస్త్ర చికిత్సలు చేశారు. అవకాశం ఉన్నంత వరకూ సహజ ప్రసవం వచ్చేలా చేయడం ఈ ఆసుపత్రి ప్రత్యేకత. అందుకే గర్భిణులు ఆసుపత్రిలో సేవలు ఇష్టపడతారు.

10 మంది వైద్యులు

ఆసుపత్రిలో అన్ని విభాగాలకు సంబంధించి 10 మంది వైద్యులున్నారు. ఈ నేపథ్యంలో రోగులకు అవసరమైన వైద్యం అందుబాటులో ఉంటుంది. అంతే కాకుండా అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉంటాయి. చిన్నారుల విభాగంలో జిల్లాలో ఏ ప్రభుత్వాసుపత్రిలో లేని విధంగా ప్రత్యేక సౌకర్యాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆసుపత్రికి గర్భిణులు తాకిడి ఎక్కువగా ఉంటుంది. మిగిలిన రోగుల సంఖ్య కూడా అదే స్థాయిలో ఉంటుంది. దీంతో ఆసుపత్రి ఎప్పుడూ రోగులతో కిటకిటలాడుతూ ఉంటుంది.

ప్రైవేటుతో పోటీపడుతున్న ప్రభుత్వాసుపత్రి
నిత్యం వందలాది మంది రోగుల క్యూ
అందుబాటులో 10 మంది వైద్యులు
గైనిక్ విభాగానికి గర్భిణుల క్యూ
దిగువ సిబ్బందిపై అసహనం
సేవలపై సంతృప్తి

దండి మార్చ్ విగ్రహాల తొలగింపు ఆపాలి

తణుకు : దండి మార్చ్ విగ్రహాలను తొలగించడాన్ని విరమించుకోవాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. దండి మార్చ్ విగ్రహాలు తొలగింపునకు వ్యతిరేకంగా ఆదివారం సాయంత్రం నినాదాలు చేశారు. దీనిలో భాగంగా వి. సీతారాం మాట్లాడుతూ దండి మార్చ్ విగ్రహాలు దేశంలోనే మూడవదిగా తణుకులో రూ.20 లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేశారన్నారు.కోర్టు తీర్పులకు తాము వ్యతిరేకం కాదని.. తమ నిరసన ద్వారా పాలకులకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే ధర్నా చేస్తున్నామన్నారు.కేవలం రాజకీయ కారణాలతోనే విగ్రహాలు తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం కొద్దిసేపు రాష్ట్రపతి రోడ్డుపై రాస్తారోకో చేశారు. పట్టణ ఎస్ఐ ఆదినారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని శాంతింపజేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్ఎన్ రెడ్డి, ఆకుల కిరణ్, వై.రాజేష్, పెన్మత్స రామరాజు, కౌరు వెంకటేశ్వర్లు,శ్రీనివాస్, గంజి సతీష్ పాల్గొన్నారు.



దండి మార్చ్ విగ్రహాల వద్ద వైసీపీ నాయకుల నిరసన



రైల్వే స్టేషన్ ఆవరణలో స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ

రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛ భారత్

తణుకు: రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉందని విజయవాడ డివిజన్ రైల్వే డివిజనల్ పర్సనల్ అధికారి సీతా శ్రీనివాస్ అన్నారు. తణుకు రైల్వే స్టేషన్‌ను ఆదివారం మధ్యాహ్నం సందర్శించి స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన నాటి నుంచి రైల్వే స్టేషన్లలో శుభ్రతకు అనేక చర్యలు చేపట్టామన్నారు.అనంతరం స్టేషన్ ఎదుట ఉద్యోగులు, సిబ్బందితో స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్‌ప్రభాకరరావు,సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చింతకాయల బాబూరావు

గ్యాస్ డెలివరీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తణుకు: జిల్లాలోఅన్ని గ్యాస్ ఏజెన్సీల్లో పనిచేస్తున్న గ్యాస్ డెలివరీ కార్మికులకు చట్టప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు అన్నారు. పైడిపర్రు కమ్యూనిటీ హాలులో ఆదివారం నిర్వహించిన జిల్లా గ్యాస్ డెలివరీ గ్యాస్ వర్కర్స్ యూనియన్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు.జిల్లాలో గ్యాస్ డెలివరీ కార్మికులకు ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ అమలులో కార్మిక శాఖ అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు.కార్మిక సమస్యలు పరిష్కారం చాలని నవంబర్ 9,10,11 తేదీల్లో జరిగే చలో ఢిల్లీ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో కె.సూర్యచంద్రరావు,సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, డివిజన్ కార్యదర్శి పీవీ ప్రతాప్ వి.దుర్గారావు, గ్యాస్ డెలివరీ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటి కృష్ణ, సీహెచ్ సత్యనారాయణ, నాగేశ్వరరావు, వై. సుబ్బారావు, జి.సత్తిబాబు, గారరంగారావు పాల్గొన్నారు.

57 మందికి ఉచిత వైద్య పరీక్షలు

తణుకు: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఇండియన్ పబ్లిక్ స్కూలు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం 25 మందికి వైద్య సేవలందించారు. అసోసియేషన్ శాఖ అధ్యక్షుడు గడిగట్ల కేశ్వరరావు ఆధ్వర్యంలో ఇంటికే పరిమితమైన అనారోగ్య వృద్ధులను పరీక్షించి మందులు అందజేశారు. డాక్టర్ వేగేశిన సత్యనారాయణ, నేత్ర వైద్యుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ పరీక్షలు చేశారు. అనంతరం సంఘ కార్యాలయంలో వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ప్రముఖ వైద్యులు బొండాడ వెంకటేశ్వర్లు 34 మంది వృద్ధులకు షుగర్ పరీక్షలు చేసి నివేదికలు అందించారు.షుగర్‌ను ప్రతీ ఒక్కరూ అదుపులో ఉంచుకోవాలని వైద్యులు సూచించారు.షుగర్ వ్యాధి చాలా ప్రమాదకరమైనదని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్యులు జగదీష్,నలుమూరి రామ కృష్ణారావు,ఎంఎస్‌వీకే శేషగిరిరావు పాల్గొన్నారు.



అనికల థామస్‌ను సన్మానిస్తున్న సంఘ విశ్వాసులు

అనికల డైమండ్ జూబ్లీ ఉత్సవం

తణుకు: రెవరెండ్ ఫాదర్ థామస్ చేసిన సేవలు మరువలేమని తణుకు విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ బి.తంబిరాజు అన్నారు. థామస్ మద్రాసులో ఆర్‌సీఎంలో పట్టాభిషేకం పొంది నేటికి 60 సంవత్సరాలైన సందర్భంగా అనికల డైమండ్ జూబ్లి ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పెరవలి రామకృష్ణ,బొడ్డు విక్టర్ బాబు, నందిన శేషు, ఆకుల రాముడు, చదలవాడ నాని, ముళ్లపూడి సురేష్, సింహాద్రి సుబ్బారావు, కొండవీటి చిన అప్పారావు,వెంకట రత్నం, వాసు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో చవితి సందడి

అత్తిలి: వినాయక చవితి ఉత్సవాలకు నియోజకవర్గంలో ఏర్పాట్లు ఘనంగా సాగుతున్నాయి. ఈ నెల 25వ తేదీన వినాయక చవితి నేపథ్యంలో అత్తిలి పట్టణంతో పాటు గ్రామాల్లో పందిళ్ళు ఏర్పాట్లులో నిమగ్నమయ్యారు. ఉత్సవాలు సందర్భంగా ఆధ్యాత్మిక సంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నారు.నిమజ్జనం రోజున కోయడాన్సులు, ప్రదర్శనలు నిర్వహించనున్నారు.గణేష్ చౌక్ సెంటర్ వద్ద, పెద్ద వంతెన వద్ద చలువ పందిళ్ళు వేశారు. తణుకు, ఇరగవరం మండలాల్లో కూడా చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం మీద నియోజకవర్గంలో సుమారు 200 విగ్రహాలు ప్రతిష్ఠించే అవకాశం ఉన్నట్టు సమాచారం.ఈ మేరకు పోలీసులు కూడా ముందస్తు హెచ్చరికలు చేస్తున్నారు.

ఉచిత వైద్య సేవ

తణుకు : పట్టణ ఏరియా ఆసుపత్రిలో అన్ని సేవలు అందించడానికి ప్రతీ రోజూ వైద్యులు అందుబాటులో ఉంటారు. 24 గంటలు వైద్య సేవలందుతాయి. ఎక్కడా లేని విధంగా ఏసీ వార్డులు కూడా ఉన్నాయి. గర్భిణీ స్త్రీల వార్డులతో పాటు లేబర్ వార్డుల్లో కూడా ఏసీలను ఏర్పాటు చేశారు. ప్రతీ రోజూ కనీసం 300 మంది రోగులకు వైద్య సేవలు పొందుతారు. వంద మంది ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్లుగా ఉంటారు. ఆసుపత్రిలోని సాధారణ వైద్య పరీక్షలు చేస్తున్నారు. అంతే కాకుండా ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెడాల్ కంపెనీ ద్వారా అన్నిరకాల పరీక్షలను ఉచితంగా చేస్తున్నారు. ఈ ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డయాలసిస్ సేవలు కూడా అందుతాయి. అయితే నామమాత్రపు ఫీజు ఉంటుంది. ఆసుపత్రిలో అదనపు సేవలకు 08819 222175 నెంబర్‌లో సంప్రదించాలి.

డాక్టర్	ప్రత్యేకత
1. వి. అరుణ	గైనకాలజిస్ట్
2. కెవీ శ్రీలక్ష్మి	గైనకాలజిస్ట్
3. సోమసుందరరావు	జనరల్ సర్జన్
4. ఆర్. అనిల్ బాబు	జనరల్ మెడిసిన్
5. ఎస్.శ్రీనివాస్	ఈఎన్‌టీ
6. రాఘవేంద్రరావు	ఆర్థోపెడిక్
7. పిఎస్ఎన్.రాజు	పిడియాట్రిక్స్
8.ఎస్.రాజేశ్వరి	పిడియాట్రిక్స్
9. రాధిక	డెంటల్
10. మనోరంజన్	ఆప్తమాలజిస్ట్
	(మంగళ,గురు, శనివారం)

సమాచారం

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్	102
మొబైల్ వైద్య సేవ	104
అంబులెన్స్	108
పోలీస్ స్టేషన్	100
ఫైర్ స్టేషన్	101
చైల్డ్ లైన్	1098
హైవే అంబులెన్స్	------

ఇక నుంచి పోలీస్‌లు అందరికీ వారాంతపు సెలవులు ఉంటాయి.. ఇదీ సుమారు రెండు వారాల కిందట ఎస్పీ రవి ప్రకాష్ చెప్పిన మాట..‘‘ఆంధ్రజ్యోతి’ ప్రత్యేక కథనానికి ఎస్పీ నుంచి వచ్చిన స్పందన ఇది.. అయితే ఆచరిస్తున్నారా అంటే తణుకు నియోజకవర్గ పరిధిలో మాత్రం ఇంత వరకూ లేదు.. దీంతో పోలీసులు ఇబ్బందులు పడుతున్నారు.. ఉన్నతాధికారులను మాకు సెలవు కావాలని అడగలేక.. తర్జనభర్జన పడుతున్నారు.. అన్ని చోట్లా ఇస్తుంటే.. ఇక్కడెందుకు ఇవ్వడంలేదో అధికారులకే తెలియాలి..!!


విధుల్లో ట్రాఫిక్ సిబ్బంది

ఎస్పీ చెప్పినా.. నో సెలవ్!

- పోలీసులకు వారాంతపు సెలవుల్లేవ్ - కింది స్థాయి సిబ్బంది ఆవేదన - సర్కిల్ పరిధిలో 122 మంది సిబ్బంది

తణుకు : ఉన్నతాధికారులు చెప్పినా క్రింది స్థాయి అధికారులు పాటించరు. అన్ని శాఖల్లోనూ ఉద్యోగులకు సెలవులు ఉంటాయి. కానీ ప్రతీ నిత్యం శాంతి భద్రతలను కాపాడుతూ.. ప్రజలకు రక్షణగా ఉండే పోలీసులకు మాత్రం సెలవుల్లేవ్.. ఇటీవల జిల్లా స్థాయిలో ఎస్పీ రవిప్రకాష్ వారాంతపు సెలవులు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చినా అమలు కావడంలేదు. జిల్లాలో తాడేపల్లిగూడెం, భీమవరం తదితర స్టేషన్ల పరిధిలో ఇప్పటికే వారాంతపు సెలవులు ఇస్తున్నారు. అయితే కొవ్వూరు డివిజన్ పరిధిలోని తణుకు, కొవ్వూరు స్టేషన్లలో మాత్రం ఇంకా వారాంతపు సెలవులకు నోచుకోవడం లేదు. దీంతో కానిస్టేబుళ్ళు ఇబ్బందులు పడుతున్నారు

సర్కిల్ పరిధిలో 122 మంది సిబ్బంది..

తణుకు సర్కిల్‌లో ఐదు పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. వాటిలో టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐతో పాటు ముగ్గురు ఏఎస్ఐలు, 4 హెడ్‌కానిస్టేబుల్స్, ఐదుగురు కానిస్టేబుళ్ళు ఉంటారు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ, ఇద్దరు ఏఎస్ఐలు, నలుగురు హెడ్‌కానిస్టేబుళ్ళు 16 మంది కానిస్టేబుళ్ళు ఉన్నారు. ఉండ్రాజవరం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ, ఒక ఏఎస్ఐ , నలుగురు హెడ్‌కానిస్టేబుళ్ళు 17 మంది కానిస్టేబుళ్ళు ఉన్నారు. పెరవలిలో ఎస్ఐ, ఇద్దరు ఏఎస్ఐలు, ముగ్గురు హెడ్‌కానిస్టేబుళ్ళు, 14 మంది కానిస్టేబుళ్ళు ఉన్నారు.అత్తిలిలో ఎస్ఐ, ఇద్దరు ఏఎస్ఐలు, నలుగురు హెడ్‌కానిస్టేబుళ్ళు, 16 మంది కానిస్టేబుళ్ళు ఉన్నారు.ఇలా ఐదు పోలీసు స్టేషన్లలో ఐదుగురు ఎస్ఐలు, పది మంది ఏఎస్ఐలు, 19 మంది హెడ్‌కానిస్టేబుళ్ళు, 88 మంది కానిస్టేబుళ్ళు పని చేస్తున్నారు. స్టేషన్లలో సిబ్బంది కొరత లేనప్పటికీ సెలవులు మాత్రం ఇవ్వడంలేదు.

కొరత లేకున్నా.. సెలవు లేదు..

పోలీసులకు సెలవులు లేకపోవడంతో ఎక్కడికైనా వెళితే ఆదరాబాదరా రావాల్సిందే. ఎందుకంటే 24 గంటలు డ్యూటీలో ఉన్నట్టే.. ఏదైనా ప్రమాదం జరిగిందంటే అందుబాటులో ఉండాల్సిందే. అయితే ఇటీవల తణుకు సర్కిల్ పరిధిలో అంత చెప్పుకోతగ్గ సంఘటన ఏం లేదు. అయినా కిందిస్థాయి సిబ్బంది సెలవుల్లో మాత్రం కదలిక లేదు. దీంతో కుటుంబ సభ్యులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని స్టేషన్లలో సెలవులు ఇచ్చి మరికొన్ని స్టేషన్లలో సెలవులు ఇవ్వకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా పోలీస్ అధికారులు స్పందించి సిబ్బందికి సెలవులు కేటాయించాల్సి ఉంది.

విగ్రహాలు ప్రతిష్ఠిస్తే సమాచారమివ్వండి

ఎస్ఐ గుబ్బల శ్రీనివాస్


సూరంపూడిలో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాస్

ఇరగవరం : గణపతి ఉత్సవాలకు విగ్రహాలను ఏర్పాటు చేసుకునేవారు తగు జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ గుబ్బల శ్రీనివాస్ అన్నారు. గణపతి నవరాత్రులు పురస్కరించుకుని మండలంలోని తూర్పువిప్పర్రు పంచాయతీ, సూరంపూడి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించేవారు కొన్ని నిబంధనలు పాటించాలన్నారు. విగ్రహాలను వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా ప్రతిష్టించాలన్నారు. విగ్రహాల వద్ద మైక్‌లను ఏర్పాటు చేస్తే తప్పనిసరిగా అనుమతి పొందాలన్నారు.విగ్రహాల ఎత్తు,ప్రతిష్ఠించే ప్రదేశం తదితర వివరాలు పోలీసులకు అందజేయాలన్నారు.ఊరేగింపు,నిమజ్జనం జరుపు ప్రదేశాల వివరాలు తెలియజేయాలన్నారు. ఊరేగింపు సమయంలో బాణసంచా కాల్చరాదని తెలిపారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆకేటి నర్శింహరావు, బొల్లా రాము(దత్తుడు), గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా అన్నసమారాధన

అత్తిలి : కృష్ణాష్టమి వేడుకలు ముగింపు సందర్భంగా అత్తిలి అజయ్‌నగర్ శ్రీకృష్ణా ఆలయంలో ఆదివారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం చేశారు. పరిసర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు.



గణేశులు.. రెడీ..

అత్తిలి : గణపతి నవరాత్రులు వచ్చాయంటే ఊరూ వాడా ఒకటే సందడి.. అందుకే ఎక్కడికక్కడ వినాయకుడి భారీ ప్రతిమల సిద్ధమైపోతాయి. 5 నుంచి 50 అడుగుల వరకూ విగ్రహాల వరకూ తయారుచేసి విక్రయిస్తారు. ఈ నెల 25వ తేదీన చవితి ఉత్సవాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో పోలేరమ్మ ఆలయం వద్ద తయారు చేస్తున్న గణపతి విగ్రహాలు విక్రయాలు జోరందుకున్నాయి. వివిధ ఆకారాల్లో విగ్రహాలు రూపొందించి రంగుల వేసి విక్రయిస్తున్నారు. దీంతో మండలంలో చవితి సందడి నెలకొంది. మరో పక్క ఉత్సవ కమిటీల సభ్యులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.



అధ్వానంగా.. రహదారులు..

అత్తిలి: ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే అష్టకష్టాలు పడాల్సిందే. అత్తిలి నుంచి భీమవరం వెళ్లేందుకు ఆరవల్లి మీదుగా వెళతుంటారు. ఆరవల్లి రహదారిపై గోతులు పడి నీరు నిలిచిపోతోంది. ఆరవల్లి -దంతిపల్లి రహదారిపై కూడా పరిస్థితి ఇలాగే ఉంది. నిత్యం వందలాది మంది విద్యార్థులు ఈ రహదారిపై ప్రయాణిస్తుంటారు.ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రహదారి మరమ్మత్తులు చేయాలని కోరుతున్నారు.



● ఆలయదర్శిని

తాడేపల్లిగూడెం పట్టణంలో ఉన్న పలు దేవాలయాల్లో పూజా కార్యక్రమాలు, నిత్య కార్యక్రమాలు ఆయా ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆయా ఆలయాల్లో కొన్ని చోట్ల అన్న సమారాధనలు కూడా కొనసాగుతున్నాయి.

● **పెద్ద శివాలయం..** పట్టణంలోని ప్రధానాలయాల్లో ప్రముఖంగా కొనసాగుతున్న ఆలయం స్థానిక భ్రమరాంబికా సమేత మల్లిఖార్జునస్వామి ఆలయం. సోమవారాలు, పర్వదినాల్లో ఈ ఆలయాన్ని వేలాదిమంది భక్తులు దర్శించుకుంటారు.

● **బలుసులమ్మ దేవాలయం..** పట్టణ ప్రజల ఇలవేల్పుగా పూజలు అందుకుంటున్నది బలుసులమ్మ అమ్మవారు. ఈ ఆలయంలో నిత్యపూజా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ప్రతి శుక్రవారం భారీ అన్నసమారాధన కొనసాగుతోంది.

● **సత్యనారాయణస్వామి ఆలయం..** స్థానిక విజయ టాకీస్ సెంటర్‌లోని ఈ ఆలయానికి చిరకాల చరిత్ర ఉంది. వివాహాది వేడుకల సమయాల్లో అధిక సంఖ్యలో వివాహాలు జరుగుతుంటాయి. ఆలయంలో ప్రతి సోమవారం, ప్రతి శుక్రవారం ప్రత్యేక పూజలు జరుగుతాయి.

● **భూ సమేత వెంకన్న ఆలయం..** ఆర్టీసీ డిపో ఎదుట ఉన్న భూ సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ప్రతి శనివారం ఆలయాన్ని వేలాదిమంది భక్తులు సందర్శిస్తుంటారు. వివాహాది వేడుకలు పెద్దఎత్తున జరుగుతుంటాయి. ముక్కోటి ఏకాదశి, హనుమజ్జయంతి ఘనంగా నిర్వహిస్తూంటారు.

● **దాసాంజనేయస్వామి ఆలయం..** మునిసిపల్ కార్యాలయం పక్కనే ఉన్న దాసాంజనేయస్వామి ఆలయంలో శనివారం, మంగళ వారాల్లో నాగవల్లీదళార్చనలు, సింధూర పూజలతో పాటు హనుమజ్జయంతి, ముక్కోటి ఏకాదశి పర్వదినాలను ఘనంగా నిర్వహిస్తుంటారు.

● **కనకమహాలక్ష్మి ఆలయం..** స్థానిక ఏరియా ఆస్పత్రి సమీపంలో కనకమహాలక్ష్మి ఆలయం వద్ద ప్రతి గురు, శుక్రవారాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహిస్తూంటారు. కొన్ని ప్రత్యేక పర్వదినాల్లో ఇక్కడ వేడుకలు నిర్వహించడంతో పాటు అన్న సమారాధన నిర్వహిస్తూంటారు.

● **విశ్వదుర్గేశ్వరి ఆలయం..** స్థానిక 17వ వార్డులో విశ్వదుర్గేశ్వరి ఆలయంలో నిత్య పూజాధికాలతోపాటు ప్రతి శుక్రవారం అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేస్తుంటారు.

● యాగర్లపల్లి ప్రాంతంలోని అమ్మవారి ఆలయం, కోతి బొమ్మ సెంటర్లోని లక్ష్మీ సాయినాథుని ఆలయం, పశుపతిరావు నగర్‌లోని సాయినాథుని ఆలయం, సవితృపేటలోని సాయిసద్గురు యోగ ధ్యాన మందిరం, రామారావు ఆస్పత్రి ప్రాంతంలోని చిన్న ఆంజనేయస్వామి ఆలయం, రామచంద్రరావుపేటలోని కృష్ణయోగ ధ్యానమందిరం, చిన్నవంతెన సమీపంలోని కోదండ రామాలయం, చలంచర్లవారి వీధిలోని కోదండ రామాలయం, సీతారామపేటలోని సీతా రామాంజనేయస్వామి మందిరం, స్టేషన్ రోడ్డులోని రెండు ఆంజనేయస్వామి ఆలయాలు ప్రధానంగా ఉన్నాయి.

ప్లాస్టిక్ వాడకం నియంత్రణకు కృషి చేయాలి

మంత్రి మాణిక్యాలరావు

తాడేపల్లిగూడెం అర్బన్ : పచ్చని పర్యావరణాన్ని విషతుల్యం చేస్తున్న ప్లాస్టిక్ వాడకాన్ని ఆపేందుకు ప్రతీఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు కోరారు. 31వ వార్డులో కొత్త ఫ్లయ్‌ఓవర్ రోడ్డులో స్వచ్ఛభారత్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సెప్టెంబర్ 1 నుంచి ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్టు తెలిపారు. కిరాణా, చిన్న,చిన్న వ్యాపారులు, హోటల్స్, కూరగాయల వ్యాపారులు ప్లాస్టిక్ బ్యాగ్‌లు వాడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టి తాడేపల్లిగూడెంను ప్లాస్టిక్‌రహిత పట్టణంగా తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. వినాయకచవితిని పురస్కరించుకుని మట్టి వినాయక ప్రతిమలకు ప్రాధాన్యం ఇచ్చి పర్యావరణాన్ని కాపాడేందుకు కృషి చేయాలన్నారు. వినాయకచవితి అనంతరం 11వరోజు గణేష్ నిమజ్జన కార్యక్రమానికి జువ్వలపాలెం వద్ద ప్రత్యేక ప్లాట్‌ఫారం ఏర్పాటు చేశారన్నారు. 31వ వార్డు కొత్త ఫ్లయ్‌ఓవర్ బ్రిడ్జి నుంచి హౌసింగ్‌బోర్డు వెళ్ళే రోడ్డులో రైతుబజారు, మార్కెట్‌ను ఏర్పాటు చేసే ఆలోచన ఉన్నట్టు మంత్రి పేర్కొన్నారు. పట్టణంలోని ఖాళీ ప్రదేశాల్లో వయ్యారిభామ మొక్కలు ఎక్కువగా పెరుగుతున్నాయని, వీటివల్ల శ్వాసకోస వ్యాధులు వచ్చేఅవకాశం ఉందని ఈ మొక్కలు తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కోటరాంబాబు, మారం వెంకటేశ్వరరావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ నరిసే సోమేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కంచుమర్తి నాగేశ్వరరావు, నాయకులు ఖండభట్టు శ్రీనివాస రాజు, శీలి వెంకటాచలం, రూపాప్రకాష్, శ్రీదేవి, రాగిరెడ్డి ప్రసాద్, అనిల్‌కుమార్ పప్పొల కుమారస్వామి, దూలంనాగ రాజు పాల్గొన్నారు.



జాతీయస్థాయి ఏకపాత్రాభినయం పోటీల్లో పాల్గొన్న కళాకారులు, నిర్వాహకులు

జాతీయస్థాయి పోటీలు గూడెంకు గర్వకారణం

బీవీఆర్ కళాకేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకటరామారావు

అలరించిన ఏకపాత్రాభినయ పోటీలు

తాడేపల్లిగూడెం టౌన్ : తాడేపల్లిగూడెం కళాపరిషత్ ఆధ్వర్యంలో పద్మశ్రీ రేలంగి, టీఆర్ త్యాగరాజుల స్మారక జాతీయస్థాయి ఏకపాత్రాభినయ పోటీలకు గూడెం పట్టణం వేదిక కావడం పట్టణవాసులు అందరికీ గర్వకారణమని బీవీఆర్ కళాకేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకటరామారావు అన్నారు. కళాపరిషత్ ఆధ్వర్యంలో ఏకపాత్రాభినయ పోటీలు స్థానిక బీవీఆర్ కళాకేంద్రంలో ఆదివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పరిచయ కార్యక్రమంలో రామారావు మాట్లాడుతూ స్థానికంగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఏకపాత్ర పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్రంతో పాటు తెలంగాణ నుంచి కళాకారులు వచ్చి, తమ ప్రతిభను ప్రదర్శించడం హర్షణీయమన్నారు. తన హాస్య నటన ద్వారా ఎన్నో పాత్రలకు ప్రాణప్రతిష్ఠ చేసిన రేలంగి, నాటక కళారంగంలో మేరునగధీరుడిగా నిలిచిన టీఆర్ త్యాగరాజు, విఖ్యాత నటుడు ఎస్వీ రంగారావులను స్మరించుకుంటూ కళాపరిషత్ ఆధ్వర్యంలో కొన్ని సంవత్సరాలుగా ఈ పోటీలను నిర్వహిస్తోందన్నారు. ఏకపాత్రాభినయ పోటీలకు కోపల్లె శ్రీనివాస్ నిర్వాహకుడిగా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రధానంగా దుర్యోధన పాత్రలో డా. రంగారావు, శ్రీకృష్ణుడిగా మానేపల్లి సత్యనారాయణ, విశ్వామిత్రుడిగా పొదిలి పెద్దిరాజు, కార్యవర్ధిగా పొదిలి నాగేంద్రప్రసాద్, ధృతరాష్ట్రుడిగా బి.త్రినాథరాజు, తిప్పడుగా ఆవుల వెంకట్రావు, రతీదేవిగా లలిత కుమారి, హరిశ్చంద్రుడిగా గుండా మురళీకృష్ణ, లంకేశ్వరుడిగా షేక్ హమీద్, అల్లూరి సీతారామరాజుగా ఎం.అర్జునరావు, కర్ణుడిగా గుంటుపల్లి ఆంజనేయచౌదరి, రావణాబ్రహ్మగా దంపూరి దుర్గాప్రసాద్ ఆయా పాత్రల్లో లీనమై నటించి, ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారు. అంనంతరం రంగస్థల రూపశిల్పి ధవళేశ్వరపు పరమేశ్వరరావుకు విశిష్ట గౌరవ పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీవీఎం కృష్ణారావు, సరస్వతుల హనుమంతరావు, దాసరి కాశీవిశ్వనాథం, అడ్డగర్ల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



విశ్వామిత్రుడిగా పెద్దిరాజు



తిప్పడుగా వెంకట్రావు



అశ్వత్థామగా వెంకటేశ్వరరావు



భక్తరామదాసుగా వాయునందన శాస్త్రి

ఘనంగా సోమేశ్వరరావు జన్మదిన వేడుకలు

తాడేపల్లిగూడెం అర్బన్ : బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ నరిసే సోమేశ్వరరావు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా బీజేపీ జిల్లా కార్యదర్శి కంచుమర్తి నాగేశ్వరరావు, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ యెగ్గిన నాగబాబు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సోమేశ్వరరావు బీజేపీ బలోపేతానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. తొలుత సోమేశ్వరరావు బలుసులమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం బీజేపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కైండ్‌నెస్ సొసైటీ అధ్యక్షుడు గట్టిం మాణిక్యాలరావు, బీజేపీ నాయకులు కోట రాంబాబు, పోతుల అన్నవరం, గమిని సుబ్బారావు, అయినపర్తి శ్రీదేవి, ధనలక్ష్మి, అడపా రమేష్ తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



సోమేశ్వరరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బీజేపీ నాయకులు

● ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

తాడేపల్లిగూడెం టౌన్ : భారతదేశాన్ని 21వ శతాబ్దంలోకి నడిపించిన ఘనత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకే దక్కుతుందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ దుర్గా రామచంద్రరావు పేర్కొన్నారు. రాజీవ్ 74వ జయంతి కార్యక్రమం స్థానిక గాంధీమండపంలో కాంగ్రెస్, అనుబంధ కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. తొలుత రాజీవ్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు, ఖద్దరు దండ వేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన దుర్గా రామచంద్రరావు మాట్లాడుతూ ప్రధానిగా రాజీవ్ ప్రవేశపెట్టిన సంస్కరణలు దేశాన్ని ప్రగతిపథంలో నడిపించాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ, మహిళా కాంగ్రెస్ తదితర అనుబంధ కమిటీల నాయకులు ఆరాధ్యుల శ్రీరామచంద్రమూర్తి, బాల బొమ్మల శ్రీనివాస్, ఖండవల్లి బలభద్రరావు, గుడిమెట్ల శ్రీనివాసరెడ్డి, మునిపర్తి కోదండ రామం, గట్టిం సూర్య నారాయణ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా శీలి కృష్ణారావును ఎంపిక చేశారు.

● ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ స్వచ్ఛభారత్

తాడేపల్లిగూడెం అర్బన్ : స్వచ్ఛభారత్ కార్యక్రమం ద్వారా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పైడికొండలమాణిక్యాలరావు పేర్కొన్నారు. ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛభారత్‌లో మంత్రి పాల్గొన్నారు. గత 50వారాలుగా స్వచ్ఛభారత్‌లో ఎయిర్‌స్ట్రిప్‌వాకర్స్‌సభ్యులు పాల్గొని విజయవంతం చేయడాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్ర, కేవీ అనిల్‌కుమార్, మాజీ అధ్యక్షుడు రాగిరెడ్డినాగవరప్రసాద్, సభ్యులు మాకా శ్రీనివాస్, దూలం నాగరాజు, పాటే నాగేశ్వరరావు, కె.నరసింహామూర్తి, రామకృష్ణంరాజు, యోహాను, మూర్తి, కుమారస్వామి పాల్గొన్నారు.

● 150 మందికి ఉచిత వైద్య పరీక్షలు

తాడేపల్లిగూడెం టౌన్ : నేటి జీవన విధానంలో శారీరక శ్రమ లేకపోవడం, సమతుల్య ఆహారం తీసుకోకపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని విజయవాడ ఆంధ్రా హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ వై.రమేష్ అన్నారు. పట్టణ టైలర్స్ అసోసియేషన్, సూర్య ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో సాయి పాలి క్లినిక్ సౌజన్యతో డీఎస్ చెరువు వద్ద ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ఊబకాయం పెరగడం ద్వారా మధుమేహ వ్యాధికి గురై, అనంతరం గుండెజబ్బుల బారిన పడుతున్నారని, ఆది ఆందోళన కలిగించే విషయమన్నారు. మరో అతిథిగా పాల్గొన్న కౌన్సిలర్ కాకర్ల సుభద్రాదేవి మాట్లాడుతూ సూర్య ఫౌండేషన్, పట్టణ టైలర్స్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పేదలకు బియ్యం పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో బిరుదుకోట వెంకటేశ్వరరావు, ఆరేపల్లి ఉమ, గోపాల్, గురజాడ బ్రహ్మజీ, దత్తు వెంకటేశ్వరరావు, పాండురంగారావు, నాగేశ్వరరావు బత్తుల సాయి తదితరులు పాల్గొన్నారు.

● దివ్యాంగులను ప్రభుత్వం ఆదుకోవాలి

తాడేపల్లిగూడెం అర్బన్ : క్రైస్తవుల్లోని దివ్యాంగులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) జిల్లా అధ్యక్షుడు నీతిపూడి స్టీఫెన్‌పాల్ కోరారు. స్థానికంగా జరిగిన ఏఐసీఎఫ్ సమావేశంలో పాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రైస్తవులైన దివ్యాగులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. అంగవైకల్యం కలిగిన ఎంతో మంది గుర్తింపు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన దివ్యాంగులను పట్టించుకోకపోవడం వల్ల హక్కులు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రైస్తవుల్లో అనేక మంది దివ్యాంగులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి వీరి కోసం ప్రత్యేకంగా బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ ఆశీర్వాదం, వి.జాన్‌బాబు, రవిప్రకాష్ పాల్గొన్నారు.

రేపు రంగస్థల కళాకారుల కార్యక్రమం

తాడేపల్లిగూడెం టౌన్ : రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం నెలవారీ కార్యక్రమం ఈ నెల 22న స్థానిక అమ్మ కల్యాణమండపంలో సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నట్టు సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైబోయిన బాబులు, ఖండభట్లు శ్రీనివాసరాజు తెలిపారు. ముఖ్య అతిథులుగా మునిసిపల్ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్, మాజీ చైర్మన్ ఈతకోట తాతాజీలు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గౌరవ సత్కారాన్ని యెగ్గిన నానాజీకి, కళా సత్కారాన్ని ఆర్కెస్ట్రా నిర్వాహకుడు చేబ్రోలు మోహన్, ఉత్తమ ఉద్యోగ సేవా పురస్కారాన్ని జంధ్యాల నాగేశ్వరరావులకు అందజేయనున్నట్టు వివరించారు.

నిధుల్లేవ్...!

మండలంలో అసంపూర్తిగా తొమ్మిది అంగన్‌వాడీ భవనాలు



లింగారాయుడుగూడెంలో మధ్యలో నిలిచిన అంగన్‌వాడీ కేంద్రం

తాడేపల్లిగూడెం రూరల్ : నిధులు సరిపడక అంగన్‌వాడీ కేంద్రాలు కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. ప్రభుత్వం వెచ్చించిన సొమ్ము అరకొరగా ఉండటంతో మండలంలో తొమ్మిది అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. రెండేళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాలు పూర్తికాక అద్దె భవనాల్లోనే నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. విచిత్రం ఏమిటంటే ప్రభుత్వం మొదటి దఫాగా రూ.6.5 లక్షలు విడుదల చేయగా మరో రూ.4లక్షలు విడుదల చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి. నంద మూరు అంగన్‌వాడీ కేంద్రానికి పంచాయతీ నిధులు, స్థానికుల సహకారంతో తలుపులు ఏర్పాటు చేసుకుని కొన సాగిస్తున్నారు. మరో తొమ్మిది భవనాల నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. కృష్ణాయపాలెంలో రెండు కేంద్రాలు, ఉప్పర గూడెం, మెట్ట ఉప్పర గూడెం, మాధవరం, లింగారాయుడు గూడెం, జగ్గన్నపేట, కొమ్ముగూడెం, కడియద్ధ, గ్రామాల్లో నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయాయి. ఈ విషయం ఇటీవల నిర్వహించిన మండల పరిషత్ సమావేశంలో జడ్పీ చైర్మన్ దృష్టికి తెవడంతో నిధులను విడుదల చేస్తానని పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఇప్పటికైనా ఈ కేంద్రాలు పూర్తి చేస్తే అద్దె భవనాల నుంచి విముక్తి కలుగుతుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

చిన్నారులు ఇబ్బందులు

పి.శ్రీనివాస్, కృష్ణాయపాలెం, గ్రామస్థుడు



అంగన్‌వాడీలకు సొంత భవనం లేకపోవడం వల్ల చాలా ఇబ్బందిగా ఉంటోంది. పిల్లలు మూత్ర విసర్జనకు వెళ్లాలన్నా ఇబ్బందులు పడుతున్నారు. సొంత భవనం ఏర్పాటు చేస్తే ఆ ఇబ్బంది ఉండదు.

కరెంట్ పోతే అంతే సంగతులు..!

తహసీల్దార్ కార్యాలయంలో నిరుపయోగంగా జనరేటర్

పట్టించుకునే నాథుడే కరువు

పౌరసేవలకు తీవ్ర విఘాతం



నిరుపయోగంగా మూలన పడి ఉన్న జనరేటర్

పెంటపాడు : ప్రభుత్వ కార్యాలయాలను సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రధాన కార్యాలయాల్లో సైతం చిర కాలంగా ఉండే సమస్యలు పరిష్కారం అవ్వడం లేదు. తహసీల్దార్ కార్యాలయంలో విద్యుత్ కోత ఉపశమనం కోసం వేల రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన జనరేటర్ నిరుపయోగంగా మారింది. సంవత్సరాలు గడుస్తున్నా వాటిని మరమ్మతులు చేసే నాథుడే లేకపోడంతో సమస్య పరిష్కారం అవ్వడం లేదు. పదే పదే విద్యుత్ కోతల వల్ల పనులు పెండింగ్‌లో పడుతున్నాయి. దీంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ ఉంటే అధికారులకు పని ఉంటుంది. పౌర సేవలన్నీ అన్‌లైన్‌లో పొందుపర్చడం ద్వారా ఏ పనికైనా విద్యుత్ తప్పనిసారి అయింది. కనీసం ప్రభుత్వ కార్యాయాల్లో జనరేటర్లను మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకుని రావాలని ప్రజలు కోరుతున్నారు.



నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ మూర్తి

విగ్రహాల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి : సీఐ

తాడేపల్లిగూడెం రూరల్ : నిబంధనలకు అనుగుణంగానే వినాయక చవితి మహోత్సవాలకు గణపతి విగ్రహాలను ఏర్పాటు చేయాలని సీఐ ఎంఆర్‌ఎల్ ఎస్ఎస్ మూర్తి పేర్కొన్నారు. సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో పట్టణంలోని గణపతి నవరాత్రులు నిర్వహించే నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై విగ్రహాలు పెడితే ఊరుకోమని హెచ్చరించారు. రోడ్డుపక్కన ఏర్పాటు చేసుకోవాలని, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూన్నారు. విగ్రహాల నిమజ్జనం వివరాలను స్టేషన్‌లో అందిస్తే బందోబస్తు ఏర్పాటుకు ప్రణాళిక వేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఉత్సవాల పేరుతో అసాంఘిక కార్యకలపాలు చేపడితే ఊరుకోమని హెచ్చరించారు. శాంతి భద్రతలకు అనుగుణంగా ఉత్సవాలు నిర్వ హించుకోవాలని సూచించారు.

ఏకపక్ష నిర్ణయం తగదు

జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యశర్మ

తాడేపల్లిగూడెం టౌన్ : తాడేపల్లిగూడెంలోని బ్రాహ్మణ కల్యాణ మండపంలో బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమం మోసపూరితమైనదని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మలపాక సుబ్రహ్మణ్యశర్మ పేర్కొన్నారు. స్థానిక బీవీఆర్ కల్యాణ మంపడంలో బ్రాహ్మణ సంఘ సభ్యులు ఒక సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించిన సుబ్రహ్మణ్యశర్మ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని బ్రాహ్మణ సంఘాలను ఏకంచేస్తామని బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యామిజాల నరసింహమూర్తి మోసపూరిత వాగ్దానం చేసి, బ్రాహ్మణ సంఘాల ప్రముఖులను పట్టణానికి ఆహ్వానించారన్నారు. అయితే ఇక్కడకు హాజరైన సంఘుసభ్యులతో నియంతృత్వ ధోరణిని అవలంభించి, ఏకపక్ష నిర్ణయంతో ఎన్నిక జరిపించడాన్ని మలపాక దుయ్యబట్టారు. జిల్లాలోని అనేక ప్రాంతాల్లోని బ్రాహ్మణ సంఘాలు దీనిని వ్యతిరేకించినప్పటికీ, యామిజాల ఒంటెత్తు పోకడలతో ముందుకు వెళ్లడాన్ని ఆక్షేపించారు. దీనిని అనేక బ్రాహ్మణ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయని మలపాక తదితరులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సంఘ నాయకులు ఓలేటి రామారావు, గన్నవరపు శ్రీనివాస్, కొడవటిగంటి వెంకటనరసింహా చార్యులు, రావుల శ్రీనివాస్, ఏవీఎస్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ విగ్రహనికి పూల మాలలు వేస్తున్న హరికుమార్‌రాజు

ప్రత్యేక హోదాతోనే రాష్ట్ర అభివృద్ధి

పీసీసీ ప్రధాన కార్యదర్శి హరికుమార్ రాజు

పెంటపాడు : ప్రత్యేక హోదాతో రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని పీసీసీ ప్రధాన కార్యదర్శి హరికుమార్ రాజు అన్నారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆదివారం పెంటపాడు ఎస్సీ కాలనీలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు పాతగొలుసు జయరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పీసీసీ కార్యదర్శి హరికుమార్ రాజు మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా రాజీవ్ పని చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల పార్టీగా అభివర్ణించారు. రైతు విభాగం నాయకులు ఉప్పలపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కొడవటిగంటి తిరుమలచార్యులు, వాకమళ్ళ శ్రీనివాస్, కొయ్య లక్ష్మణరావు, ఆర్.కృష్ణారావు పాల్గొన్నారు.

కే పెంటపాడులో ప్రత్యేక పూజలు

పెంటపాడు : శ్రావణ మాసం అఖరి రోజు కావడంతో ఆదివారం మండలంలోని కే పెంటపాడులో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేణుగోపాల స్వామి, అంజనేయ స్వామి ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు అభిషేకాలను ఆలయ ప్రధాన అర్చకుడు త్రిలోచన దాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈవో జగర్లమూడి వెంకట సీతరామశాస్త్రి, పూర్ణ చంద్ర త్రిపాఠి పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో వేణుగోపాల స్వామి

శ్రీవైఖానస జనజాగృతి సంఘం నూతన కార్యవర్గం

తాడేపల్లిగూడెం అర్బన్ : శ్రీవైఖానస జన జాగృతి సంఘం జల్లిసీమ శాఖ నూతన కార్యవర్గం స్థానిక డీఎస్‌చెరువు వద్ద ఉన్న కార్యాలయంలో పెద్దింటి రాధాకృష్ణామాచార్యుల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గం ఎంపికైంది. అధ్యక్షుడిగా శ్రీనివాసులలక్ష్మీ నరసింహాచార్యులు (చానమిల్లి), గౌరవాధ్యక్షుడిగా పెద్దింటి రాధాకృష్ణమాచార్యులు (తాడేపల్లిగూడెం), ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసుల ఆనందాచార్యులు (ఉండి), సహాయకార్యదర్శిగా పెద్దింటి శ్రీనివాస్ (చేబ్రోలు), వానపల్లి హనుమంతాచార్యులు (అత్తిలి), 11మంది కార్యవర్గ సభ్యులు, 8మంది స్టీరింగ్‌కమిటీ సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. తాడేపల్లిగూడెంకు చెందిన డాక్టర్ గోపాలకృష్ణ, తాడేపల్లిగూడెం, పెంటపాడు, ఉంగుటూరు, నిడమర్రు, అత్తిలి, గణపవరం, ఉండి, ఆకివీడు మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

● హలో..హలో..

తాడేపల్లిగూడెం మండల అధికారుల ఫోన్ నెంబర్‌లు

ఎంపీడీవో - రామాంజనేయశర్మ	9493742457
తహసీల్దార్-పాశం నాగమణి	9491041447
ఎంఈవో : హనుమ	9515159442
హౌసింగ్ ఏఈ: కె.రాంబాబు	7093930626
ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ : కె.రాజన్	9100121230
ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ : ఎన్ పార్వతి	9100946362
పీఆర్ డీఈ :శ్రీనివాసరావు	9989382861
ఏవో : కె.వేణుగోపాలకృష్ణ	8886612962
హెచ్‌వో :సుధీర్‌కుమార్	8374449137
ఏపీఎం : రత్నకుమారి	9949778268
ఎస్సై : వి.చంద్రశేఖర్	9440796612
ఇరిగేషన్ ఏఈ: వెంకటేశ్వరరావు	9701375829
ఐసీడీఎస్ సూపర్ వైజర్: దుర్గాభవాణి	9912565666
ఐసీడీఎస్ సూపర్‌వైజర్ : అమ్మాజీ	9908684236

హలో ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

తాడేపల్లిగూడెం	: 99854 11547
,, అర్బన్	: 9912838999
,, టౌన్	: 9966977066
,, రూరల్	: 7386843577
పెంటపాడు	: 9989983579

సినిమాలు

తాడేపల్లిగూడెం :

రంగమహల్	ఫిదా
లక్ష్మీనారాయణ-1	నేనే రాజు నేనే మంత్రి
లక్ష్మీనారాయణ-2	జయజానకి నాయక
శేషమహల్	జయజానకి నాయక
చలపతి	నేనే రాజు నేనే మంత్రి
వెంకట్రామా	లై
శ్రీపద్మజ	నక్షత్రం



మలుపులు.. ప్రమాదాలు...



పాలకోడేరు నుంచి వేంద్ర వెళ్ళే రహదారిలో మలుపు

పాలకోడేరు : ఆర్ అండ్ బీ రహదారులపై మలుపులు కొన్ని చోట్ల మృత్యుమార్గాలుగా మారాయి. రహదారుల వెంబడి మొక్కలు పెరగడంతో పాటు ఎటువంటి సూచికబోర్డులు లేకపోవడంతో పాలకోడేరు నుంచి వేంద్ర వెళ్ళే రహదారుల్లోని మలుపులు వాహనదారులకు ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి. పాలకోడేరు శివారులోనే పెదలో గిళ్ళు సమీపంలో రెండు ప్రమాదకర మలుపులు ఒకే చోట ఉన్నాయి. ఆ మలుపుల్లో ఏదో సమయంలో ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంటుంది. ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో పాటు ఓ వైపు చెరువు ఉండటం, మరోవైపు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకుండా మొక్కలు పెరగడంతో ఈ పరిస్థితి మరీ ఇబ్బందికరంగా మారింది. రోజూ ప్రయాణించేవారు మలుపులు ఉన్నాయని నెమ్మదిగా వెళుతున్నప్పటికీ అటు వైపుగా కొత్త వ్యక్తులు ప్రయాణాలు సాగించేటప్పు డు ఆ మలుపుల పరిస్థితి తెలియక ప్రమాదాల బారిన పడుతున్న ఘటనలు తరచూ జరుగుతున్నాయి. అధికారులు పట్టించుకుని ప్రమాదాలను నివారించే విధంగా సూచికబోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ఆ మలుపుల్లో వేగాన్ని తగ్గించే విధంగా స్పీడ్‌బ్రేకర్లను కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు ప్రయాణికులు అంటున్నారు.

స్టూడెంట్ వాయిస్



యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

**సుదాబత్తుల వినయ్,
బీటెక్ విద్యార్థి, ఆకివీడు**

నేడు ఉన్నత విద్య చదువుకున్నా యువతకు ఉపాధి అవకాశాలు అంత తేలిగ్గా దక్కడం లేదు. ఇంజనీరింగ్ పూర్తయిన విద్యార్థులు చాలా మంది ఉన్నారు. సరైన ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఒకప్పుడు ఇంజనీరింగ్ అని గర్వంగా చెప్పుకొనేవాళ్ళం. నేడు ఉపాధి అవకాశాలు లేక ఇంజనీరింగ్ చదువుకున్నామని చెప్పుకోవడానికే ఇబ్బందిగా ఉంది. నాణ్యమైన విద్యా ప్రమాణాలు లేకపోవడం, విద్యార్థుల్లో నైపుణ్యాలు కొరవడటం కూడా ఇందుకు కారణమే. అలాగే యువత సమయం విలువ తెలుసుకుని, తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి. సాంకేతికతను వక్రమార్గంలో వినియోగించకూడదు. ఫేస్‌బుక్, వాట్సప్ వంటి వాటితో అతిగా సమయం వెచ్చించడం యువతకు నష్టం కలిగిస్తుంది.

● ఆకివీడు



పాలకోడేరు కాలేజీలో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్న చిత్రం

పాలకోడేరులో సద్భావన దివాస్

పాలకోడేరు : యువతీ, యువకులు దేశాభివృద్ధి కోసం పాటు పడే విధంగా ఉండాలని కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, నెహ్రూ యువకేంద్ర కార్యకర్త కేతా వెంకటసూర్య అన్నారు. మండల కేంద్రమైన పాలకోడేరులోని కోఆపరేటివ్ జూనియర్ కళాశాలలో సద్భావన దివాస్ నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలను ఆదివారం నిర్వహించారు. సద్భావన దివాస్‌ను పురస్కరించుకుని నెహ్రూ యువ కేంద్రం సభ్యులు కళాశాల యువతీ, యువకులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేతా వెంకటసూర్య, ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ యువత దేశాభివృద్ధి కోసం నడుం బిగించాలన్నారు. నెహ్రూను ఆదర్శంగా తీసుకుని నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పీవీ ధర్మారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు

కాళ్ళ : కాళ్ళలో శ్రీ గగన్‌సాయి జూనియర్ కళాశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందించారు. ఫ్రెషర్స్‌డే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ సోమేష్ మాట్లాడుతూ చదువులో మంచి ప్రతిభ కనబరిచిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కళాశాల యాజమాన్యం దాసరి బాలకృష్ణ, గంధం ఉమా, దాసరి సత్యనారాయణ, వెంకటస్వామి, ఆరేటి దిలీప్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



కాళ్ళ పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి సీతారామ్

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి యూత్ కాంగ్రెస్ నేతల నివాళి

కాళ్ళ : భారతదేశ ప్రధానిగా రాజీవ్‌గాంధీ సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధికి చేసిన సేవలు ఎనలేనివని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకెం సీతారామ్ అన్నారు. కాళ్ళ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రాజీవ్‌గాంధీ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బొట్టా శ్రీనివాస్, మాదాసు హరి, నిమ్మల రాజ్‌కుమార్, గంజాల సుబ్రహ్మణ్యం, తాళ్ళూరి మాణిక్యాలరావు, మల్లాడి వీరబాబు, అంకెం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

ఏలూరుక్రైం : రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఒక వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. కాళ్ల మండలి సీసలి గ్రామానికి చెందిన గుంటికి నర్సింహులు(60) ఈనెల 15వ తేదీన ద్వారకాతిరుమల వెళ్ళి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో తిరుమల డెయిరీ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో తీవ్రగాయాలకు గురైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎంఎల్‌సిగా నమోదు చేసి ఆసుపత్రి అవుట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో దెందులూరు ఎస్‌ఐ ఎన్.ఆర్. కిషోర్ బాబు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం జరిపించి బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.



ముద్రగడకు మద్దతుగా ర్యాలీ నిర్వహిస్తున్న కాపు నాయకులు

సీఎం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

కాళ్ళ : కాపులను బీసీల్లో కలుపుతామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని అమలు చేయాలని కాపు నాయకులు డిమాండ్ చేశారు. కాళ్ళ గ్రామంలో ప్రధాన రహదారి పై ప్రదర్శన నిర్వహించారు. కాపు ఉద్యమ నాయకుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం పాదయాత్రకు అనుమతి ఇవ్వాలని, కాపులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాపుల పై ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు. ఎన్నికల్లో కాపులను బీసీల్లో చేరుస్తామని చెప్పి తమ ఓట్లతో గద్దెనెక్కిన చంద్రబాబు మాట మాత్రంగా కూడా కనీస గౌరవం ఇవ్వకుండా నిరసనకారుల పై ఉక్కుపాదం మోపడం దారుణమన్నారు. కాళ్ళ సంత మార్కెట్ నుంచి ప్రదర్శనగా బయలుదేరి వంగవీటి రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అక్కడి నుంచి ప్రదర్శనగా కాళ్ళ ఇందిరా ప్రియదర్శిని కాలనీలో అంబేద్కర్ విగ్రహం వరకు వెళ్ళారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో కాళ్ళ మండల కాపు సంఘం అధ్యక్షుడు చిన్నాపురపు రాంబాబు, ప్రధాన కార్యదర్శి గంటా బాలు, మాజీ సొసైటీ అధ్యక్షుడు గనిశెట్టి చంద్రశేఖర్, కాళ్ళ సొసైటీ ఉపాధ్యక్షుడు ఆరేటి రంగారావు, యూత్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకెం సీతారామ్, బండి మహంకాళి, పుప్పాల వాసు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

గుండె పోటుతో ఉపాధ్యాయుడి మృతి



మోహన్‌రావు(ఫైల్ ఫొటో)

పాలకోడేరు : మండల కేంద్రమైన పాలకోడేరు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు జల్లి మోహన్‌రావు(50) ఆదివారం గుండెపోటుతో మృతి చెందినట్లు సహ ఉపాధ్యాయులు తెలిపారు. పాలకోడేరు గ్రామానికి చెందిన జల్లి మోహన్‌రావు అదే గ్రామంలోని నెంబర్-2 ఎలిమెంటరీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా కొంతకాలంగా పని చేస్తున్నారు. ఈయన భార్య జల్లి మార్తమ్మ గతంలో పాలకోడేరు సర్పంచ్‌గా కూడా పని చేశారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మోహన్‌రావుకు ఎటువంటి అనారోగ్య లక్షణాలు లేనప్పటికీ ఆదివారం ఒక్కసారిగా గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈయన మృతి వార్తను తెలుసుకున్న యూటీఎఫ్ నాయకులు గోపీమూర్తి, విజయరామరాజు తదితర ఉపాధ్యాయులతో పాటు ఎంఈవో సత్యానంద్ ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

మద్యం షాపునకు వ్యతిరేకంగా మహిళల ఆందోళన

కాళ్ళ : వేంపాడు గ్రామంలో జనావాసాల మధ్య, రహదారికి ఆనుకుని మద్యం షాపు ఏర్పాటు చేయడం చాలా ఇబ్బందికరంగా మారిందని వేంపాడు గ్రామ మహిళలు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం దుకాణాన్ని తొలగించాలంటూ వేంపాడు గ్రామ మహిళలు, స్థానికులు ఆదివారం నాడు ఆందోళన చేశారు. మద్యం షాపును మూసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ మద్యం షాపును తొలగించాలంటూ ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఎక్సైజ్ అధికారులకు కూడా మద్యం షాపు విషయాన్ని తెలిపినా తొలగించలేదన్నారు. ఇళ్ళకు చేర్చి మద్యం షాపు ఉండటం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీనికి తోడు ఈ మద్యం షాపు చినఅమిరం-భీమవరం వెళ్ళేమార్గం మీద ఉందని, ఈ దారిన వెళ్ళేందుకు మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం షాపు ఏర్పాటు చేసేటప్పుడు అడ్డుకున్నామని, ఒక వారం రోజుల్లో వేరే స్థలంలోకి మారుస్తామని మాట ఇచ్చారని, అయినా ఇంత వరకు మద్యం షాపును మార్చలేదన్నారు. సుమారు దాదాపు నాలుగు గంటల పాటు ఆందోళన నిర్వహించారు. ఎక్సైజ్ అధికారులు, మద్యం వ్యాపారులు స్పందించి మద్యం షాపును వేరే ప్రాంతానికి మార్చాలని వేంపాడు గ్రామ మహిళలు, స్థానికులు కోరుతున్నారు.



వేంపాడులో బ్రాందీషాపును మూసివేసి ఆందోళన చేస్తున్న మహిళలు, స్థానికులు.

హలో... ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

కాళ్ళ :	9397139966
పాలకోడేరు :	9866283848
ఉండి :	9493476701
ఆకివీడు :	9440364437
„ రూరల్ :	9030966667

సినిమాలు

ఆకివీడు :

విజయ ఏసీ	జయ జానకి నాయక
విజయ మినీ ఏసీ	ఆనందోబ్రహ్మ
వెంకటలక్ష్మి	నేనే రాజు నేనే మంత్రి
సంగీత	లై
శ్రీవెంకట గంగారత్నం	మాయా మాల్

ఉండి ఇరిగేషన్ ఇన్‌చార్జి డీఈగా వెంకటేశ్వరరావు


వెంకటేశ్వరరావు

ఉండి: ఉండి ఇరిగేషన్ ఇన్‌చార్జ్ డీఈగా వెంకటేశ్వరరావును నియమించారు. ఇక్కడ డీఈగా పనిచేసిన కె.ఎ. పద్మశ్రీ తిరుపతికి ట్రాన్స్‌ఫర్ అయ్యారు. దాంతో ఇక్కడ ఎవరిని నియమించకపోవడంతో ఖాళీ ఏర్పడింది. ఉండి మండలం యండగండి కార్యలయంలో ఏఈగా పనిచేస్తున్న వెంకటేశ్వరరావును ఇన్‌చార్జ్ డీఈగా నియమించారు. ఈయన గతంలో కూడా ఇక్కడ ఇన్‌చార్జ్ డీఈగా పనిచేశారు. మరోసారి కూడా ఈయనకు బాధ్యతలను అప్పగించారు.

రైల్వే సమాచారం

ఆకివీడు నుంచి నుంచి గుడివాడ వైపు


నెంబర్ రైలు పేరు సమయం

17016 విశాఖ ఎక్స్‌ప్రెస్- రాత్రి 10.05నిలకు,
17209 శేషాద్రి ఎక్స్‌ప్రెస్- రాత్రి 8.46నిలకు
-17644 సర్కార్ ఎక్స్‌ప్రెస్‌రాత్రి 6.07నిలకు,
ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్-18519 ఉదయం 3.59నిలకు,
17255 నర్సాపురం ఎక్స్‌ప్రెస్- రాత్రి 8.17నిలకు
17407 తిరుపతి-నర్సాపురం ఎక్స్‌ప్రెస్- రాత్రి 6.46నిలకు,
17231నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్- ఆదివారం-శుక్రవారం (వయా గుంటూరు మీదుగా), మిగతా రోజుల్లో-17213 రైలు వయా ఖమ్మం-వరంగల్ మీదుగా ఉదయం 11.34నిలకు,
17479 హౌరా ఎక్స్‌ప్రెస్ (పూరి-తిరుపతి) బిలాస్‌పూర్ నుంచి ఆదివారం-బుధవారం 17481, మిగతా రోజుల్లో-ఉదయం 5.30నిలకు,

ఆకివీడు నుంచి భీమవరం వైపు

ఆకివీడు స్టేషన్ నుంచి భీమవరం వైపు వెళ్ళేవి
విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు- 17015 ఉదయం 00.59నిలకు,
శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు- 17210 ఉదయం 2.55నిలకు,
సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలు- 17643 ఉదయం 5.28నిలకు,
ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ రైలు- 18520 ఉదయం 5.57నిలకు,
నర్సాపురం ఎక్స్‌ప్రెస్ రైలు- 17256 ఉదయం 6.27నిలకు,
తిరుపతి-నర్సాపురం- రైలు- 17403 ఉదయం 4.39నిలకు,
నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ రైలు- 17232 మంగళవారం-ఆదివారం (వయా గుంటూరు మీదగా), మిగతా రోజుల్లో-17214 వయా ఖమ్మం-వరంగల్ మీదుగా ఉదయం 7.52నిలకు,
హౌరా ఎక్స్‌ప్రెస్ (పూరి-తిరుపతి) బిలాసపూర్‌కు ఆదివారం-గురువారం 17482, మిగతా రోజుల్లో -17480 ఉదయం 8.54,
కోకినాడ ఎక్స్‌ప్రెస్ ఏసీ వారానికి రెండు రోజులు ఆదివారం-బుధవారం 12775 ఉదయం 3.51నిలకు
గుడివాడ పాసింజర్ రైలు-77202 ఉదయం 5.46నిలకు,
నర్సాపురం పాసింజర్ రైలు-77231 ఉదయం 10.17నిలకు,
గుంటూరు పాసింజర్ (మాచర్ల) రైలు-57318 మధ్యాహ్నం 1.57నిలకు,
నర్సాపురం పాసింజర్ రైలు-77204 సాయంత్రం 5.03నిలకు,
గుడివాడ పాసింజర్ రైలు-77264 రాత్రి 7.51నిలకు,
మచిలీపట్నం పాసింజర్ రైలు-57229 రాత్రి 11.35నిలకు,
పాస్ట్ పాసింజర్ రైలు-57381 రాత్రి 8.42నిలకు.

ఆక్వా ధరలు




కట్లా-బొచ్చె	రూ.104=00	**వనామి రొయ్య ధర కేజీలో**	
శీలావతి	రూ.102=00	30 కౌంట్	రూ.430=00
పండుగప్ప	రూ.350=00	40 కౌంట్	రూ.380=00
గడ్డిచేప	రూ. 90=00	50 కౌంట్	రూ.330=00
రూప్‌చంద్	రూ. 85=00	60 కౌంట్	రూ.300=00
బంగారుతీగ	రూ. 90=00	70 కౌంట్	రూ.280=00
వాలుగ	రూ.140=00	80 కౌంట్	రూ.270=00
కొరమీను	రూ.330=00	90 కౌంట్	రూ.240=00
ఫంగస్	రూ. 58-00	100 కౌంట్	రూ.230=00

అధికారుల ఫోన్ నెంబర్లు

ఉండి తహసీల్దార్- దుర్గాకిశోర్ 9491041459
ఎండీవో (ఇన్‌చార్జి)- రెడ్డియ్య 9493742460
ఎంఈవో - సూర్యనారాయణమూర్తి 9515159454
వ్యవసాయాధికారి- రాజేష్ 8886612983
ఏపీఎంవో - రాజేష్ 9959442246
ఎస్‌ఐ - రవివర్మ 9440796648
ఇరిగేషన్ డీఈ - వెంకటేశ్వరరావు 9848855557
ఆర్‌అండ్‌బీ ఏఈ - రామరాజు 9440818719

లయన్స్ ఆధ్వర్యంలో మధుమేహంపై ఉద్యమం

● లయన్స్ ఇంటర్‌నేషనల్ డైరెక్టర్ వేగేశ్న విజయకుమార్ రాజు

ఆకివీడు: గ్రామాల్లో మధమేహం వ్యాధి అంతుచిక్కకుండా పెరిగిపోయి ప్రాణాలు హరిస్తుండడంతో దానిని నివారించడానికి లయన్స్ ఉద్యమం చేపడుతోందని లయన్స్ ఇంటర్నేషనల్ డైరక్టర్ వేగేశ్న విజయకుమార్‌రాజు అన్నారు. సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా పంచసూత్రాలు మధుమేహం, పర్యావరణం, ఆకలితీర్చడం, కంటిచూపు, క్యేన్సర్... వాటిపైనే లయన్స్ ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. లయన్స్‌లో 210 దేశాల్లో 14 లక్షలమంది సభ్యులు సేవలందింస్తున్నారన్నారు. లయన్స్ తరపున తట్టు-రూబెల్లా ఎంఆర్ వ్యాక్సిన్‌లకు సంబంధించి 2000 సంవత్సరంలోనే ప్రభుత్వాలతో కలిసి పనిచేశామన్నారు. ఇండియా మొత్తం తొమ్మిది నెలల నుంచి పదిహేనేళ్ల లోపు 44కోట్ల మంది పిల్లలున్నారన్నారు. దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో రెండు విడతల్లో మొదత విడతగా తమిళనాడు, పాండిచ్చేరి, గోవా, కర్ణాటక, లక్షదీవులు, రెండో విడతగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఉత్తరాఖండ్, కేరళ, హిమాచల్‌ప్రదేశ్, చండీగడ్ కేంద్ర పాలిత ప్రాంతాలకు మాత్రమే ఎంఆర్ వ్యాక్సిన్ అందించడం జరిగిందన్నారు. ఏపీలో ఇప్పటివరకూ 81,71,151 మంది చిన్నార్లుకు ఎంఆర్ వ్యాక్సిన్ అందచేశామని, జిల్లాలో 5,76,687 మంది చిన్నారులకు అందించామన్నారు. ఈ ఏడాది నవంబర్ 14 నుంచి భారతదేశంలో మధుమేహంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామన్నారు. ప్రజలు సహకరిస్తే సేవలందించడానికి లయనిజం ముందుంటుందన్నారు. కార్యక్రమంలో సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చిలువూరి కృష్ణంరాజు, ఆర్‌వీఎస్ సూర్యనారాయణరాజు, మురళీమోహన్‌రావు ఉన్నారు.


ఎంఆర్ వ్యాక్సిన్ బెలూన్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు


ఆకివీడులో వరసిద్ధి వినాయక కల్యాణ మహోత్సవ ఆహ్వాన శుభపత్రికను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

25 నుంచి గణేశ్ నవరాత్రి ఉత్సవాలు...

ఆకివీడు: వరసిద్ధి వినాయక చవితి నవరాత్రోత్సవాలు ఈ నెల 25 నుంచి సెప్టెంబర్ 3 వరకూ జరుగుతాయని ఆలయ అధ్యక్ష-కార్యదర్శులు నందిగామ ఫణి, గంధం ఉమా అన్నారు. ఆదివారం స్థానిక శాంతినగర్‌లోని వరసిద్ధి వినాయక ఆలయంలో కల్యాణ మహోత్సవ ఆహ్వాన శుభపత్రిక విడుదల చేసి విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 22న కల్యాణమూర్తులను దాతల గృహాల నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 23న కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. 25న వినాయక చవితి నవరాత్రోత్సవాల్లో భాగంగా.., ప్రతీరోజూ పూజా కార్యక్రమాలు, నిత్యహోమాలు, పూర్ణాహుతి ప్రసాద వితరణ ఉంటాయన్నారు. సెప్టెంబర్ 3న కల్యాణ-ఉత్సవ మూర్తులకు పల్లకీ-రథం పైన సంప్రదాయ పద్ధతుల్లో ఊరేగింపు జరుపుతామన్నారు. 10న దాతల సహకారంతో ఘనంగా అన్నదాన కార్యక్రమం చేపట్టామన్నారు. మహిమగల వినాయక స్వామిని భక్తులు ప్రతీరోజూ దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించగలరన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గమిని సురేష్, వర్ధకవి వీరభద్ర రాజు, గంట్ల శివ, చింతలపాటి సీతారామరాజు, సమయమంతుల గోపి, వాడపల్లి మోహన్, బండి సాంబశివరావు, ఆలీషా, గోపాలకృష్ణ, రమేష్, గౌరినాయుడు, గొల్లంగి శ్రీను, నాగేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

'పంచాయతీ పాలకవర్గం తాగునీరందించడం లేదు'

ఆకివీడు: గ్రామ ప్రజలకు తాగునీరు అందించలేని పరిస్థితిలో ఆకివీడు పంచాయతీ పాలకవర్గం ఉందని, సీపీఎం జిల్లా కమిటి సభ్యుడు బి.వాసుదేవ రావు విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం మండల కమిటీ షేక్ వలీ అధ్యక్షతన సమావేశం జరిగింది. వాసుదేవరావు, మండల కార్యదర్శి తవిటినాయుడు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో తాగునీరు కలుషితమై ప్రజలను అనారోగ్యాలకు గురిచేస్తోందన్నారు. వాంతులు, విరోచనాలు, టైఫాయిడ్‌లతో బాధితులు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజా సమస్యలు గాలికొదిలేసి ఆక్వాహబ్, నంద్యాల ఉప ఎన్నికల చుట్టూ తిరుగుతున్నారన్నారు. గ్రామంలోని సమతానగర్, రజక-ముస్లిం వీధులు, శ్రీనగర్‌కాలనీతో పాటు 17వ వార్డులో తాగునీరు పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు. కొన్ని వార్డుల్లో కుళాయి నీటి విడుదల సమయంలో విద్యుత్ నిలుపుదల చేస్తేనే తాగునీరు అందుతోందన్నారు. మోటార్లు వినియోగించడం వలన శివారు ప్రాంతాలకు తాగునీరు వెళ్ళడం లేదని వర్షాలతో రహదారులు, పారిశుధ్యం పరిస్థితి అధ్వానంగా మారిందన్నారు. ఫిల్టర్‌బెడ్‌లో ఇసుక మార్చాలన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పెంకి అప్పారావు, కిసింజర్, బి.రాంబాబు, ఎస్.శంకర్, సందక సూరిబాబు, షేక్ బాజీ తదితరులు ఉన్నారు.

లయన్స్ సేవలు విశ్వవ్యాప్తం...

ఏలూరు ఎంపీ మాగంటి బాబు

ఆకివీడు: లయనిజమంటేనే సేవ అని.. ఏలూరు ఎంపీ మాగంటి బాబు, లయన్స్ ఇంటర్నేషనల్ డెరెక్టర్ వేగేశ్న విజయకుమార్‌రాజు అన్నారు. అవార్డు గ్రహీతకు ఆత్మీయ సన్మాన సమావేశంలో అంబాసిడర్ ఆఫ్ గుడ్‌విల్ అవార్డు గ్రహీత డాక్టర్ ఎంవీఎస్ రాజు దంపతులను వారు సన్మానించి మాట్లాడారు. భారతదేశంలో లయనిజానికి మంచి పేరుందన్నారు. ఆకివీడు లయన్స్ అంటేనే డాక్టర్ ఎంవీఎస్ అని వారన్నారు. ఈ ప్రాంతానికో విశిష్టత ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా లయన్స్ సేవలందిస్తుందని వారు గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతంలో కూడా క్లబ్ సేవలందిస్తోందన్నారు. అవార్డు గ్రహీత డాక్టర్ ఎంవీఎస్ రాజు మాట్లాడుతూ ఆకివీడు క్లబ్‌లు తనకు సహకారం అందించడం వల్లనే ఇంతటి గొప్ప అవార్డు అందుకున్నానన్నారు. కార్యక్రమంలో పాస్ట్ ఇంటర్నేషనల్ డెరెక్టర్, విద్యాసేవ శాంతి యజ్ఞాల రూపకర్త, మాజీ ఎమ్మెల్సీ చిగురుపాటి వరప్రసాద్, జిల్లా గవర్నర్ కేవీ కిషోర్ కుమార్, మూల్పూరి ఉపేంద్ర, చిలువూరి కృష్ణంరాజు, డీవీ సుబ్బారావు, ఎంఎల్‌వీ ప్రసాద్, కాకరాల వేణుబాబు, డాక్టర్ బాబ్జీ తదితర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


అంబాసిడర్ ఆఫ్ గుడ్‌విల్ అవార్డు గ్రహీత పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎంవీఎస్ రాజు దంపతులను సన్మానిస్తున్న ఏలూరు ఎంపీ మాగంటి బాబు

నేటి నుంచి ఉపాధ్యాయులకు టెలీ కాన్ఫరెన్స్

ఉండి: నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే ద్వారా విద్యార్థుల్లో అభ్యాసన ఫలితాలు పరీక్షించేందుకుగాను ఉపాధ్యాయులకు అవగాహన కల్పించడానికి టెలికాన్ఫరెన్సు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఈవో సూర్యనారాయణమూర్తి తెలిపారు. ఈనెల 21, 22, 23 తేదీల్లో ఈ టెలీ కాన్ఫరెన్సు కార్యక్రమాన్ని ఏర్పాటుచేసినట్లు విద్యాశాఖ వారు తెలిపారు. దీనిలో భాగంగా సోమవారం ఉదయం ప్రాథమిక పాఠశాలలో సగం మంది ఉపాధ్యాయులు టెలీకాన్ఫరెన్సుకు హాజరుకావాల్సిఉంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ కాన్ఫరెన్స్ ఉంటుందని తెలిపారు. 22వ తేదీన మిగతా ఎలిమెంట్రీ ఉపాధ్యాయులు హాజరుకావాలన్నారు.


సిద్ధాపురం ఎంపీపీ పాఠశాలలో పరీక్ష రాస్తున్న వయోజనులు

వయోజన విద్యపై ప్రత్యేక దృష్టి

సిద్ధాపురం(ఆకివీడురూరల్) : గ్రామాల్లో నిరక్ష్యరాస్యులైన వయోజనులకు విద్య బోధించి వారికి పరీక్షలు నిర్వహించి అక్షరాస్యులుగా తీర్చి దిద్దేందుకు, ఎన్‌ఐఓఎస్, ఆదివారం పరీక్ష నిర్వహించింది. మండలంలోని 23 సెంటర్లలో 496 మంది పరీక్షలు రాశారు. గతంలో జరిగిన పరీక్షలో ఫెయిల్ అయినవారు దీనికి హాజరయ్యారు. వయోజనులు, గ్రామం సంఘాలలో ఉన్న నిరక్ష్యరాస్యులను అక్షరాస్యులుగా చేసేందుకు వారికి విద్య నేర్పించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. వెలుగు, డీఆర్‌డీఏ ఈ ఏర్పాట్లు చేసింది. మండలంలోని 23 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పరీక్షలు జరిగాయి.


ఉండి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న తిరుపతి ఎండోమెంట్ ఏఈ మంతెన వెంకట్రామచంద్రరాజు

ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

ఉండి: శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తిరుపతి ఎండోమెంట్ ఏఈ మంతెన వెంకట్రామచంద్రరాజు అన్నారు. ఆదివారం ఉండిలో శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఆయనకు ట్రస్టుబోర్డువారు సాదరంగా స్వాగతం పలికారు. ఆయన దృష్టికి పలు సమస్యలను తీసుకుని వచ్చారు. ఆలయం విశిష్టతను వివరించి, ఆలయంలో ప్రత్యేక కల్యాణమండపానికి నిధులు మంజూరుచేయాలని కోరారు. దానిపై ఏఈ వెంకట్రామచంద్రరాజు మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గంగుమోలు పేరయ్య, ఇతర సభ్యులతోపాటు ముదునూరి కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

వయోజనులకు పరీక్షలు

నిడమర్రు: మండలంలో వయోజన విద్యా పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు వెలుగు ఏపీఎం రత్నకుమార్‌బాబు తెలిపారు. మండలంలోని పెదనింద్రకొలను, చిననింద్రకొలను, నిడమర్రు, భువనపల్లి, చానమిల్లి పరీక్షా కేంద్రాల్లో 660 మంది వయోజనులు పరీక్షలు రాశారు. డ్వాక్రా గ్రూప్ టీమ్‌లీడర్లు, ఉపాధ్యాయులు ఇన్విజిలేటర్లుగా వ్యవహరించారు.

వెటర్నరీ అసిస్టెంట్ మల్లిపూడికి అభినందన

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం బొమ్మిడి పశువైద్యశాలలో జూనియర్ వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మల్లిపూడి చిన్నబాబురావు సేవలను పలువురు కొనియాడారు. స్వాతంత్ర్య దినోత్సవంలో ఆయనకు సేవా పురస్కారం లభించిన సందర్భంగా ఆదివారం గ్రామంలో ఆయన్ని అభినందించారు.

దిక్కులేని గోదావరి మిల్క్ ప్రాజెక్టు

ఎవరికీ పట్టని పాలశీతలీకరణ కేంద్రం
ప్రారంభించిన కొద్దికాలానికే మూత
తుప్పుపడుతున్న యంత్రాలు



నిడమర్రులో మూతపడిన పాలశీతలీకరణ కేంద్రం

నిడమర్రు: పాలశీతలీకరణ కేంద్రం మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. 2012లో అప్పటి పర్యాటక శాఖ మంత్రి వట్టివసంత్‌కుమార్ చేతులమీదుగా ప్రారంభమైన నిడమర్రు పాలశీతలీకరణ కేంద్రం కొద్దికాలానికే మూతపడడంతో దాని లక్ష్యం నెరవేరకుండా పోయింది. గ్రామీణ ప్రాంతంలో రైతాంగానికి చేదోడువాదోడుగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు రూ.20లక్షలతో పాల శీతలీకరణ కేంద్రాన్ని ప్రారంభించింది. డీఆర్‌డీఏ, పశుసంవర్ధకశాఖ, ఐకెపీ, ఏపీబిడియస్సీ సంస్థలు సంయుక్తంగా గోదావరి మిల్క్ ప్రాజెక్టు పేరుతో పాల శీతలీకరణ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. గ్రామాల్లో మహిళలకు ఉపాధి కల్పించడానికి ఈ శీతలీకరణ కేంద్రాన్ని ఏర్పాటుచేయడంతో ప్రారంభమైన సంవత్సరంలోనే పనిచేయక నిరూపయోగంగా మారింది. ఏ అధికారి ఈ కేంద్రంపై కన్నెత్తిచూడకపోవడంతో భవనం నిరూపయోగంగా మారడంతో పాటు లోపల ఉన్న యంత్ర సామగ్రి కూడా తుప్పుపడుతున్నాయి. యంత్రపరికరాలు పాడవుతున్నా ఏ అధికారి, ప్రజాప్రతినిధి కన్నెత్తిచూసిన దాఖలాలు లేవు. ప్రభుత్వం పాలశీతలీకరణ కేంద్రాన్ని బాగుచేయించి గాడిలో పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. మండలంలోని 17గ్రామాలకు చెందిన చిన్న, సన్నకారు రైతాంగం ఉదయంపూట వ్యవసాయ పనులకు వెళ్ళి సాయంత్రం పశుపోషణను ప్రధానవృత్తిగా ఎంచుకుంటున్నారు. ప్రతి రోజూ రైతులు తమ పాలను ప్రైవేటు పాల కేంద్రాలకు విక్రయించుకుంటున్నారు. ప్రైవేటు, దళారులు, పాల వ్యాపారుల చేతుల్లో రైతాంగం మోసానికి గురవుతున్నా పట్టించుకునే నాధుడే లేడని వాపోతున్నారు. ఇటీల కొంత మంది పాలవ్యాపారులు రైతుల నుంచి పాలను సేకరించి తిరిగి వారికి సొమ్ములు చెల్లించకపోవడంతో రైతులు నష్టపోయారు. ప్రభుత్వపాల శీతలీకరణ కేంద్రం పనిచేస్తే తమకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని రైతులు



తుప్పుపడుతున్న సామగ్రి

అంటున్నారు.

కేంద్రం తెరిచేందుకు చర్యలు

యం.రత్నకుమార్ - వెలుగు ఏపీవో



అధికారుల ఆదేశాల మేరకు పాలశీతలీకరణ కేంద్రాన్ని పునరుద్ధరించడానికి చర్యలు చేపట్టాం. యువకులు కానీ, డ్వాక్రాసభ్యులు కానీ ముందుకు వస్తే ప్రభుత్వపరంగా రాయితీలు అందించడానికి సిద్ధంగా ఉన్నాం. పాలశీతలీకరణ కేంద్రాన్ని తెరవడానికి ఏర్పాట్లు చేస్తున్నాం.



పరీక్షలు రాస్తున్న వయోజనులు

వయోజన విద్యా పరీక్షలు

భీమడోలు: మండలంలోని పలు గ్రామాల్లో వెలుగుశాఖ ఆధ్వర్యంలో ఆదివారం వయోజన విద్యా పరీక్షలు నిర్వహించారు. భీమడోలు, అంబరుపేట, గుండుగొలను, ఆగడాలలంక, పూళ్ళ గ్రామాల్లో జరిగిన పరీక్షల్లో 176 మంది వెలుగు మహిళలు పరీక్షలు రాశారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యతను రూపుమాపేందుకు ప్రభుత్వం వెలుగు ఆధ్వర్యంలో వయోజనావిద్యా కార్యక్రమాలను అమలు చేస్తున్నది. అభ్యాసనా కార్యక్రమాల అనంతరం పరీక్షలు నిర్వహించి వెలుగుమహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తామని వెలుగు ఏపీఎం బాపూజీ తెలిపారు.

యువత లక్ష్యాలను ఎంచుకోవాలి

భీమడోలు: యువత లక్ష్యాలను ఎంచుకుని అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ ప్రతీ క్రైస్తవ ప్రార్ధనామందిరాల్లో ప్రార్ధనలు నిర్వహించాలని భీమడోలు పరిశుద్ధ ఆరోగ్యమాత విచారణకర్త ఫాదర్ జాకబ్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రార్ధనామందిరంలో ఆదివారం ఏలూరు బిషప్ జయరావు పొలిమేర ఆదేశాల మేరకు నిర్వహించిన యువ సదస్సులో పాల్గొన్న ఫాదర్ జాకబ్ యువతను ఉద్దేశించి మాట్లాడారు. యువత జీవితంలో ఎదురయ్యే సమస్యలు గురించి, ప్రస్తుత సమాజధోరణ గురించి వివరించారు. యువత అన్నిరంగాల్లో ముందుకు వెళ్ళేవిధంగా లక్ష్యసాధనను గుర్తుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ కాకి చార్లెస్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

గణపవరం :	
మహాలక్ష్మి	జయ జానకి నాయక
కుమారి	నేనే రాజు నేనే మంత్రి
భీమడోలు :	
శ్రీనివాస	జయ జానకి నాయక



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మాగంటి బాబు

నంద్యాల సీటు టీడీపీదే

ఎంపీ మాగంటి బాబు

గణపవరం: నంద్యాలలో జరుగుతున్న ఉప ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమని, మెజార్టీపైనే దృష్టి పెట్టామని ఏలూరు పార్లమెంట్ సభ్యులు మాగంటి వెంకటేశ్వరరావు (బాబు) అన్నారు. ఆదివారం గణపవరంలో నూతనంగా నిర్మించిన ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నంద్యాలలో సీఎం చంద్రబాబునాయుడు నిర్వహించిన ప్రచార సభలకు ప్రజలు తండోపతండాలుగా హాజరుకావడమే తమ పార్టీ విజయానికి సంకేతాలన్నారు. జగన్ తన భాష తీరు మార్చుకోవాలని, చంద్రబాబునాయుడుపై లేనిపోని అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రతిపక్షనాయకుడికి సరికాదని హితవుపలికారు. రాష్ట్రం విడిపోయి లోటు బడ్జెట్‌తో ఉన్న తరుణంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతరం శ్రమిస్తూ నవ్యాంధ్రను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లాఉపాధ్యక్షులు నంద్యాల మదన్‌మోహన్ లచ్చిరాజు, మండలపరిషత్ ఉపాధ్యక్షులు సరిపల్లె శ్రీనివాసరాజు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు దండు వెంకట్రామరాజు (రాము), శివాలయం కమిటీ ఛైర్మన్ జంపన శ్రీనివాసరాజు, పట్టణ టీడీపీ అధ్యక్షులు ఎల్‌కె శ్రీనివాసరాజు, టీడీపీ మండల ప్రచారకార్యదర్శి తోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వాగ్దానాలు మరచిన టీడీపీ

వైసీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోటగిరి

ఉంగుటూరు: ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ ఇచ్చిన వాగ్దానాలు తుంగలోకి తొక్కిందని వైసీపీ ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోటగిరి శ్రీధర్ విమర్శించారు. ఆదివారం ఉంగుటూరులోని పాతూరు వారి కళ్యాణమండపంలో మండల వైసీపీ బూత్‌కమిటీల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీధర్ మాట్లాడుతూ తమ పార్టీ ప్రజా సమస్య పరిష్కారమే ఎజెండాగా ముందుకు వెళ్తున్నదన్నారు. నియోజకవర్గ కన్వీనర్ పుప్పాలవాసుబాబు వైసీపీ ప్రవేశపెట్టనున్న నవరత్నాలు కార్యక్రమాన్ని స్క్రీన్‌పై ఫోటోలతో సహా వేసి కార్యకర్తలకు, బూత్‌కమిటీల సభ్యులకు వివరించారు. బూత్‌కమిటీల సభ్యులు ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం చేస్తున్న తప్పులను వివరిస్తూ వైసీపీ ప్రవేశపెట్టనున్న నవరత్నాల గురించి వివరించాలన్నారు. ఈసమావేశంలో ఉంగుటూరు కన్వీనర్ మరడా వెంకటమంగారావు, గ్రామాధ్యక్షులు కోరాడ శివ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోటగిరి శ్రీధర్

కాలుష్య నివారణకు మొక్కలు నాటాలి

గణపవరం: కాలుష్య నివారణకు ప్రతీఒక్కరూ మొక్కలు నాటాలని మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు ఇంటూరి చంద్రమోహన్‌రావు పిలుపునిచ్చారు. మొయ్యేరులో ఆయన మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలన్నారు. మొయ్యేరు సొసైటీ అధ్యక్షులు ఇంటూరి పాపారావుచౌదరి మాట్లాడుతూ చెట్లను నరికివేయడం వల్ల కార్బన్‌డయాక్సైడ్ పెరిగి ఆక్సిజన్‌శాతం తగ్గి ప్రజలకు క్యాన్సర్ వంటి రకరకాల వ్యాధులు వస్తున్నాయన్నారు. మొక్కల పెంపకంపై ప్రజలకు చైతన్యం కల్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామాధ్యక్షులు కానుమిల్లి వెంకటేశ్వరరావు (చంటి), పార్టీనాయకులు వీరవల్లి శ్రీనివాస్, గోతం రామకృష్ణ, గ్రామకార్యదర్శి సునీల్‌రాజు, డ్వాక్రా మహిళలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఇంటూరి



కైకరంలో సింగమ్మ తల్లిని ఊరేగిస్తున్న దృశ్యం

సింగమ్మ అమ్మవారి వార్షికోత్సవం

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం కైకరంలో శతాబ్ధాల క్రితం పంట పొలాల్లో వెలిసిన సింగమ్మఅమ్మవారి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం అమ్మవారిని ఆలయం నుంచి పుట్టినిల్లు అయిన అద్దేపల్లిశేషయ్య ఇంటికి తీసుకువచ్చారు. అనంతరం అక్కడ ప్రత్యేకపూజలు చేసి అమ్మవారికి నూతన వస్త్రాలు బహుకరించి మేళతాళాలు, బాణసంచాకాల్పులు, ముత్తైదువులతో గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టినింటివారైన శేషయ్య, జయలక్ష్మి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు శానం నరసింహారావు, పుప్పాల గోపి, శానం పూర్ణచంద్రరరావు, గోపాలకృష్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.

జగన్నాథపురంలో చోరీ



చిందరవందరగా పడేసిన సామగ్రి

గణపవరం: జగన్నాథపురంలో శనివారం రాత్రి వేగేశ్న శ్రీనివాసరాజు ఇంట్లో దొంగతనం జరిగింది. శనివారం అర్ధరాత్రి ముసుగులు వేసుకుని చేతికి గ్లౌజులు ధరించిన ఇద్దరు దొంగలు ఇంట్లోకి ప్రవేశించారు. ఇంట్లో పని చేసే శ్రీను నిద్రపోతుండగా పీకపై కత్తి పెట్టి గదిలో పెట్టి తలుపులు వేశారు. మరోగది తాళాలు పగలకొట్టి సాయిబాబా దేవాలయానికి చెందిన సుమారు రూ.30వేల చిల్లరమూట, కొన్నివిలువైన దుస్తులు, స్వల్పంగా వెండి, బంగారపు వస్తువులు బ్యాగ్‌లో పెట్టుకుని బయటకు వచ్చారు. మెయిన్‌రోడ్డుపై గూర్ఖా కనిపించడంతో చిల్లరమూటను అక్కడే వదిలేసి పరారయ్యారు. ఇంటి యజమాని శ్రీనివాసరాజు హైదరాబాద్ వెళ్ళారని తెలిసిన వ్యక్తులే ఈ దొంగతనానికి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. ఈమేరకు గణపవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.